# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

19.12.2025 శుక్రవారం Friday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 169 | పేజీలు : 8 Pages : 8 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789




## గ్రూప్-3 ఫలితాలు విడుదల

.. వివరాలు 3లో

## ఫోన్ ట్యాపింగ్ దర్యాప్తునకు మరో సిట్

నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ నాయకత్వం



.. వివరాలు 3లో

## టాంజానియాలో నల్లగొండవాసి మృతి



.. వివరాలు 3లో

# వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే రిపీట్



- పంచాయతీ ఫలితాలు మా పాలనకు గీటురాయి
- రెండేళ్ల మా పాలన పట్ల ప్రజల్లో సానుకూలత
- కంటోన్మెంట్, జూబ్లీహిల్స్‌లో సైతం ఆదరించారు
- బీఆర్ఎస్, బీజేపీకి 3-శాతం కూడా సీట్లు దక్కలేదు
- ఇప్పటికైనా బీఆర్ఎస్ బుద్ధిగా మసలుకోవాలి
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, డిసెంబర్ 18:** మూడు దశల్లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అద్భుతమైన ఫలితాలను సాధించిందని.. 2029 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృత మవుతాయని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మా రెండేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు ఈ ఫలితాలని ఆయన అభివర్ణించారు. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీని ప్రజలు

మిగతా 3 లో

## స్థానిక, మున్సిపల్ ఎన్నికలపై త్వరలో నిర్ణయం

03

- అందరితో చర్చించి ఓ నిర్ణయానికి వస్తాం: సీఎం

## దమ్ముంటే కేసీఆర్ చర్చకు రావాలి

- నదీ జలాలపై బీఆర్ఎస్ ద్రోహం
- అసెంబ్లీలో ఎప్పుడైనా చర్చిస్తాం
- కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి సవాల్

03



## ప్రధాని మోడీకి మరో గౌరవం

- 'ఆర్డర్ ఆఫ్ ఒమన్' పురస్కారం ప్రదానం

04



## తెలంగాణ సర్కార్‌కు భారీ ఊరట

102 ఎకరాల భూమి అటవీశాఖదే అని తేల్చిన సుప్రీం

స్వాధీనం చేసుకుని నోటిఫై చేయాలని సీఎస్‌కు ఆదేశం

03

సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి భారీ ఊరట లభించింది. రూ.15 వేల కోట్ల విలువైన భూములపై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. వనస్థలిపురం దగ్గర ఉన్న 102 ఎకరాల భూమి తెలంగాణ రాష్ట్ర పరిధిలోని అటవీ శాఖదేనని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.

## కోర్టు సమయం వృథా చేస్తారా?

హీరా గ్రూప్‌నకు భారీ జరిమానా

5కోట్ల జరిమానా విధించిన హైకోర్టు



03

నౌహీరా షేక్‌కు చెందిన హీరా గ్రూప్‌నకు హైకోర్టు భారీ జరిమానా విధించింది. రూ.5 కోట్ల జరిమానా విధించిన న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక... ఆ మొత్తాన్ని 8 వారాల్లో పీఎం సహాయ నిధికి జమ చేయాలని హీరా గ్రూప్‌ను ఆదేశించారు.



# 'వీబీ జీ రామ్ జీ' బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- లోక్‌సభలో ప్రతులు చించి నిరసన తెలిపిన విపక్షం
- వెల్‌లోకి దూసుకెళ్లి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన
- మహాత్ముడి పేరు మార్పు దుర్మార్గమని విమర్శలు
- గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్నామన్న శివరాజ్‌సింగ్

'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' స్థానంలో కేంద్రం కొత్తగా తీసుకొస్తున్న 'వికసిత్ భారత్ రోజ్ గార్ ఆజీవికా హామీ మిషన్ గ్రామీణ్' బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. విపక్షాల నిరసనల మధ్యే వీబీ జీ రామ్ జీ బిల్లుకు ఆమోదం లభించింది. ఆమోద సమయంలో వెల్‌లోకి వచ్చిన విపక్ష సభ్యులు బిల్లు ప్రతులు చించి విసిరేశారు. బిల్లు ఆమోదం తర్వాత సభ శుక్రవారానికి వాయిదా పడింది. బిల్లుపై చర్చలో భాగంగా మాట్లాడిన కేంద్రవ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో అనేక లోపాలు ఉన్నాయని అన్నారు.

వివరాలు 4వ పేజీలో



మహాత్మాగాంధీని అవమానించేందుకే కొత్తగా జి రామ్ జీ బిల్లును తీసుకుని వచ్చారని కాంగ్రెస్ ఎంపి ప్రియాంకగాంధీ ఆరోపించారు. సభ వాయిదా పడిన తరువాత పార్లమెంట్ వెలుపల ప్రియాంక గాంధీ వాద్రా మీడియాతో మాట్లాడారు.

## మహాత్ముడిని అవమానించారు

రాష్ట్రాలపై భారం మోపేలా బిల్లు: ప్రియాంక

4

ప్రతులను చించివేయడం సభను అవమానించడమే



## జిల్లా పరిషత్ ఎన్నికలకు సిద్ధం కండి

సర్పంచ్ ఎన్నిక ఫలితాలతో వెయ్యి ఏనుగుల బలం

యాదాద్రిలో సర్పంచ్‌ల అభినందనలో కేటీఆర్

02



## సర్పంచ్ ఎన్నికల్లో బలపడ్డాం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు

02



# స్థానిక ఎన్నికల్లో బలపడ్డాం

**బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు**

**యాదాద్రిభువనగిరి, డిసెంబర్ 18:** స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన బీజేపీ సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పాల్గొన్నారు. దీనిలోభాగంగా ఆయన మాట్లాడుతూ.. ' యాదాద్రి భువనగిరి జిల్లాలో 4 సర్పంచులు 20 మంది ఉపసర్పంచ్లు 1000 వార్డులు గెలిచాం. రాష్ట్రంలో 900 సర్పంచులు 1200 ఉపసర్పంచ్లు 10,000 మంది వార్డులను గెలిచాం. గతంలో 162 సర్పంచ్ స్థానాలను ఉండేది. గ్రామీణ ప్రాంతాలలో కూడా బీజేపీ బలం పెరుగుతుంది. కాంగ్రెస్ పార్టీ అధికార బలంతో, అవినీతి, అరాచకంతో గెలిచింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీజేపీ పథకాల పేరు మార్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయింది వారి అవినీతి గురించి వారి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలనలో మినిస్టర్ పీఏలు తుపాకులు పెట్టి బెదిరిస్తున్నారు, రాజ్యాంగం మీద గౌరవం లేని వ్యక్తి రాహుల్ గాంధీ. బీఆర్ఎస్ పార్టీనే ఫిరాయింపుల మొదటి ప్రోత్సహించింది. ప్రభుత్వం ఒత్తిడితో స్పీకర్ రాజ్యాంగం వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారు. రాహుల్ గాంధీ సోనియాగాంధీ వారి వారి కేసులలో బెయిల్ పై ఉన్నారు. బీజేపీ వారిపై కేసు పెట్టలేదు దర్యాప్తు సంస్థలు కేసు పెట్టాయి. మా పార్టీ కార్యాలయంలపై దాడి చేస్తే లా అండ్ ఆర్డర్ ప్రాబ్లమ్ వస్తే కాంగ్రెస్ పార్టీదే పూర్తి బాధ్యత' అని రామచంద్రరావు పేర్కొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి నిర్వాకం

**రెండుసార్లు రైతుభరోసాకు ఎగనామం**

**మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శలు**




**మెదక్, డిసెంబర్ 18:** రేవంత్ రెడ్డి వచ్చాక రెండు సార్లు రైతు భరోసా ఎగ్గొట్టారని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. వ్యవసాయానికి కరెంట్, నీళ్లు అవసరం అయితే కాంగ్రెస్ మాత్రం యాప్‌లు, మ్యాప్‌లు కావాలి అంటుందన్నారు. తాజాగా మెదక్‌లో ఆయన మాట్లాడారు. రేవంత్ రెడ్డి వచ్చాక బస్ ఛార్జీలు రెండేళ్లలో రెండింతలు పెరిగాయి.. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు రైతు వ్యతిరేక ప్రభుత్వాలని ఆరోపించారు. రైతులకు యూరియా సరిపడ రెండు ప్రభుత్వాలు ఇవ్వట్లేదు.. కాంగ్రెస్ చేసే తుగ్లక్ పనులతో కౌలు రైతులు, రైతుల మధ్య పంచాయితీ జరుగుతుందని విమర్శించారు. ఎరువుల కోసం యాప్ తెచ్చి రైతులను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుంది.. సింగూరు ప్రాజెక్టుపై ఆధారపడ్డ రైతులకు క్లారిటీ ఇవ్వాలన్నారు. ఒక వేళ నీళ్లు ఇవ్వకుంటే ప్రకటన విడుదల చేసి నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు అడుగడుగునా కష్టాలే.. ఈ రోజు వరకు కూడా 40 శాతం రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందని చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతు అంశాల్లో ఫెయిల్ అయ్యిందని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. 'యాసంగి 1200 కోట్ల బోనస్, వర్షాకాలం రూ. 600 కోట్ల బోనస్ నగదు ఇప్పటి వరకు ఇవ్వలేదు.. రైతు భరోసా ఇప్పటివరకు ఇవ్వలేదు.. మెదక్ రైతులు అగమ్యగోచరంగా ఉన్నారు.. ఘనపురం అనకట్ట నుంచి యాసంగి పంటకు నీళ్లు ఇస్తారా లేదా క్లారిటీ లేదు.. సింగూరు ప్రాజెక్టు మరమ్మతుల పేరిట నీళ్లు ఖాళీ చేస్తున్నారు.. గత వేసవిలో ప్రాజెక్టు మరమ్మతులు చేసే అవకాశం ఉన్నా చేయలేదు.. ప్రభుత్వం నుంచి స్పష్టత కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.. సింగూరు ప్రాజెక్టు ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాలో వ్యవసాయానికి జీవనాధారం.. పదేళ్ల ఃఖా పాలనలో బోరు బండ్లు లేవు.. ఇప్పుడు మళ్ళీ బోరు బండ్లు వచ్చాయి..' అని వ్యాఖ్యానించారు.

# బెళగావి రైలు బోగీలో మంటలు

**రైలును నిలిపి మంటలను ఆర్పిన సిబ్బంది**

**హైదరాబాద్, డిసెంబర్ 18:** హైదరాబాద్ నుంచి బెళగావి వెళ్తున్న స్పెషల్ రైలు బోగీల కింద ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి రైల్వేస్టేషన్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. మంటలను గమనించిన రైల్వే సిబ్బంది వెంటనే రైలును నిలిపివేసి.. మంటలను అదుపులోకి తీసుకువచ్చింది. ఒక్కసారిగా ఉన్నట్టుండి రైలులో మంటలు రావడంతో ప్రయాణీకులు ఆందోళనకు గురయ్యారు. అయితే, ఎవరికీ ఏమీ కాకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది. బ్రేక్ జామ్ అవడం వల్లే మంటలు చెలరేగి ఉంటాయని భావిస్తున్నారు. మంటలను అదుపులోకి తీసుకువచ్చిన తర్వాత రైలు తిరిగి బెళగావికి బయలుదేరి వెళ్లింది. ఈ ప్రమాదానికి సంబంధించి ఇంకా పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# నాంపల్లి కోర్టుకు బాంబు బెదిరింపు

**హైదరాబాద్, డిసెంబర్ 18:** నాంపల్లి కోర్టుకు బాంబు బెదిరింపు వచ్చింది. కోర్టులో బాంబు పెట్టామంటూ గుర్తుతెలియని వ్యక్తులు బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ రోజు ఉదయం 11.30 గంటల ప్రాంతంలో బెదిరింపు మెయిల్‌ను పంపారు. నేడు రెండు గంటల సమయంలో కోర్టును పేల్చివేస్తామంటూ దుండగులు ఆ మెయిల్‌లో పేర్కొన్నారు. దాంతో కోర్టులో ఉన్న వారిని పోలీసులు బయటకు పంపిస్తున్నారు. కోర్టు హాల్స్ మొత్తం కాళీ చేపిస్తున్నారు. బాంబు బెదిరింపుతో ఒక్కసారిగా అలర్ట్ అయిన పోలీసులు. వెంటనే బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ టీం రంగంలోకి దిగి తనిఖీలు చేపట్టారు. కోర్టు ఆవరణలో అణువణువూ గాలిస్తున్నారు. అయితే ఇప్పటివరకు ఎలాంటి పేలుడు పదార్థాలు లభించినట్లు అధికారిక సమాచారం లేదు.

# జిల్లా పరిషత్ ఎన్నికలకు సిద్ధం కండి

- భువనగిరి కోటపై గులాబీ జెండా ఎగరాలి
- సర్పంచ్ ఎన్నికల ఫలితాలతో వెయ్యి ఏనుగుల బలం
- ఇదే స్ఫూర్తితో ముందుకు సాగితే మనదే విజయం
- యాదాద్రి జిల్లాలో గెలిచిన సర్పంచ్‌ల అభినందనలో కేటీఆర్



**యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 18:** జిల్లా పరిషత్ ఎన్నికలకు సిద్ధం కావాలని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం ప్రారంభమైందని, భవిష్యత్తులో సాధించబోయే అఖండ విజయాలకు యాదాద్రి భువనగిరి జిల్లా గడ్డ పునాది వేసిందని కేటీఆర్ స్పష్టం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపారు. తులం బంగారం ఇస్తామని, పింఛన్లు పెంచుతామని లంగ మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు రైతుబంధు రాక రైతులు అల్లాడుతున్నారని పేర్కొన్నారు. తినే ప్లేటులో మన్ను పోసుకున్నామని, పాలిచ్చే బర్రెను వదిలి తన్నే దున్నపోతును తెచ్చుకున్నామని ప్రజలు బాధపడుతున్నారని వ్యాఖ్యానించారు. వచ్చే జిల్లా పరిషత్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని, భువనగిరి కోటపై గులాబీ జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. పెద్దలు చెప్పినట్లు ఎక్కడైతే అధికారం పోగొట్టుకున్నామో, అక్కడే వెతుక్కోవాలని, ఈరోజు సర్పంచ్ ఎన్నికల ఫలితాలు ఆ ఉత్సాహాన్ని ఇస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. రెండేళ్ల కిందట అసెంబ్లీ ఎన్నికల్లో కొద్దిపాటి ఓట్ల తేడాతో నిరాశ ఎదురైనా, నేడు భువనగిరిలో 56 మంది, ఆలేరులో 74 మంది, మునుగోడులో 15 మంది, తుంగతుర్తిలో 9 మంది, నకిరేకల్‌లో 7 మంది.. ఇలా జిల్లావ్యాప్తంగా మొత్తం 161 మంది సర్పంచులను గెలిపించుకోవడం సామాన్య విషయం కాదని ఆయన కొనియాడారు. ఈ విజయం రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులకు వెయ్యి ఏనుగుల బలాన్ని ఇచ్చిందని, లక్ష్మీ నరసింహస్వామి ఆశీస్సులతో గులాబీ జెండా మళ్లీ రెపరెపలాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయం అత్యంత గలీజుగా మారిందని కేటీఆర్ మండిపడ్డారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో బీఆర్ఎస్ కార్యకర్తలపై జరుగుతున్న దాడులను ఆయన తీవ్రంగా ఖండించారు. నూతన్‌కల్ మండలంలో మల్లయ్య యాదవ్‌ను కిరాతకంగా చంపడం, నల్గొండలో అభ్యర్థిపై దాడి చేసి అమానవీయంగా మూత్రం తాగించి అవమానించడం వంటి ఘటనలు కాంగ్రెస్ నాయకుల వికృత మనస్తత్వానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ ఎప్పుడూ ఇలాంటి చిల్లర రాజకీయాలకు తావివ్వలేదని గుర్తు చేశారు. అధికారులు కూడా అధికార పక్షానికి కొమ్ముకాస్తూ, గెలిచిన బీఆర్ఎస్ అభ్యర్థులను దొంగతనంగా ఓడించే ప్రయత్నం చేస్తున్నారని, 150కిపైగా గ్రామాల్లో జరుగుతున్న ఈ అన్యాయంపై కోర్టుల ద్వారా న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలపై కేటీఆర్ నిప్పులు చెరిగారు. అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లోకి వెళ్లామని సిగ్గు లేకుండా మైకుల్లో చెబుతున్న కడియం శ్రీహరి వంటి నాయకులు, అసెంబ్లీలో ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని హీనస్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. 70 ఏళ్ల వయసులో సంపాదించుకున్న గౌరవాన్ని రేవంత్ రెడ్డి సంకలో చేరి నాశనం చేసుకున్నారని, గబ్బిలాలు సూరు పట్టుకుని వేలాడినట్లు వీరి పరిస్థితి తయారైందని ఘాటుగా విమర్శించారు. స్పీకర్ కూడా ముఖ్యమంత్రి చెప్పినట్లు ఆడుతూ, ఫిరాయింపులు కనపడనట్లు నటిస్తున్నారని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి మూడు ఫీట్లు ఉన్నా ముప్పై ఫీట్ల డైలాగులు కొడతారని, కానీ క్షేత్రస్థాయిలో ప్రజలు మోసపోయామని గ్రహిస్తున్నారని కేటీఆర్ అన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు సమన్వయంతో పనిచేయాలని, పార్టీ బీ-ఫామ్ మీద జరిగే ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు తిరుగులేని విజయం అందించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు ఎవరి అత్త సొమ్ము కాదని, అవి రాజ్యాంగబద్ధంగా ప్రజలకు అందాల్సిన హక్కులని, ఏ ఎమ్మెల్యే వాటిని ఆపలేదని భరోసా ఇచ్చారు. గత పదేళ్లలో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ, ముఖ్యంగా ఉమ్మడి నల్గొండ జిల్లా సాధించిన అభివృద్ధిని కేటీఆర్ వివరించారు.

# కార్మికుల షెడ్డులో అగ్నిప్రమాదం

- సిలిండర్లు పేలడంతో భారీగా ఎగిసిపడ్డ మంటలు
- కార్మికులు పనుల్లో ఉండడంతో తప్పిన ముప్పు



**హైదరాబాద్, డిసెంబర్ 18:** షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగి మంటలు ప్రమాదకరంగా మారిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, ఫైర్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపల్లిలో కొనసాగుతున్న క్యాండూర్ భారీ బహుళ అంతస్థుల నిర్మాణానికి పనులు చేసే కార్మికుల షెడ్లలో గురువారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు ఒక్కసారిగా పెద్ద ఎత్తున ఎగిసిపడడంతో షెడ్లలో ఉండే కార్మికులు వంట గ్యాస్ భారీ శబ్దాలు చేస్తూ పేలిపోయాయి. ప్రమాదం జరిగిన సమయంలో అధిక సంఖ్యలో కార్మికులు విధుల్లో ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. నిర్మాణ సంస్థ ఉద్యోగుల సమాచారంతో రంగంలోకి దిగిన మాదాపూర్, పటాన్‌చెరువు ఫైర్ అధికారులు 3 గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అగ్నిప్రమాదంలో కార్మికులకు సంబంధించిన సామాగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. శేరిలింగంపల్లిలో అత్యధిక అంతస్థులతో నిర్మాణాన్ని చేపట్టిన క్యాండూర్ నిర్మాణ సంస్థ, తమ వద్ద పని చేస్తున్న కార్మికుల జాగ్రత్తను గాలికొదిలేసిందని, ఒకే చోట రేకుల షెడ్లను నిర్మించి వందలాది మందిని ఇరుకు గదులలో ఉంచిందని కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవలే చందానగర్‌లో నిర్మాణ కార్మికుల షెడ్లు అగ్నిప్రమాదంలో కాలిబూడిదైన సంఘటన మరువకముందే మరో ఘటన చోటు చేసుకోవడం బాధకరమని విచారం వ్యక్తం చేశారు. ప్రాణ నష్టం జరిగితే తప్ప అధికారులు నిర్మాణ సంస్థలపై చర్యలు తీసుకోరంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రంజాన్ ఏర్పాట్లపై ముందస్తు సమీక్ష నిర్వహించాలి

**పండుగ వేళ ఇబ్బందులు కలగకుండా చూడాలి**

**ప్రభుత్వానికి అమ్జెద్ ఉల్లా ఖాన్ విజ్ఞప్తి**




**హైదరాబాద్, డిసెంబర్ 18:** రాబోయే రంజాన్ పండుగ, పవిత్ర రాత్రులైన షబ్బే మెహ్రాజ్, షబ్బే బరాత్ ఏర్పాట్లపై ప్రభుత్వం ఇప్పటి నుంచే స్పష్టమైన ప్రణాళికతో వ్యవహరించాలని మజ్లిస్ బచావో తెహ్రీక్ (ఎం బి టీ) స్పొక్స్ పర్సన్ అమ్జెద్ ఉల్లా ఖాన్ కోరారు. 2026 ఫిబ్రవరి 19న రంజాన్ మాసం ప్రారంభం కానుండగా, దానికి ముందు జనవరి 16న షబ్బే మెహ్రాజ్ మరియు ఫిబ్రవరి 3న షబ్బే బరాత్ పర్వదినాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో, పండుగ పనులు సకాలంలో పూర్తి కావాలంటే జనవరి మొదటి వారంలోనే ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. సాధారణంగా ప్రభుత్వం రంజాన్ ప్రారంభానికి వారం ముందు సమీక్ష నిర్వహిస్తుందని, అయితే ఆ సమయంలో మంజూరైన సివిల్ పనులు పండుగ ముగిసే వరకు పూర్తి కావడం లేదని ఆయన గుర్తు చేశారు. ఈ పరిస్థితిని నివారించడానికి ముఖ్యమంత్రి స్వయంగా అన్ని విభాగాల అధిపతులతో సమావేశమై పనులను పర్యవేక్షించాలని కోరారు. ఈ సమావేశం ద్వారా ప్రభుత్వం మైనారిటీల పండుగ ఏర్పాట్లను తీవ్రంగా పరిగణిస్తుందనే బలమైన సందేశం వెళ్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఈ సమీక్షా సమావేశాలకు కేవలం అధికారిక అనుబంధ పార్టీలనే కాకుండా, అన్ని రాజకీయ పక్షాలను, రాజకీయేతర మతపరమైన సంస్థలను ఆహ్వానించి వారి సలహాలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, ఫిబ్రవరి 3న జరగనున్న షబ్బే బరాత్ సందర్భంగా ముస్లింలు పెద్ద సంఖ్యలో స్మశానవాటికలను సందర్శిస్తారని, అందువల్ల గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ( జిహెచ్ఎం ) ఇతర జిల్లాల మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని కోరారు. స్మశానవాటికలలో అడవి చెట్ల తొలగింపు, గోడలకు సున్నం వేయడం, విద్యుత్ దీపాల ఏర్పాటు వంటి పనులు పర్వదినానికి ముందే పూర్తి కావాలని స్పష్టం చేశారు. గతంలో పనులు ఆలస్యంగా జరగడం వల్ల భక్తులు ఇబ్బంది పడ్డారని, ఈసారి అటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలని అధికారులను కోరారు. ఈ మేరకు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, ముఖ్యమంత్రి సలహాదారు షబ్బీర్ అలీ, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మత్ ఉల్లా హుస్సేని ,ఇతర ఉన్నతాధికారులకు ఆయన లేఖలు పంపారు.

**బీబీ కా ఆలం ఊరేగింపు కోసం సొంత ఏనుగులను కొనుగోలు చేయాలని విజ్ఞప్తి**

హైదరాబాద్‌లోని చారిత్రాత్మక మొహ్రం ఊరేగింపు నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, తెలంగాణ ప్రభుత్వమే సొంతంగా రెండు ఏనుగులను కొనుగోలు చేయాలని ఎం బి టీ స్పొక్స్ పర్సన్ అమ్జెద్ ఉల్లా ఖాన్ ముఖ్యమంత్రికు విజ్ఞప్తి చేశారు.

ఇతర రాష్ట్రాల నుండి ఏనుగులను తీసుకురావడం ప్రభుత్వానికి పెను సవాలుగా మారుతోంది. రవాణా పరంగా ఎదురయ్యే ఇబ్బందులతో పాటు, బయటి నుండి వచ్చే ఏనుగులకు స్థానిక వాతావరణం మరియు భారీ జనం మధ్య నడవడంలో తగిన శిక్షణ ఉండటం లేదన్నారు. దీనివల్ల ఊరేగింపు సమయంలో ఏనుగులు అదుపు తప్పే అవకాశం ఉందని, ఇది పోలీసు శాఖకు శాంతిభద్రతల నిర్వహణలో పెద్ద సమస్యగా మారుతుందని తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

# వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే రిపీట్

మొదటి పేజీ తరువాయి

ఆశీర్వదించారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. పార్టీ విజయం కోసం కష్టపడిన కాంగ్రెస్ కార్యకర్తలందరికీ ధన్యవాదాలు తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, ఉత్తమ్ కుమార్ రెడ్డిచ దామోదర్ రాజనర్సింహలతో కలిసి సీఎం మాట్లాడారు. మూడు విడతల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అద్భుత ఫలితాలు సాధించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ గెలుపునకు కష్టపడిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు శుభాకాంక్షలు చెప్పారు. ఈ పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన అధికారులకు సీఎం అభినందనలు తెలియజేశారు. 12,702 పంచాయతీలకు 7,527 పంచాయతీల్లో కాంగ్రెస్ గెలిచిందన్నారు. 808 కాంగ్రెస్ రెబల్స్ నెగ్గారని వివరించారు. 66 శాతం ఫలితాలను కాంగ్రెస్ సాధించిందని తెలిపారు. 3,511 కాంగ్రెస్, 710 బీజేపీ మొత్తంగా 33 శాతం గెలిచాయని పేర్కొన్నారు. 94 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికలు జరిగాయని.. 87 నియోజకవర్గాల పరిధిలో కాంగ్రెస్ మెజారిటీ సాధించిందని స్పష్టం చేశారు. పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయన్నారు. తమ ప్రభుత్వంపై ప్రజలు సంపూర్ణ విశ్వాసం కనబరిచారని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ కూటమిగా పోటీ చేశాయని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ కూటమికి 33శాతం విజయాలు మాత్రమే



దక్కాయన్నారు. బీఆర్ఎస్‌కు 3,511 సర్పంచ్ స్థానాలు, బీజేపీ 710 చోట్ల గెలిచాయని చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ కూటమికి 4,221 స్థానాలు మాత్రమే దక్కాయని సీఎం రేవంత్ తెలిపారు. ఇటీవల ప్రజాపాలన రెండేళ్ల సంబురాలు నిర్వహించుకున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 12వేలకు పైగా గ్రామపంచాయతీల్లో ఎన్నికలు ప్రశాంతంగా, ప్రజాస్వామ్య బద్ధంగా జరిగాయి. ఎన్నికలు సజావుగా నిర్వహించిన అధికారులకు అభినందనలు తెలిపారు. దాదాపు 146 గ్రామ పంచాయతీలు (ఒక శాతం) సీపీఐ, సీపీఎం, ఇతరులు గెల్చుకున్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయిన తర్వాత జరిగిన ఎన్నికల్లోనూ ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలు మా రెండేళ్ల పాలనపై తీర్పుగా భావిస్తున్నాం అని సిఎం అన్నారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే పెద్దల సూచనను పాటిస్తాం. కానీ, ప్రతిపక్షంలో ఉన్న వారికి ఇంకా అహంకారం తగ్గలేదు. ఇప్పటికైనా ప్రజా తీర్పును గౌరవించి.. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు సహకరించాలని రేవంత్‌రెడ్డి అన్నారు. పేదలకు మేం అందిస్తున్న సంక్షేమ పథకాలే మా విజయానికి కారణం. ఈ ఫలితాలను చూసి భారత రాష్ట్ర సమితి నేతలు అద్భుతం అంటున్నారు. సంతోషం.. మీరు కోరుకున్నట్టే ఈ అద్భుతం 2029లో కూడా జరుగుతుంది. 2/3 మెజార్టీతో 2029లో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వస్తుంది. 1/3తో భారత రాష్ట్ర సమితి ఉంటే.. 2/3 మెజార్టీతో కాంగ్రెస్ ఉంటుంది. ఈ తీర్పు 2029లో కూడా పునరావృతం కాబోతోందని సీఎం అన్నారు.

# దమ్ముంటే కేసీఆర్ చర్చకు రావాలి

**నదీ జలాలలపై బీఆర్ఎస్ ద్రోహం**

**అసెంబ్లీలో ఎప్పుడైనా చర్చిస్తాం**

**మీడియా ముందుకు వచ్చినా వివరిస్తాం**

**కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి సవాల్**

**హైదరాబాద్, డిసెంబర్ 18:** నదీజలాల విషయంలో ద్రోహం చేసిందెవరో మీడియా ముందకు వస్తే నిజాలు వెల్లడిస్తానని సీఎం రేవంత్ సవాల్ చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కి సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. నదీ జలాల విషయంలో మాట్లాడేందుకు కేసీఆర్ మీడియా ముందుకు రానున్నారని వార్తలు వస్తున్న నేపథ్యంలో.. సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. నదీ జలాలు, ప్రాజెక్టులపై చర్చిద్దాం రండి అంటూ కేసీఆర్‌కు ముఖ్యమంత్రి ఛాలెంజ్ విసిరారు. కేసీఆర్ ఎప్పుడు కోరితే అప్పుడు అసెంబ్లీ సమావేశాలు పెడతానని అన్నారు. బురదజల్లి పారిపోవ డం కాదు.. నీటి వాటాల్లో ఎవరి హయాంలో అన్యాయం జరిగిందో చర్చిద్దాం రావాలంటూ కేసీఆర్‌కు సవాల్ విసిరారు. కృష్ణా జలాలపై ప్రతిపక్ష నేతగా లేఖ రాయండి. కృష్ణా జలాల్లో ఎవరు అన్యాయం చేశారో చర్చకు సిద్ధం. గోదావరి, కృష్ణా జలాలపై సభలో చర్చకు సిద్ధంగా ఉన్నాం. ఉమ్మడి రాష్ట్రంలో కంటే బీఆర్ఎస్ హయాంలోనే ఎక్కువ ద్రోహం చేశారు. మీరు చేసిన ద్రోహాన్ని ఆధారాలతో సహా నిరూపిస్తాం అని రేవంత్ అన్నారు. ఇదిలాఉంటే.. ఫార్ములా ఈ రేస్ కేసుపైనా సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసుపై దర్యాప్తు జరుగుతోందన్నారు. అరవింద్ కుమార్‌కు సంబంధించి అనుమతి రావాల్సి ఉందన్నారు. డీవోపీటీ నుంచి అనుమతి రాగానే చర్యలు తీసుకుంటామని సీఎం తెలిపారు. మెస్సీ ఈవెంట్ పూర్తిగా ప్రైవేట్ కార్యక్రమం అని సీఎం మరోమారు స్పష్టం చేశారు. మెస్సీ ఈవెంట్‌కు తాను గెస్ట్ మాత్రమేనని చెప్పారు. సింగరేణి యాజమాన్యం అడ్వర్‌టైజ్‌మెంట్ ఇచ్చిందన్నారు. ఫుట్‌బాల్ ఆడించాలనే తన మనవడిని తీసుకెళ్లినట్లు సీఎం వివరించారు. తాము పబ్బులు, గబ్బుల చుట్టూ తిప్పలేదన్నారు.

# స్థానిక, మున్సిపల్ ఎన్నికలపై త్వరలో నిర్ణయం

**అందరితో చర్చించి ఓ నిర్ణయానికి వస్తాం**

**ఎన్నికలు సజావుగా నిర్వహించిన అధికారులకు కృతజ్ఞతలు**

**హైదరాబాద్, డిసెంబర్ 18:** రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో, ప్రజాస్వామిక బద్ధంగా ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించినందుకు ఎన్నికల యంత్రాంగానికి, అధికారులకు ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లను సాధించడంపై శాసన సభ సమావేశాల్లో చర్చించి అన్ని పార్టీల అభిప్రాయం మేరకు ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలపై నిర్ణయానికి వస్తామని చెప్పారు. ప్రజా ప్రభుత్వం రెండేళ్ల పరిపాలన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలతో ప్రజల ముందుకు వెళ్లగా, తమకు 7,527 గ్రామ పంచాయతీల్లో (66 శాతం) ప్రజలు అందించిన ఆశీర్వాదం.. ప్రభుత్వంపై మరింత బాధ్యత పెంచిందని చెప్పారు. ప్రజల ఆశీర్వాదంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండిండినీ సమపాళ్లలో ముందుకు తీసుకెళుతున్నామని అన్నారు. రాష్ట్రంలో కొత్తగా రేషన్ కార్డుల జారీ, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్నధాన్యానికి బోనస్ చెల్లింపు, ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, రూ. 500 లకే సిలిండర్, 27 వేల కోట్ల రూపాయల మేరకు సున్నా వడ్డీకే మహిళా సమాఖ్యలకు రుణాలు, 4.5 లక్షల మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే 61 వేల ఉద్యోగాల భర్తీ, సుదీర్ఘకాలం అపరిష్కృతంగా ఉన్న ఎస్సీ వర్గీకరణ సమస్యకు పరిష్కారం, వందేళ్లుగా జరగని బీసీ కులగణన చేపట్టడం, పేదలకు మంచి విద్యను అందించాలన్న ప్రయత్నాలు... ఇలా అనేక అంశాల్లో ప్రభుత్వం ఒక క్రమపద్ధతిలో అభివృద్ధిని, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు వెళుతోందని ముఖ్యమంత్రి వివరించారు. ఒకవైపు ఆదాయాన్ని పెంచుకుంటూ దుబారాను తగ్గిస్తూ సంక్షేమ పథకాలను అమలు



చేస్తున్నామని, ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం జరక్కుండా ప్రజలకు మేలు చేయాలన్నదే ప్రభుత్వ తాపత్రయమని ఒక ప్రశ్నకు సమాధానంగా ముఖ్యమంత్రి గారు చెప్పారు. కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణ హక్కులకు సంబంధించి పూర్తి వివరాలతో శాసనసభలో చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.

# ఇద్దరు అవినీతి ఉద్యోగుల పట్టివేత

**లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన వైనం**

**హైదరాబాద్, డిసెంబర్ 18:** అవినీతికి పాల్పడ్డ ఇద్దరు ఉద్యోగులు ఏసీబీకి చిక్కారు. నిర్మల్, ఖమ్మం జిల్లాలో జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నిర్మల్ జిల్లా భైంసా మండలంలో తానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జి భీమన్న గురువారం మధ్యాహ్నం బాధితుడి నుంచి రూ. 9వేలు ఫోన్ పే చేయించుకున్నందుకు ఆధారాలతో సహ ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. భైంసా ఎన్‌బీ నగర్‌లో నివాసముండే ఒకరు మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, సరెండర్ లీవ్, ఎఫ్‌టీఏ బిల్లు కోసం సీనియర్ అసిసెంట్‌ను సంప్రదించగా లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఆదిలాబాద్ రేంజ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించగా వ్యూహం ప్రకారం దాడులు చేసి భీమనన్ను పట్టుకున్నారు. ఖమ్మం జిల్లా కారేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గా పనిచేస్తున్న ఉషా శుభ కామేశ్వరి రూ. 10 వేలు లంచం తీసుకుంటు పట్టుబడ్డారు. ల్యాండ్ మ్యుటేషన్ కోసం అవసరమైన ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికేట్‌కు



ఆర్ఐను సంప్రదించారు. దీంతో లంచం డిమాండ్ చేసిన ఆమెకు రూ.10 వేలు బాధితులు అందిస్తుండగా మాటు వేసిన ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఆర్ఐపై కేసు నమోదు చేసుకుని ఏసీబీ కేసులను విచారిస్తున్న వరంగల్ జడ్జి ఎదుట ప్రవేశపెట్టారు.

# కోర్టు సమయం వృథా చేస్తారా?

**హీరా గ్రూప్‌నకు భారీ జరిమానా**

**5కోట్ల జరిమానా విధించిన హైకోర్టు**



**హైదరాబాద్, డిసెంబర్ 18:** నౌహీరా షేక్‌కు చెందిన హీరా గ్రూప్‌నకు హైకోర్టు భారీ జరిమానా విధించింది. రూ.5 కోట్ల జరిమానా విధించిన న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక... ఆ మొత్తాన్ని 8 వారాల్లో పీఎం సహాయ నిధికి జమ చేయాలని హీరా గ్రూప్‌ను ఆదేశించారు. కోర్టును తప్పుదోవ పట్టించేలా పిటిషన్ దాఖలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయమూర్తి.. భారీ జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పేదల నుంచి పెట్టుబడి పేరుతో డబ్బులు వసూలు చేసి తిరిగి చెల్లించలేదని హీరా గ్రూప్‌తో పాటు.. నౌహీరా షేక్ పైనా ఈడీ అధికారులు పీఎంఎల్ఏ కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు హీరా గ్రూప్‌నకు చెందిన 59 ఆస్తులను అటాచ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ ఆస్తులను వేలం వేసేందుకు ఈడీ అధికారులు వెబ్ సైట్‌లో వివరాలు ఉంచారు. ఈనెల 26న వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఈడీ అధికారులు సరిగా వేలం నిర్వహించడం లేదని, ఆస్తుల విలువ తక్కువగా చూపించారని నౌహీరా షేక్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వేలాన్ని రద్దు చేయాలని కోరారు. అప్పటి వరకు వేలం వేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఇరువైపులా వాదనలు విన్న జస్టిస్ నగేశ్ భీమపాక.. పిటిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు పిటిషన్లు వేసి కోర్టు సమయ వృథా చేస్తున్నారన్న న్యాయమూర్తి.. ఈ మేరకు హీరాగ్రూప్‌నకు రూ.5కోట్ల జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



# కాంగ్రెస్ అగ్రనేతలకు వేధింపులు

**నిరసనలకు కాంగ్రెస్ దిగడంతో ఉద్రిక్తత**

**హైదరాబాద్, డిసెంబర్ 18:** నగరంలోని గాంధీభవన్ వద్ద భారీగా పోలీసులను మోహరించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌ను ఈడీ కేసులతో వేధిస్తున్నారని పార్టీ శ్రేణులు ఆరోపించాయి. ఈ నేపథ్యంలో ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన ర్యాలీకి సిద్ధమయ్యారు. భాజపా కార్యాలయం వరకు వెళ్లేందుకు పెద్దఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు తరలిరావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ నిరసనకు అనుమతి లేదని చెప్పారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో పాటు ముఖ్యనేతలు గాంధీభవన్‌కు చేరుకున్నారు. నిరసనకు పోలీసుల నిరాకరించడంతో నేతలు అక్కడే బైఠాయించారు. భాజపాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# టాంజానియాలో నల్లగొండవాసి మృతి

**నల్గొండ, డిసెంబర్ 18:** నల్గొండ జిల్లా మునుగోడు మండలం పలివెల గ్రామానికి చెందిన బడుగు రాజు (38) టాంజానియా దేశంలో గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయాన్ని అతడి సహచరులు రాజు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకొచ్చేందుకు స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి.. మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ఆ దేశ రాయబారులతో మాట్లాడుతున్నారు. బడుగు రాజు టాంజానియా రాజధాని దారుస్సలాంలో జియాలాజిస్ట్‌గా పనిచేస్తున్నట్టు సమాచారం. ఆయన మరణవార్తతో గ్రామంలో విషాదం అలముకుంది. కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

# గ్రూప్-3 ఫలితాలు విడుదల

**హైదరాబాద్, డిసెంబర్ 18:** తెలంగాణ గ్రూప్-3 అభ్యర్థుల ఫలితాలు గురువారం విడుదల య్యాయి. సెలక్షన్ లిస్ట్‌ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసింది. గ్రూప్-3కి 1,370 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. గతేడాది నవంబర్ 17, 18 తేదీల్లో జరిగిన గ్రూప్-3 పరీక్ష జరిగిన విషయం తెలిసిందే. జూనియర్ అసిస్టెంట్, ఎల్‌డి స్టెనో, టైపిస్ట్, జూనియర్ స్టెనోగ్రాఫర్ తదితర పోస్టులను భర్తీ చేసేందుకు నిర్వహించిన పరీక్షకు సుమారు 2.5 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. గ్రూప్ 3 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల హాల్ టికెట్ నంబర్లు అధికారిక వెబ్‌సైట్ లో అందుబాటులో ఉంచింది. కోర్టులో ఉన్న పెండింగ్ కేసుల తుది తీర్పుకు లోబడి ఈ ఫలితాల ఎంపిక ఉంటుందని టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. ఒక్క ఖాళీని ప్రస్తుతం విత్‌హెల్డ్ లో ఉంచింది కమిషన్. తప్పుడు వివరాలు సమర్పించినట్లు తేలితే ఎంపికను రద్దు చేస్తామని కమిషన్ హెచ్చరించింది. గత ఏడాది నవంబర్ 17, 18 తేదీల్లో గ్రూప్-3 పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే.

# సర్కార్‌కు భారీ ఊరట

**102 ఎకరాల భూమి అటవీశాఖదే అని తేల్చిన సుప్రీం**

**స్వాధీనం చేసుకుని నోటిఫై చేయాలని సీఎస్‌కు ఆదేశం**

**న్యూఢిల్లీ, డిసెంబర్ 18:** సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి భారీ ఊరట లభించింది. రూ.15 వేల కోట్ల విలువైన భూములపై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. వనస్థలిపురం దగ్గర ఉన్న 102 ఎకరాల భూమి తెలంగాణ రాష్ట్ర పరిధిలోని అటవీ శాఖదేనని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. దాదాపు 20 ఏళ్లుగా ఈ భూమిపై వివాదం కొనసాగుతోంది. హైదరాబాద్ వనస్థలిపురం సమీపంలోని సాహెబ్‌నగర్ వద్ద ఉన్న 102 ఎకరాల భూమి తెలంగాణ అటవీశాఖదేనని తేల్చింది. ఈ భూమిపై యాజమాన్య హక్కులు కోరుతూ నిజాం, సాలార్ జంగ్, మీరాలం వారసులమంటూ పలువురు న్యాయస్థానంలో పిటిషన్లు దాఖలు చేశారు. గతంలో పిటిషన్లు వేసిన 260 మందికి అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చింది. హైకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది. సుదీర్ఘ విచారణ అనంతరం జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిల ధర్మాసనం.. ఇది పూర్తిగా అటవీ భూమి అని రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి హక్కులు కల్పిస్తూ తీర్పు ఇచ్చింది. తీర్పు వెలువడిన 8 వారాల్లో రిజర్వ్ ఫారెస్ట్‌గా నోటిఫై చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సుప్రీంకోర్టు ఆదేశించింది. నోటిఫికేషన్ ప్రతిని సుప్రీంకోర్టు రిజిస్ట్రీకి పంపాలని ధర్మాసనం ఆదేశించింది. సుదీర్ఘ విచారణ తర్వాత ద్విసభ్య ధర్మాసనం తాజాగా తీర్పు వెలువరించింది. అది పూ ర్తిగా అటవీ భూమి అని.. దానిపై రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి హక్కులు ఉన్నాయని తేల్చి చెప్పింది. భూమిపై రాష్ట్ర ప్రభుత్వానికి హక్కులు కల్పిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. తీర్పు వెలువడిన 8 వారాల్లో ఆ 102 ఎకరాలను రిజర్వ్ ఫారెస్ట్‌గా నోటిఫై చేయాలని సీఎస్‌కు ఆదేశాలు జారీ చేసింది. నోటిఫికేషన్ కాపీని సుప్రీంకోర్టు రిజిస్ట్రీకి పంపాలని ధర్మాసనం సూచించింది. దీంతో 2 దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ వివాదం ఓ కొలిక్కి వచ్చింది.

# ఫోన్ ట్యాపింగ్ దర్యాప్తునకు మరో సిట్

**నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ నాయకత్వం**



**హైదరాబాద్, డిసెంబర్ 18:** ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇప్పటికే ఈ కేసులో సిట్ విచారణ చేస్తుండగా, హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆధ్వర్యంలో సీనియర్ ఐపీఎస్ అధికారులతో మరో సిట్‌ను ఏర్పాటు చేస్తూ తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. సిట్‌లో రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, సిద్దిపేట కమిషనర్ ఎస్.ఎం.విజయ్ కుమార్, మాదాపూర్ డీసీపీ రితురాజ్, మహేశ్వరం డీసీపీ నారాయణ్‌రెడ్డి, గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్ రవీందర్‌రెడ్డి, రాజేంద్రనగర్ అదనపు డీసీపీ కేఎస్ రావు, జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి, టీజీ న్యాబ్ డీఎస్పీ శ్రీధర్, హైదరాబాద్ మెట్రోలో పనిచేస్తున్న నాగేందర్ సభ్యులుగా ఉన్నారు. వీరు ఏంచేస్తారన్నది విధి విధానాలు రాలవాల్సి ఉంది.




సంపాదకీయం

# ఆ పదిమందిని బీఆర్ఎస్ ఆహ్వానించాలి!

ప్రజాప్రతినిధులు పార్టీలు మారడం అన్నది అనైతికమని అందరూ అనుకుంటున్నా.. కాదని తేలిపోయింది. ఎవరు ఎటుపోయినా కిమ్మనకుండా ఉంటే మంచిది. దీనికోసం కోర్టులు, విచారణలు అవసరం లేదని తెలంగాణ ఎమ్మెల్యేల ఫిరాయింపులు స్పష్టం చేశాయి. నిజానికి ఫిరాయింపులకు ఏ పార్టీ కూడా మినహాయింపు కాదు. కాకపోతే దానికి రకరకాల పేర్లు పెట్టి పిలిచారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత టిఆర్ఎస్ అధినేతగా ఉన్న కెసిఆర్ ఆనాడు నిర్లజ్జగా ఇతర పార్టీల ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకున్నారు. అలాగే ఇద్దరు ఎమ్మెల్యేలను అకారణంగా అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయించారు. జర్మనీ పౌరసత్వం ఉన్న చెన్నమనేని రమేశ్‌ను రెండు పర్యాయాలు ఎమ్మెల్యేను చేసి కథ నడిపించారు. ఇవన్నీ అనైతికమైతే... పదిమంది పార్టీ మారడం కూడా అనైతికం అవుతుంది. లేదంటే చెల్లుకు చెల్లు అని సరిపెట్టుకోవాల్సిందే. ఇక ఎలాటూ ఆ పదిమంది తాము బిఆర్ఎస్‌లోనే ఉంటున్నామని చెప్పడం ద్వారా వారికి తిరిగి గులాబీ కండువా కప్పి తెలంగాణ భవన్‌లో సన్మానించాలి. ఇవన్నీ మరచి ఇప్పుడు తమ పార్టీకి చెందిన వారు కాంగ్రెస్‌లో చేరితే గగ్గోలు పెట్టారు. సుప్రీం తీర్పు, తరవాత స్పీకర్ తీర్పు దరిమిలా సమాజంలో పెద్దగా మార్పు కనిపించదు. ఎందుకంటే నైతికతకు తావులేని చోట తీర్పులు ఇలాగే ఉంటాయి. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఇప్పుడు ఫిరాయింపులపై తేలిందంతే. ఎమ్మెల్యేలంతా తాము బిఆర్ఎస్‌లోనే ఉన్నామంటున్నారు. స్పీకర్ కూడా అదే చెప్పారు. కనుక ఈ పదిమంది ఎమ్మెల్యేలను స్వాగతించి, ప్రచారం చేసుకోవడం ద్వారా బిఆర్ఎస్ చతురత ప్రదర్శించాలి. ఆ పదిమందిని పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించాలి. అప్పుడు వారి రంగు తెలుస్తుంది. ఇకపోతే రాజ్యాంగానికి అన్యాయం జరిగిందంటూ. ఓట్ చోరీ అంటూ గగ్గోలు పెడుతున్న కాంగ్రెస్ నేతలు ఇకనుంచి ఈ రకమైన అరుపులు మానేయాలి. రాజ్యాంగం ప్రకారం ముందు వారు నడవడం నేర్చుకోవాలి. రాహుల్ పార్లమెంట్‌లో ఒకమాట బయట మరోమాట మాట్లాడడం మానాలి. నీతిమాలిన రాజకీయాలను పక్కన పెట్టాలి . హర్యానాలో కాంగ్రెస్ నుంచి గెలిచి బీజేపీలో చేరిన ఎమ్మెల్యేలపై ఫిరాయింపు నిరోధక చట్టాన్ని ప్రయోగించి వెంటనే వారిపై అనర్హత వేటు వేయాలని ఆనాడు కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఫిరాయింపు చట్ట ప్రయోగానికి సాంకేతికత కంటే నైతికతే ప్రామాణికమని ఆ రాష్ట్ర శాసనసభ స్పీకర్‌కు సూచించింది. మరోవైపు కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ భారత రాజ్యాంగ రక్షకుడిని తానే అన్నంతగా రాజ్యాంగ ప్రతిని చేతిలో పట్టుకొని రాష్ట్రాలు తిరుగుతూ ఫొటోలకు పోజులిస్తుంటారు. మోడీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని కాలరాస్తోందని అంటున్నారు. ఒక్క మోడీయే కాదు..దేశమంతా ఇలాగే తగులబడింది. అధికారానికి అలవాటు పడ్డ పార్టీలు ఇంతకన్నా భిన్నంగా చేయలేవు. రాజ్యాంగ రక్షణ విషయంలో దేశమంతా ఒకే విధానం ఉండాలి. రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ సాంకేతిక కారణాలను చూపుతూ ఫిరాయింపు ఎమ్మెల్యేలు బిఆర్ఎస్‌లోనే ఉన్నారని తేల్చారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్లను కొట్టివేశారు. కారు గుర్తు మీద గెలిచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేల్లో ఐదుగురు గోడ దూకినట్టు నిర్ధారించేందుకు తగినన్ని భౌతిక ఆధారాలు లేవని, సాంకేతికంగా వారు బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారని స్పీకర్ పేర్కొన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు (భద్రాచలం), బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల), గూడెం మహిపాల్ రెడ్డి (పటాన్ చెరు), ప్రకాశ్ గౌడ్ (రాజేంద్రనగర్), అరికెపూడి గాంధీ (శేరిలింగంపల్లి)పై దాఖలైన పిటిషన్లను స్పీకర్ కొట్టివేశారు. ఎమ్మెల్యేలు పార్టీ మారారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన ఆరోపణలను నిరూపించడానికి అవసరమైన ఆధారాలను సమర్పించలేదని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇప్పుడు బిఆర్ఎస్ కూడా నైతికత ప్రదర్శించాలి. ఈ ఎమ్మెల్యేలను తిరిగి పార్టీలోకి ఆహ్వానించి గులాబీ కండువా కప్పాలి. అప్పుడు వారు వస్తారా లేదా అన్నది వారి ఇష్టం లేదంటే బిఆర్ఎస్‌లోనే మరో గ్రూపుగా అయినా ఉండిపోతారు. నిజానికి గతంలో వేములవాడ ఎమ్మెల్యే విషయంలో బిఆర్ఎస్ కూడా అనైతికతకు పాల్పడింది. ఆయనకు జర్మనీ పౌరసత్వం ఉందని తెలిసినా కులగజ్జితో ఎమ్మెల్యేను చేశారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా సకల సౌఖ్యాలు అనుభవించారు. దీనిపై ఆనాడు ఫిర్యాదు వచ్చిన వెంటనే కెసిఆర్ స్పందించలేదు. ఈ వ్యవహారం కోర్టుల్లో తేలడానికి పదేళ్లు పట్టింది. అందుకే పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారంటూ బీఆర్ఎస్ ఇచ్చిన ఫిర్యాదులపై వాదించే అధికారం బిఆర్ఎస్ నైతికంగా కోల్పోయింది. రాజకీయాల్లో కఠిన చట్టాలను తుంగలో తొక్కుతున్నదే ప్రజాప్రతినిధులు అన్నది మరచిపోరాదు. ఫిరాయింపులపై బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు మరి కొందరు ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఫిరాయింపుదారులను విచారించి వారిపై చర్యలు తీసుకోవడంలో జాప్యాన్ని ఆక్షేపించారు. స్పీకర్ సాగదీత ధోరణిపై సుప్రీంకోర్టు ధర్మాసనం పలుమార్లు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఫిరాయింపుపై మూడు నెలల్లో తేల్చాలని తొలుత జూలై 31న ఆదేశించింది. అక్టోబర్ 21తో గడువు ముగిసినా తేల్చక పోవడంపై కోర్టు సీరియస్ అయ్యింది. నవంబర్ 17న మరోసారి సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తెలంగాణ శాసనసభ స్పీకర్ కోర్టు ధికరణకు పాల్పడ్డారని సీరియస్ అయ్యింది. నాలుగు వారాల్లోగా విచారణ పూర్తిచేయాలని, లేదా నూతన సంవత్సర వేడుకలు ఎక్కడ జరుపుకోవాలను కుంటున్నారో నిర్ణయించుకోండి' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. నిజానికి సుప్రీం కనుక తన తీర్పును స్పీకర్ కోర్టులోకి నెట్టకుండా నేరుగా నిర్ణయం తీసుకుని తీర్పు ఇచ్చివుంటే పరిస్థితి మరోలా ఉండేది. పక్కా అఫిడవిట్లు, ఫొటోలు, బహిరంగ ప్రకటనలు, సోషల్ మీడియా పోస్టులు, అనేక నెలలుగా కాంగ్రెస్ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేల భాగస్వామ్యాన్ని స్పష్టంగా నివేదించినా అవేవీ పరిగణనలోకి తీసుకోకుండా స్పీకర్ సాంకేతికంగా ఇప్పటికీ బీఆర్ఎస్‌తోనే ఉన్నారని పేర్కొనడంపై పెద్దగా ఆశ్చర్య పడాల్సిన పనిలేదు. పార్టీ ఫిరాయింపుల విషయంలో వెలువడిన నిర్ణయం రాజకీయ పార్టీలకు కనువిప్పు కావాలి. తమకు మాత్రం వ్యతిరేకమైన సందర్భాల్లో మాత్రమే స్పందించడం కాదు...ఎప్పుడూ ఒకేలా ఉండాలి. దీనికి భిన్నంగా ఏదో జరుగుతుందని కూడా ఎవరూ అనుకోవద్దు. ప్రజాజీవితంలో నైతిక విలువలు పూర్తిగా లుప్తమైన స్థితిలో ఇలాంటి అనైతికత ఓడుతుందని నైతికత గెలుస్తుందనీ ఎదురుచూడటం అత్యాశే అవుతుంది.

# 'వీబీ జీ రామ్ జీ' బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- లోక్‌సభలో ప్రతులు చించి నిరసన తెలిపిన విపక్షం
- వెల్‌లోకి దూసుకెళ్లి పప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన
- మహాత్ముడి పేరు మార్పు దుర్మార్గమని విమర్శలు
- గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్నామన్న శివరాజ్‌సింగ్





**న్యూఢిల్లీ, డిసెంబర్ 18:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో 'వీబీ జీ రామ్ జీ' పేరుతో తీసుకువచ్చిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ప్రతిపక్ష ఎంపీల ఆందోళనలు, నిరసనల మధ్య ఈ బిల్లును ఆమోదించారు. అయితే, బిల్లును స్టాండింగ్ కమిటీకి పంపించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి నిరసన వ్యక్తం చేశారు. విపక్ష సభ్యుల నిరసనలపై స్పందించిన స్పీకర్.. ఓం బిర్లా బిల్లుపై సుధీర్ఘంగా చర్చించారని చెప్పారు. 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' ఎంజీనరేగాను రద్దు చేసి దాని స్థానంలో కొత్త చట్టం తీసుకొచ్చేందుకు ఉద్దేశించిన 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్-గ్రామీణ్' (వీబీ జీ రామ్ జీ) బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లుపై చర్చ సందర్భంగా విపక్షాలు పెద్దఎత్తున నిరసన వ్యక్తంచేశాయి. వారి ఆందోళన నడుమ స్పీకర్ ఓటింగ్ నిర్వహించగా.. బిల్లుకు ఆమోదం లభించింది. ఈ సమయంలో విపక్ష ఎంపీలు వెల్‌లోకి వచ్చి నిరసన చేపట్టాయి. కొందరు ప్రతిపక్ష నేతలు 'వీబీ జీ రామ్ జీ' బిల్లు ప్రతులను చించి విసిరేశారు. ఈ గందరగోళం నేపథ్యంలో లోక్‌సభ శుక్రవారానికి వాయిదా పడింది. అంతకుముందు బిల్లు తీరుపట్ల మరింత ఆగ్రహానికి గురైన విపక్ష సభ్యులు.. బిల్లు ప్రతులను చించి పడేశారు. వీరి ఆందోళనల మధ్యే బిల్లు ఆమోదం పొందినట్లు స్పీకర్ ప్రకటించారు. ఇక లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో.. ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా, డీఎంకే నాయకులు టీఆర్ బాలు, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు ధర్మేంద్ర యాదవ్ సహా పలువురు విపక్ష పార్టీల సభ్యులు.. జీ రామ్‌జీ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. బిల్లుకు వ్యతిరేకంగా సభలో ఆందోళన చేపట్టారు. ఈ పథకానికి మహాత్మాగాంధీ పేరును తొలగించడం అంటే జాతిపితను అవమానించడమేనని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ బిల్లుతో రాష్ట్రాలపై మరింత భారం పడుతుందని ఆరోపించారు. మరోవైపు జీ రామ్‌జీ బిల్లును కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సమర్థించారు. బిల్లుపై లోక్‌సభలో మాట్లాడిన శివరాజ్ సింగ్.. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలకు నెహ్రూ పేరును పెట్టిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోందని విమర్శించారు. ప్రభుత్వానికి పేర్లు మార్చాలనే దురుద్దేశం ఉందంటూ ప్రియాంక వ్యాఖ్యలను సైతం ఆయన ఖండించారు. పేర్లు మార్చాలనే ఉద్దేశం కేవలం ప్రతిపక్ష పార్టీలకు మాత్రమే ఉందన్నారు. ప్రధాని నేతృత్వంలోని తమ ప్రభుత్వం కేవలం పనిపై మాత్రమే దృష్టి పెడుతోందని చెప్పుకొచ్చారు. అందరితో చర్చించిన తర్వాతే కొత్త చట్టాన్ని తీసుకువచ్చామని కేంద్రమంత్రి ఉద్ఘాటించారు. కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కామెంట్స్‌పై ప్రతిపక్ష సభ్యులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు ఎంపీలు సభ వెల్‌లోకి ప్రవేశించి.. బిల్లుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. బిల్లు ప్రతులను చించేశారు. ఈ సందర్భంగా స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లా మాట్లాడుతూ.. 'కాగితాలను చించివేయడానికి ప్రజలు మిమ్మల్ని ఇక్కడికి పంపలేదు. దేశం మిమ్మల్ని చూస్తోంది.' అని విపక్ష సభ్యులను హెచ్చరించారు. అంతకుముందు బిల్లుపై చర్చ సందర్భంగా విపక్షాల ఆరోపణలకు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ బదులిచ్చారు. మహాత్మాగాంధీ సిద్ధాంతాలకు అనుగుణంగానే మోదీ ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. బాపూ సిద్ధాంతాలను కాంగ్రెస్ సర్కారు చంపేసింది. కానీ, ఎన్డీయే ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తోంది. పీఎం ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, స్వచ్ఛభారత్ మిషన్, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలతో గాంధీజీ కలలను మేం సాకారం చేస్తున్నాం అని తెలిపారు. ఈ సందర్భంగా గత కాంగ్రెస్ పాలనపై ఆయన విరుచుకుపడ్డారు. తొలుత ఉపాధి హామీ పథకానికిఎన్ఆర్‌జిఎ అనే పేరు ఉండేది. ఆ తర్వాత 2009లో లోక్‌సభ ఎన్నికల సమయంలో ఓటర్లను ఆకర్షించేందుకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకానికి మహాత్మాగాంధీ పేరు చేర్చింది. అంతేకాదు.. వారి హయాంలో ఈ పథకం అమలులో అనేక లోటుపాట్లు చోటుచేసుకున్నాయి. కూలీలపై ఎక్కువ ఖర్చు చేసి.. మెటీరియల్ కొనుగోలుకు తక్కువ వెచ్చించారని చౌహాన్ మండిపడ్డారు. పేరు మార్పుపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ విమర్శలను ప్రస్తావిస్తూ.. గతంలోనే అనేక పథకాలకు కాంగ్రెస్ గాంధీ-నెహ్రూ పేర్లు పెట్టిన విషయాన్ని గుర్తుచేశారు. పల్లె ప్రాంత నిరుపేదలకు ఉపాధి కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, గ్రామీణ ప్రాంతాల్లో సుస్థిర ఆస్తుల కల్పన, వనరుల ఉత్పాదకత, అభివృద్ధి లక్ష్యాలుగా దాదాపు రెండు దశాబ్దాల కిందట 'ఎన్ఆర్ఈజీఏ' చట్టాన్ని 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చింది. తర్వాత 2009లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంగా పేరు మార్చారు. అనంతరం సభను వాయిదా వేశారు.

## మహాత్ముడిని అవమానించారు

### రాష్ట్రాలపై భారం మోపేలా బిల్లు: ప్రియాంక



**న్యూఢిల్లీ, డిసెంబర్ 18:** మహాత్మాగాంధీని అవమానించేందుకే కొత్తగా జి రామ్ జీ బిల్లును తీసుకుని వచ్చారని కాంగ్రెస్ ఎంపి ప్రియాంకగాంధీ ఆరోపించారు. సభ వాయిదా పడిన తరువాత పార్లమెంట్ వెలుపల ప్రియాంక గాంధీ వాద్రా మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీ రామ్‌జీ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయన్నారు. 'బిల్లులోని వివరాలను చదివిన ఎవరికైనా గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎలా పూర్తి కాబోతోందో అర్థమవుతుంది. ఈ బిల్లు వలన రాష్ట్రాలపై మరింత ఆర్థిక భారం పడనుంది. రాష్ట్రాలు ఆర్థికంగా ఇబ్బంది పడే అవకాశం ఉంది. నరేగా పథకం పేదలకు అండగా ఉండేది. కానీ, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లు పేదలకు పూర్తి వ్యతిరేకంగా ఉంది.' అంటూ కేంద్ర ప్రభుత్వం తీరుపై ప్రియాంక తీవ్ర విమర్శలు చేశారు.

## సభలో విపక్షం తీరు దారుణం

### ప్రతులను చించివేయడం సభను అవమానించడమే

### కేంద్రమంత్రులు బఘేల్, చిరాగ్ పాశ్వాన్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 18:** కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ మాట్లాడుతూ.. లోక్‌సభలో విపక్ష సభ్యులు వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో బిల్లు కాగితాలను చించివేశారని.. ఇది ఖండించాల్సిన అంశమన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలకు చోటు లేదన్నారు. జీ రామ్‌జీ బిల్లుపై సుదీర్ఘంగా చర్చించారని.. అయినప్పటికీ విపక్ష సభ్యులు బిల్లు ప్రతులను చించడం దారుణమన్నారు. ప్రజల ప్రయోజనాల కోసమే ఈ బిల్లును తీసుకురావడం జరిగిందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ మాట్లాడుతూ.. లోక్‌సభలో ప్రతిపక్ష సభ్యులు వ్యవహరించిన తీరు ఏమాత్రం ఆమోదనీయం కాదన్నారు. 'మీకు వ్యతిరేకించే హక్కు ఉంది. కానీ, ఈ రకమైన ప్రవర్తన సరికాదు. బిల్లు ప్రతులను చించివేయడం, విమానాలు తయారు చేయడం, స్పీకర్‌పై విసరడం సరికాదు. దేశంలోనే అతిపురాతన పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ సభ్యులు.. ఇలా ప్రవర్తించడం గర్హనీయం. బిల్లుకు పెట్టిన పేరును విపక్ష సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. కానీ, రాముడి పేరు ఆ మహాత్మా గాంధీకి ఎంతో ఇష్టమైన పేరు. ఆయన తుదిశ్వాస విడిచే సమయంలోనూ 'హే రామ్' అనే అన్నారు.' అంటూ కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

## ప్రైవేట్ రంగంలో అణు విద్యుత్

### బిల్లుకు పార్లమెంట్ ఆమోదం

న్యూఢిల్లీ, డిసెంబర్ 18: అణు ఇంధన రంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని అనుమతించే బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. సస్టెయినబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా- శాంతి పేరుతో రూపొందించిన ఈ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపగా.. గురువారం రాజ్యసభలో మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. భాగస్వాముల్ని అనుమతించడం వల్ల పెట్టుబడులు, ఉద్యోగావకాశాలు కూడా పెరుగుతాయని అధికారపక్షం చెబుతోంది. ఈ బిల్లుపై చర్చకు మంత్రి జితేంద్రసింగ్ సమాధానమిస్తూ.. ఇతర పునరుత్పాదక ఇంధన వనరులతో పోలిస్తే అణుశక్తి ద్వారా నిరంతరాయ విద్యుత్ సరఫరాకు ఆస్కారం ఉంటుందని చెప్పారు. భద్రత విషయంలో ఆందోళన అక్కర్లేదున్నారు. రేడియేషన్ వల్ల ప్రజలకు హాని జరిగినట్లుగా ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టంచేశారు. 2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుదుత్పత్తిని సాధించాల్సి ఉందని గుర్తుచేశారు. ప్రైవేటు రాజ్యసభలో ఈ బిల్లుపై చర్చ సందర్భంగా ప్రైవేటు భాగస్వామ్యాన్ని విపక్ష ఎంపీలు తప్పుబట్టారు. దేశ సార్వభౌమత్వం, భద్రతపై దీనివల్ల ప్రభావం పడుతుందని తృణమూల్ ఎంపీ సాగరిక ఘోష్ ఆరోపించారు. ఈ బిల్లు చాలా ప్రమాదకరమని డీఎంకే ఎంపీ పీ విల్సన్ విమర్శించారు. ప్రైవేటుకు లాభాలు కట్టబెట్టడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోందన్నారు. ఈ బిల్లును సెలక్ట్ కమిటీకి పంపించాలని డిమాండ్ చేశారు. పునరుత్పాదక ఇంధనం ఉండగా.. న్యూక్లియర్ పవర్‌పై అంత ఆసక్తి దేనికని ఆప్ ఎంపీ సందీప్ పాఠక్ ప్రశ్నించారు. ఇదే భాజపా గతంలో భారత్- అమెరికా అణు ఒప్పందాన్ని వ్యతిరేకించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. చైనా, ఫ్రాన్స్, రష్యా వంటి దేశాల్లో అణు ఇంధన రంగం ప్రభుత్వం చేతిలోనే ఉందని, అమెరికాలో మాత్రమే 80 శాతం మేర ప్రైవేటు భాగస్వామ్యం ఉందని పేర్కొన్నారు. అమెరికా మోడల్ మనలాంటి దేశాలకు ఏమాత్రం సరికాదన్నారు. ఈ బిల్లును జేపీసీకి పంపించాలని బీజేడీ ఎంపీ ముజిబుల్లాఖాన్ డిమాండ్ చేశారు.





## ప్రధాని మోడీకి మరో గౌరవం

### ఆర్డర్ ఆఫ్ ఒమన్' పురస్కారం ప్రదానం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 18:** భారత ప్రధాని నరేంద్ర మోదీకి అంతర్జాతీయ స్థాయిలో మరో అరుదైన గౌరవం దక్కింది. బుధవారం ఇథియోపియా అత్యున్నత పురస్కారాన్ని అందుకున్న ప్రధాని మోదీ.. మరుసటి రోజే మరో అరుదైన ఘనతను దక్కించుకున్నారు. ఒమన్ దేశం కూడా తన అత్యున్నత పౌర పురస్కారంతో ప్రధాని మోదీని గౌరవించడం విశేషం. ప్రధాని మోదీ తన మూడు దేశాల పర్యటనలో భాగంగా చివరిగా ఒమన్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య పలు ఒప్పందాలు ఖరారయ్యాయి. భారత్, ఒమన్ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో చేసిన కృషికి గుర్తింపుగా ఒమన్ సుల్తాన్ హైతం బిన్ తారిక్.. మోదీకి 'ఆర్డర్ ఆఫ్ ఒమన్' పురస్కారాన్ని ప్రదానం చేశారు. 'ఆర్డర్ ఆఫ్ ఒమన్' అనేది ఒమన్, విదేశీయులకు ఇచ్చే అత్యంత విశిష్టమైన పౌర పురస్కారం. భారత్ - ఒమన్ దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మోదీ ఒమన్‌లో పర్యటిస్తున్నారు. కాగా, ప్రధాని మోదీ ఇప్పటివరకు వివిధ దేశాల నుంచి 29 అత్యున్నత పౌర పురస్కారాలను అందుకున్నారు. ఇటీవల కువైట్ ప్రభుత్వం కూడా 'ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్-కబీర్'తో ఆయనను గౌరవించింది. బుధవారం ఇథియోపియా తన అత్యున్నత పురస్కారమైన 'నిషాన్ ఆఫ్ ఇథియోపియా'తో ప్రధాని మోదీని సత్కరించింది.

# 281 లారీల బియ్యం మాయం!

## బండలింగాపూర్-వెంకటాపూర్ రెండు రైస్ మిల్లుల్లో గోల్‌మాల్?







- విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీల్లో బయల్పడిన నిజాలు
- సివిల్ సప్లై శాఖ జగిత్యాల డిఎం ఆధ్వర్యంలో జరిగిన తనిఖీలు
- 10 రోజులైనా చర్యలు శూన్యం.?
- 'ఆమ్యామ్యా'ల కోసం వెయిటింగ్ కావొచ్చన్న విమర్శలు

'తిన్న నాలుక తింటనే ఉంటదంట.. తిరిగిన కాలు తిరుగుతనే ఉంటదని' పల్లెటూరి సామెత.! సరిగ్గా ఇలానే ఉంది.. 'రైస్ మిల్లర్లు-అధికారుల' యవ్వారం.! మీరు దోచుకోండి.. మాకు ఇంత ప్రసాదం ఇయ్యండ్రి..చాలు.! మిమ్మల్ని కాపాడే బాధ్యత మాది అని వకాల్తా పుచ్చుకున్నట్టుగా స్పష్టమవుతోంది సివిల్ సప్లై అధికారులది.! వారం రోజుల క్రితం కోరుట్ల మండలం వెంకటాపూర్.. మెట్‌పల్లి మండలం బండలింగాపూర్‌లో గల రెండు రైస్ మిల్లుల్లో జరిగిన ఆకస్మిక తనిఖీల్లో 2025-26 ఖరీఫ్ సీజన్ ధాన్యం 281 లారీల సిఎమ్మార్ బియ్యం మాయం చేసినట్టు వెలుగులోకి వచ్చింది.

- నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)





### ఏందీ? 281 లారీ బియ్యం మాయమా?

ఔను..! రైస్ మిల్లర్ల యజమానుల ముచ్చట్లలో రెండు, మూడు రోజుల నుంచి ఇదే 'హాట్ టాపిక్'గా మారింది. మెట్‌పల్లి మండలం బండలింగాపూర్‌లోని 'భవానీ రైస్ మిల్లు'లో.. కోరుట్ల మండలం వెంకటాపూర్‌లో గల 'వాసవి రైస్ మిల్లర్'లో ఇదే వారంలో సివిల్ సప్లై అధికారులు జగిత్యాల డిఎం ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భవానీ రైస్ మిల్లులో 65 లారీల బియ్యం.. వాసవి రైస్ మిల్లులో 216 లారీల బియ్యం మాయమైనట్టు తనిఖీల్లో గుర్తించారు.

### మరి.. ఈ దొంగ రైస్ మిల్లర్లపై చర్యలేవీ?

ఈ రెండు రైస్ మిల్లుల్లో సివిల్ సప్లై అధికారులు.. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్' అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి సిఎమ్మార్ ధాన్యంలో తేడా వచ్చిందని..65ం216 లారీల బియ్యం మాయమైనట్టు గుర్తించి ఉన్నతాధికారులకు నివేదికలను సమర్పించినట్టు సమాచారం. అయితే.. వీరిపై.. రైస్ మిల్ సీజ్ చేయడం.. బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేయడం.. ఆర్ఆర్ ఆక్ట్ కింద కేసు నమోదు చేయడం లాంటివి చేయాలి.! కానీ, అధికారులు ఇవేవీ చట్టబద్ధంగా చేయకుండా.. దొంగల దగ్గర అందినకాడికి జేబులు నింపుకునే పనిలో పడ్డారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### గుట్టుచప్పుడు కాకుండా తనిఖీలు?

తనిఖీ అధికారులు ఇటీవల తమ దాడులను తరచూ నిర్వహిస్తున్నారూ. మూడేళ్లుగా సిఎమ్మార్ బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పజెప్పకుండా 'బ్లాక్ మార్కెట్'కు తరలించి కోట్లాది రూపాయలు దండుకుంటున్నారు. దీనికి ప్రభుత్వం కూడా లైట్ తీసుకుంది. చట్టరీత్యా చాలా రకాల చర్యలు తీసుకునే అవకాశం ఉన్నా 'లైట్ తీసుకోవడం' మూలానా రైస్ మిల్లర్ల ఆటలు పెచ్చుమీరుతున్నాయి.ఇదే క్రమంలో రైస్ మిల్లర్లు దోచుకుంటున్న సొమ్మును తలా కాస్త పంచిస్తుండడంతో యథేచ్ఛగా సీఎమ్మార్ మాయం చేసుకునేందుకు విచ్చలవిడిగా అలవాటుపడ్డారు.ఇదే క్రమంలో కోరుట్ల-మెట్‌పల్లి మండలాల పరిధిలో జరిగిన తనిఖీలపై చర్యలు తీసుకోవడంలో ఎందుకు జాప్యం జరుగుతోందని సర్వత్రా చర్చనీయాంశం అయ్యింది. గత సీఎమ్మార్ మాయం గురించి పల్లెత్తు మాట అనని ఇదే సివిల్ సప్లై అధికారులు.. ఇప్పుడు 'ఫ్రెష్'గా 2025-26 సంవత్సరం ఖరీఫ్ ధాన్యాన్ని యధేచ్ఛగా అమ్ముకుంటున్నా..పట్టించుకునే అధికారే లేకపోవడం సిగ్గుచేటు.ఒకవేళ పట్టుకున్నా..ఒక్క ఫోన్ కాల్‌తో 'సెటిల్మెంట్' ఖతం.! ఇదీ ఇప్పుడు జరుగుతున్న తంతు.! చూడాలి ఇప్పుడేం జరుగుతోందో.!?



# అక్రమ నల్లా కనెక్షన్లపై జలమండలి ఉక్కుపాదం

**9 మందిపై క్రిమినల్ కేసులు నమోదు! ● సీతారాం బాగ్ ప్రాంతంలో 15 అక్రమ కనెక్షన్ల తొలగింపు**

**ఎండీ అశోక్ రెడ్డి ఆదేశాలతో విజిలెన్స్ చర్యలు**

**హైదరాబాద్, డిసెంబర్ 18:** హైదరాబాద్ మహా నగర తాగునీటి సరఫరా మరియు మురుగునీటి పారుదల మండలి (జలమండలి) అక్రమ నల్లా కనెక్షన్‌దారులపై కఠిన చర్యలకు ఉపక్రమించింది. జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రెడ్ హిల్స్ పరిధిలోని సీతారాం బాగ్ ప్రాంతంలో ఈ ఉల్లంఘనలు వెలుగులోకి వచ్చాయి. ఇటీవల ఈ ప్రాంతంలో జీహెచ్ఎంసీ నూతన రోడ్డు పనులు చేపట్టింది. ఈ నిర్మాణ సమయాన్ని అదునుగా తీసుకున్న కొందరు నివాసితులు అధికారుల అనుమతి లేకుండా జలమండలి ప్రధాన పైపులైన్ నుంచి అక్రమంగా



కనెక్షన్లు తీసుకున్నారు. ఇక్కడ నివసించే తొమ్మిది మందికి ఇప్పటికే అధికారిక కనెక్షన్లు ఉండగా, అదనంగా మరో 15 అక్రమ నల్లా కనెక్షన్లను స్వయంగా ఏర్పాటు చేసుకున్నట్లు విజిలెన్స్ విభాగం గుర్తించింది. అక్రమ కనెక్షన్ల సమాచారం అందిన వెంటనే జలమండలి విజిలెన్స్ బృందం రంగంలోకి దిగింది. పైపులైన్లకు ఏర్పాటు చేసిన 15 అక్రమ కనెక్షన్లను అధికారులు తక్షణమే తొలగించారు. ప్రభుత్వ ఆస్తిని దుర్వినియోగం చేసినందుకు మరియు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినందుకు గాను ఆ తొమ్మిది మందిపై చందానగర్/స్థానిక పోలీస్ స్టేషన్లలో క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అధికారుల అనుమతి లేకుండా తాగునీటి నల్లా లేదా సీవరేజ్ పైపులైన్ కనెక్షన్లు తీసుకోవడం నేరమని జలమండలి స్పష్టం చేసింది. నగరవ్యాప్తంగా అక్రమ కనెక్షన్లపై నిరంతరం నిఘా ఉంటుందని, ఉల్లంఘనదారులపై ఎటువంటి ముందస్తు నోటీసులు లేకుండానే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరికైనా కనెక్షన్లు అవసరమైతే జలమండలి వెబ్‌సైట్ ద్వారా లేదా కార్యాలయంలో సంప్రదించి అధికారికంగా పొందాలని సూచించారు. నగరంలో ఎక్కడైనా అక్రమ నల్లా లేదా సీవరేజ్ కనెక్షన్లను గమనిస్తే వెంటనే జలమండలి విజిలెన్స్ బృందానికి సమాచారం అందించాలని అధికారులు కోరారు.

# క్రీడలతో నూతనోత్సాహం

- డీజీపీ బి. శివధర్ రెడ్డి
- ముగిసిన 8వ యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్

**శేరిలింగంపల్లి:** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో మూడురోజులుగా జరుగుతున్న 8వ యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ - 2025. ఘనంగా ముగిసింది.ఈ స్పోర్ట్స్ మీట్ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి హాజరయ్యారు. వివిధ జోన్లు, విభాగాల నుంచి పోలీసు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.ముందుగా డీజీపీ శివధర్ రెడ్డి రెనవేటెడ్/ పునర్నిర్మించిన పోలీస్ ఫుడ్ క్యాంటీన్ "ద కాప్ కేఫ్"ను ప్రారంభించారు.అనంతరం పరేడ్ గ్రౌండ్స్‌కు చేరుకున్న డీజీపీకి పోలీసు జాగిలం మౌని పూలబుట్ట అందించడం అందరినీ ఆకట్టుకుంది. పురుషులు, మహిళల 100 మీటర్ల పరుగు పందెం డీజీపీ చేతుల మీదుగా ప్రారంభమయ్యాయి. పరేడ్ కమాండర్ నాగరాజు రెడ్డి నేతృత్వంలో సలామీ శస్త్ర స్వీకరించిన డీజీపీ. నిత్యం శాంతి భద్రతలను కాపాడడంలో పోలీసుల బాధ్యతలు ఒత్తిడితో కూడినవైనప్పటికీ క్రీడల్లో పాల్గొనడం నూతన ఉత్సాహాన్ని అందిస్తుందన్నారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంచుతాయన్నారు. క్రీడలు మానసిక స్థైర్యం, టీం స్పిరిట్, ఓర్పు, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఐక్యత వంటి గుణాలను తట్టి లేపుతాయన్నారు.పోలీసు సిబ్బంది శారీరక, మానసిక ఆరోగ్యం కోసం కృషి చేస్తున్న సైబరాబాద్ సీపీ, జాయింట్ సీపీ, అధికారులు, సిబ్బందిని డీజీపీ అభినందించారు. క్రీడల్లో గెలుపు-ఓటములనేవి సహజమని, స్పోర్టివ్ గా తీసుకోవాలన్నారు. మెడల్స్ గెలిచినా గెలవకున్నా ప్రజల మనసులు గెలుచుకున్న పోలీసులే నిజమైన విజేతలని డీజీపీ అన్నారు. 2014 నుంచి తెలంగాణ పోలీసులు సాధిస్తున్న విజయాలను ఉదాహరిస్తూ, ఆ స్ఫూర్తిని విధి నిర్వహణలోనూ కొనసాగించాలని సూచించారు. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు 1,022 మంది పోలీస్ సిబ్బంది ఈ క్రీడల్లో పాల్గొన్నారన్నారు. పోలీసుల ఆరోగ్యం కోసం బ్యాడ్మింటన్, టెన్నిస్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, ఫుట్‌బాల్ కోర్టులు ఏర్పాటు



చేశామని చెప్పారు. స్పోర్ట్స్ మీట్ ను విజయవంతానికి కృషి చేసిన జాయింట్ సీపీ డాక్టర్ గజరావు భూపాల్, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, ఏడీసీపీలు, ఏసీపీలు, ఇతర సిబ్బందికి సీపీ కృతజ్ఞతలు తెలిపారు. విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లను డీజీపీ అందజేశారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, జాయింట్ సీపీ డాక్టర్ గజరావు భూపాల్, మాదాపూర్ డీసీపీ రితిరాజ్, మేడ్చల్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, బాలానగర్ డీసీపీ కె. సురేష్ కుమార్, రాజేంద్రనగర్ డీసీపీ యోగేష్ గౌతమ్, శంషాబాద్ డీసీపీ బి. రాజేష్, క్రైమ్స్ డీసీపీ ఎ. ముత్యం రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీసీపీ వై.వి.ఎస్. సుధీంద్ర, విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డిసిపి సృజన కర్ణం, మాదాపూర్ ఎస్ఓటీ డీసీపీ శోభన్ కుమార్, సైబరాబాద్ సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీ సాయి మనోహర్, మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్, ఏడీసీపీలు, ఏసీపీలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి సాక్షి
కరీంనగర్ | శుక్రవారం 19 డిసెంబర్ 2025

# పైడిపల్లిలో లాఠీఛార్జ్ గాల్లోకి కాల్పులు




## రీకౌంటింగ్ డిమాండ్‌తో రేగిన ఉద్రిక్తత

## వైఫల్యం ఎవరిది.? అసలేం జరిగింది.?



**నేటి సాక్షి, జగిత్యాల (రాధారపు నర్సయ్య):** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం పైడిపల్లి గ్రామంలో మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల ఫలితాల అనంతరం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. సర్పంచ్ ఎన్నిక ఫలితాన్ని తారుమారు చేశారంటూ గ్రామస్తులు, యువత పోలింగ్ సిబ్బందితో ఘర్షణకు దిగారు. పోలింగ్ కేంద్రం ఎదుట నిరసనకు దిగిన ఆందోళనకారులు పోలీసులపై రాళ్లు రువ్వడంతో పాటు పోలీసు వాహనాలను ధ్వంసం చేశారు. పరిస్థితి అదుపు తప్పడంతో పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో పాటు గాల్లోకి కాల్పులు జరిపినట్లు సమాచారం. ఈ ఘటనలో నలుగురు పోలీసులకు గాయాలైనట్లు తెలిసింది.

### కాల్పులు ఎవరి వైఫల్యం.?

పైడిపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ ఎన్నికల అనంతరం చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలు ప్రజాస్వామ్య వ్యవస్థపై అనేక అనుమానాలను మిగిల్చాయి. ఓట్ల లెక్కింపుపై విశ్వాస లోపం, రీకౌంటింగ్–రీపోలింగ్ డిమాండ్లను తిరస్కరించడం, చివరకు పోలీసుల గాల్లోకి కాల్పుల వరకు పరిస్థితి చేరడం... ఇవన్నీ సహజంగానే కీలక ప్రశ్నలకు తావిస్తోంది.

### పైడిపల్లి ఘటన.. ఒక గ్రామ సమస్య మాత్రమేనా?

మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో పైడిపల్లి గ్రామంలో సర్పంచ్ ఎన్నిక ఫలితాన్ని తారుమారు చేశారంటూ గ్రామస్తులు ఆందోళనకు దిగారు. రీకౌంటింగ్ చేయాలని డిమాండ్ చేస్తూ బ్యాలెట్ బాక్సులను తరలించకుండా అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలింగ్ సిబ్బందితో ఘర్షణ, పోలీసు వాహనాలపై రాళ్ల దాడి, లాఠీచార్జ్.. చివరకు పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపే స్థాయికి పరిస్థితి చేరింది. ఈ ఘటనలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్‌కు తలకు గాయాలయ్యాయన్న సమాచారం తీవ్రతను మరింత స్పష్టం చేస్తోంది.

### కాల్పులు తప్పనిసరయ్యాయా?

పరిస్థితి అదుపు తప్పడంతో పోలీసులు పది రౌండ్ల వరకు గాల్లోకి కాల్పులు జరిపినట్లు సమాచారం. ఇది కేవలం గుంపును చెదరగొట్టేందుకు తీసుకున్న చర్యగానే భావించాలా? లేక పరిస్థితిని ముందే చల్లార్చడంలో యంత్రాంగం విఫలమైందా? అన్న సందేహాలు సహజంగానే తలెత్తుతున్నాయి. రీకౌంటింగ్ లేదా కనీసం పారదర్శక ప్రక్రియకు ఒప్పుకుని ఉంటే ఈ స్థాయిలో ఉద్రిక్తత వచ్చేదా అన్న ప్రశ్నకు ఇప్పటికీ స్పష్టమైన సమాధానం లేదు.

### భయాందోళనలో గ్రామం.. భారీ బందోబస్తు

ఘటన అనంతరం పైడిపల్లి గ్రామంలో భయాందోళన వాతావరణం నెలకొంది. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రస్తుతం గ్రామంలో నాలుగు మంది డీఎస్పీలు, 12 మంది సీఐలు, పదుల సంఖ్యలో ఎస్సైలు, వందమందికి పైగా పోలీసులతో గట్టి బందోబస్తు కొనసాగుతోంది. ఇది పరిస్థితి ఎంత సున్నితంగా మారిందో చెప్పకనే చెబుతోంది.

### ఎన్నికల యంత్రాంగంపై ప్రశ్నలు

జిల్లాలో మూడు విడతల్లో నిర్వహించిన గ్రామపంచాయతీ ఎన్నికలన్నీ పెద్దగా అవాంతరాలు లేకుండా ముగిశాయి. అలాంటిది కేవలం పైడిపల్లి గ్రామంలోనే ఈ స్థాయి ఉద్రిక్తత ఎందుకు చోటుచేసుకుంది? ఇది అభ్యర్థుల మధ్య పోటీ ఫలితమేనా? లేక గ్రామస్తులు ఆరోపిస్తున్నట్లుగా నిజంగానే "పెద్దల జోక్యం" ఉందా? ఓట్ల లెక్కింపుపై ఇంత తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నప్పుడు రిపోలింగ్ డిమాండ్‌ను అధికారులు ఎందుకు తిరస్కరించారు అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

### పోలీసు బలమా? ప్రజల నమ్మకమా?

గ్రామస్తులు బ్యాలెట్ బాక్సులను బయటకు తీసుకెళ్లనివ్వకుండా అడ్డుకోవడం వెనుక ఉన్న ఆగ్రహాన్ని కేవలం చట్టవ్యతిరేక చర్యగా కొట్టిపారేయవచ్చా? అధికారుల వివరణ ప్రజలకు నమ్మకం కలిగించిందా? లేక పోలీసు బలంతో సమస్యను తాత్కాలికంగా అణిచివేయడానికి ప్రయత్నించారా? అన్న సందేహాలు ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

### అసలు బాధ్యత ఎవరిది?

కాల్పులకు అసలు కారకులెవరు? పరిస్థితిని అదుపు చేయాల్సిన బాధ్యత ఎవరిది? ఈ ఘటనపై ఉన్నతస్థాయి విచారణ జరుగుతుందా? లేక ఇది కూడా "తాత్కాలిక బందోబస్తుతో" మరిచిపోయే అంశంగా మిగిలిపోతుందా? అన్న ప్రశ్నలకు ఇప్పటికీ స్పష్టత లేదు.

### ప్రజాస్వామ్యానికి హెచ్చరిక

పైడిపల్లి ఘటన ఒక గ్రామానికి పరిమితమైన సమస్య కాదు. ప్రజాస్వామ్యంలో బ్యాలెట్‌నే ప్రజల నమ్మకం. ఆ నమ్మకాన్ని కాపాడడంలో ఎక్కడైనా లోపం తలెత్తితే, అది ఓ గ్రామ సమస్యగా కాకుండా వ్యవస్థపై వచ్చిన ప్రశ్నగా మారుతుంది. ఇప్పుడు ప్రజలు ఎదురు చూస్తున్నది ఒక్కటే స్పష్టత, పారదర్శకత, బాధ్యత. ఇవి లేకపోతే పైడిపల్లి ప్రశ్నలు జగిత్యాల జిల్లానికే కాదు.. వ్యవస్థ మొత్తానికీ వెంటాడుతూనే ఉంటాయి.

## అసలేం జరిగింది అంటే.!

పైడిపల్లి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా బీఆర్ఎస్ మద్దతుదారు గంగుల మంగ గెలిచినట్లు అధికారులు ప్రకటించగా, ఓడిపోయిన వర్గం ఓట్ల లెక్కింపులో అవకతవకలు జరిగాయని ఆరోపించింది. ఒక బ్యాలెట్ బాక్స్‌లోని ఓట్లు పూర్తిగా లెక్కించకుండానే ఫలితం ప్రకటించారని, కొందరి జోక్యంతో చివరి నిమిషంలో ఫలితం మార్చారని గ్రామస్తులు పేర్కొన్నారు. రీకౌంటింగ్ చేయాలని డిమాండ్ చేస్తూ బ్యాలెట్ బాక్సులను తరలించకుండా పోలింగ్ కేంద్రం ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు. పోలీసులు సుమారు రెండు గంటల పాటు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఈ ఘటనపై డీఎస్పీ డి. రఘు చందర్ వివరణ ఇస్తూ, డిసెంబర్ 17న ఓట్ల లెక్కింపు అనంతరం ఎన్నికల్లో ఓడిపోయిన ఒక వ్యక్తి తన అనుచరులు, కొందరు గ్రామస్తులతో కలిసి పోలింగ్ స్టేషన్ వద్ద నిరసనకు దిగారని తెలిపారు. పోలింగ్ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించడం, పోలింగ్ సామాగ్రిని ధ్వంసం చేయడానికి ప్రయత్నించడంతో పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు స్వల్ప లాఠీచార్జ్ చేయాల్సి వచ్చిందన్నారు. అనంతరం ఆందోళనకారులు పోలీసులపై రాళ్లు రువ్వడంతో నలుగురు పోలీసు అధికారులకు గాయాలు కాగా, రెండు పోలీసు వాహనాలు ధ్వంసమయ్యాయని చెప్పారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా గాల్లోకి కాల్పులు జరిపి గుంపును చెదరగొట్టామని, ఈ ఘటనపై వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు నమోదు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ స్పష్టం చేశారు.













## తెల్లని దుస్తుల్లో మెరిసిపోతున్న స్మృతి మంధాన

భారత మహిళా స్టార్ క్రికెటర్, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన సోషల్ మీడియాలో తన తాజా ఫోటోలతో సందడి చేస్తోంది. ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న స్మృతి మంధాన.. తెల్లటి వన్-పీస్ డ్రెస్‌లో ఎంతో అందంగా కనిపించింది. బుగ్గపై డింపుల్, ముఖంలో చిరునవ్వుతో ఉన్న ఆమె ఫోటోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి.గత నెలలో స్మృతి మంధాన వ్యక్తిగత జీవితంలో కొన్ని ఒడిదుడుకలు ఎదురైన విషయం తెలిసిందే. పలాష్ ముచ్చల్‌తో వివాహం రద్దయిందని స్వయంగా స్మృతి మంధాన సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. ఈ వార్త అభిమానులను కొంత ఆందోళనకు గురిచేసింది. అయితే కష్టకాలం నుంచి ఆమె వేగంగా కోలుకుంటోంది. "క్రికెట్టే నా సర్వస్వం, నా మొదటి ప్రేమ" అని ఆమె ఇటీవల పేర్కొంది. తాజా ఫోటోల్లో ఆమె ఉత్సాహంగా ఉండటం చూసి అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.క్రికెట్ మైదానంలో స్మృతి మంధాన సందడి మళ్లీ మొదలుకానుంది. డిసెంబర్ 21 నుండి భారత్, శ్రీలంక జట్ల మధ్య 5 టీ20 మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌లో స్మృతి కీలక పాత్ర పోషించనుంది. జనవరి 9 నుంచి మహిళల ప్రీమియర్ లీగ్ ప్రారంభం కానుంది. ఇందులో స్మృతి మంధాన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు సారథ్యం వహించనుంది.మహిళల ప్రీమియర్ లీగ్ మొదటి మ్యాచ్‌లోనే ఆసక్తికర పోరు జరగనుంది. జనవరి 9న యల్ ఛాలెంజర్స్ బెంగళూరు(స్మృతి మంధాన), ఇండియన్స్ (హర్మన్‌ప్రీత్ కౌర్) జట్లు తలపడనున్నాయి. టీమిండియా కెప్టెన్, స్ కెప్టెన్ తలపడనుండటంతో ఈ మ్యాచ్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

# రోల్ బాల్ వరల్డ్ కప్ విజేతగా భారత్!

రోల్ బాల్ వరల్డ్ కప్‌లో భారత పురుషుల, మహిళల జట్లు విజేతగా నిలిచాయి. దుబాయ్ వేదికగా జరిగిన ఈ టోర్నీ ఫైనల్లో భారత పురుషుల జట్టు 11-10 తేడాతో, మహిళల జట్టు 3-2 తేడాతో కెన్యా పురుషుల, మహిళల జట్లను ఓడించాయి. ఈ గెలుపుతో ప్రపంచకప్ టైటిల్స్‌ను ముద్దాడాయి.ఆసాంతం ఉత్కంఠగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ కెన్యా భారత పురుషుల జట్టుకు గట్టి పోటీనిచ్చింది. ఒక దశలో భారత్ వెనుకంజలో నిలిచినప్పటికీ.. పుంజుకుని ఈ విజయాన్ని కైవసం చేసుకుంది. ఇది భారత పురుషుల జట్టుకు 5వ ప్రపంచకప్ టైటిల్. మహిళలకు మూడో ప్రపంచకప్ టైటిల్. ఈ మెగా ఈవెంట్‌లో భారత్, కెన్యా, పోలాండ్, అర్జెంటీనా, సౌదీ అరేబియా, పాకిస్థాన్ వంటి దేశాలు పాల్గొన్నాయి.2023లో పూణేలో జరిగిన ప్రపంచకప్‌లో కెన్యా చేతిలో ఎదురైన ఓటమికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. ఈసారి దుబాయ్ గడ్డపై భారత్ రెండు విభాగాల్లోనూ క్లీన్ స్వీప్ చేసింది. భారత మూలాలున్న ఈ క్రీడలో మన జట్లు ప్రపంచ స్థాయి ఆధిపత్యాన్ని చెలాయించాయి. భారత పురుషుల జట్టు విజయంలో రోహన్ దాభాడే, హితేష్ సింగ్, యష్ రాశియా, హర్షల్ ఘుగే కీలక పాత్ర పోషించాడు.రోలా బాల్ అనేది భారత్‌లో పుట్టి వినూత్నమైన క్రీడ. సింపుల్‌గా చెప్పాలంటే..



బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, రోలర్ స్కేటింగ్ కలిసిన ఆట. ఈ క్రీడలో ఆటగాళ్ళు రోలర్ స్కేట్స్ ధరించి, బంతిని డ్రిబ్లింగ్ చేస్తూ ఎదుటి జట్టు గోల్ పోస్ట్‌లోకి పంపాలి. ప్రతి జట్టులో 12 మంది ఆటగాళ్ళు ఉంటారు. కానీ మైదానంలో ఒకేసారి 6 మంది మాత్రమే ఆడతారు. ఇందులో ఒక గోల్ కీపర్ ఉంటాడు.ఆటగాళ్ళు స్కేటింగ్ చేస్తూ బంతిని చేత్తో పట్టుకుని బాస్కెట్ బాల్ తరహాలో డ్రిబ్లింగ్ చేయాలి. బంతిని ఒక చేత్తో లేదా రెండు చేతులతో పాస్ చేయవచ్చు. కానీ గోల్ వేసేటప్పుడు మాత్రం ఒక చేయి మాత్రమే ఉపయోగించాలి. నిర్ణీత సమయంలో ఏ జట్టు ఎక్కువ గోల్స్ చేస్తే ఆ జట్టు విజేతగా నిలుస్తుంది. భారత్‌లో పుట్టిన ఈ క్రీడను ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా 50కి పైగా దేశాల్లో ఆడుతున్నారు.

# మూడో టెస్ట్‌లోనూ ఆస్ట్రేలియా జోరు

## ఇంగ్లండ్ 68 ఓవర్లలో 8 వికెట్లకు 213 పరుగులు

ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌లో భాగంగా అడిలైడ్ వేదికగా జరుగుతున్న మూడో టెస్ట్‌లోనూ ఆస్ట్రేలియా పట్టుబిగించింది. ముందుగా బ్యాటింగ్‌లో సత్తా చాటిన ఆసీస్.. ఆ తర్వాత బౌలింగ్‌లోనూ చెలరేగింది. దాంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ 68 ఓవర్లలో 8 వికెట్లకు 213 పరుగులు చేసింది. కెప్టెన్ బెన్ స్టోక్స్(45 బ్యాటింగ్)తో పాటు జోఫ్రా ఆర్చర్(30 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. హ్యారీ బ్రూక్(45) పర్వాలేదనిపించగా.. మిగతా బ్యాటర్లు నిరాశపర్చారు. ఆసీస్ బౌలర్లలో ప్యాట్ కమిన్స్ మూడు వికెట్లు తీయగా.. స్కాట్ బోలాండ్, నాథన్ లయన్ రెండేసి వికెట్లు తీసారు. కామెరూన్ గ్రీన్‌కు ఒక వికెట్ దక్కింది.అంతకుముందు 326/8 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను కొనసాగించిన ఇంగ్లండ్.. 91.2 ఓవర్లలో 371 పరుగులకు కుప్పకూలింది. ఓవర్‌నైట్ బ్యాటర్లలో అలెక్స్ క్యారీ(106) త్వరగానే ఔటవ్వగా.. మిచెల్ స్టార్క్(54) హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. నాథన్ లయన్(9) విఫలమవ్వగా.. స్కాట్ బోలాండ్(14 నాటౌట్) అజేయంగా నిలిచాడు. ఇంగ్లండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్(5/53) ఐదు వికెట్లు తీయగా.. బ్రైడన్ కార్స్, విల్ జాక్స్ రెండేసి వికెట్లు పడగొట్టారు. జోష్ టంగ్‌కు ఓ వికెట్ దక్కింది. ఇంగ్లండ్ ఇంకా 158 పరుగుల వెనుకంజలో ఉంది. అద్భుతం జరిగితే తప్పా ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ పుంజుకునే అవకాశాలు కనిపించడం లేదు. ఇప్పటికే ఈ సిరీస్‌లో ఇంగ్లండ్ 0-2తో వెనుకంజలో



నిలిచింది. మరోవైపు డీఆర్ఎస్ విషయంలో తీవ్ర దుమారం రేగింది. సాంకేతిక లోపం కారణంగా ఆస్ట్రేలియా బ్యాటర్ అలెక్స్ క్యారీ ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న అతను ఏకంగా శతకంతో చెలరేగాడు. ఇది ఇంగ్లండ్ జట్టుకు తీవ్ర నష్టం చేసింది.అలెక్స్ క్యారీ సెంచరీతో తొలి రోజు ఆటలో ఆసీస్ ఆధిపత్యం చెలాయించింది. మొదటి రోజు ఆట అనంతరం అలెక్స్ క్యారీ డీఆర్ఎస్ వివాదాంపై స్పందించాడు. తాను ఔటయ్యాననే విషయం తెలుసని, అంపైర్ నాటౌట్ ఇవ్వడంతో బ్యాటింగ్ కొనసాగించి సెంచరీ సాధించానని చెప్పాడు. ఈ వ్యాఖ్యలు మరింత అగ్గిని రాజేసాయి. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ 94 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన అలెక్స్ క్యారీతో కలిసి ఉస్మాన్ ఖవాజా జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. అయితే జోష్ టంగ్ వేసిన 63వ ఓవర్ తొలి బంతి అలెక్స్ క్యారీ బ్యాట్‌ను తాకుతూ వికెట్ కీపర్ చేతిలో పడింది. ఫీల్డ్ అంపైర్ నాటౌట్ ఇచ్చాడు. బ్యాట్‌ను బంతి తాకిన శబ్దం స్పష్టంగా వినిపించింది. దాంతో ఇంగ్లండ్ రివ్యూకి వెళ్లింది. కానీ స్నీకో మీటర్ టెక్నాలజీలో బంతి బ్యాట్‌ను తాకినట్లు తేలలేదు. బంతి బ్యాట్‌కు దూరంగా ఉన్నప్పుడు స్నీకో మీటర్‌లో గీత వచ్చింది. దగ్గరగా ఉన్నప్పుడు మాత్రం ఎలాంటి మార్క్ చూపించలేదు. రిప్లేతో పాటు స్నీకో మీటర్‌లో స్పష్టత లేకపోవడంతో థర్డ్ అంపైర్.. ఫీల్డ్ అంపైర్ నిర్ణయానికి కట్టుబడి నాటౌట్ ఇచ్చాడు. అయితే టెక్నాలజీ లోపం కారణంగానే ఈ తప్పిదం జరిగిందని తొలి రోజు ఆట అనంతరం తేలింది. ఈ మ్యాచ్ టెక్నాలజీ విభాగాన్ని నిర్వహిస్తున్న బీబీజీ స్పోర్ట్స్ కంపెనీ తమ తప్పుకు క్షమాపణలు చెప్పింది. 'అలెక్స్ క్యారీ బ్యాట్‌కు బంతి తగిలింది వాస్తవమే. ఆ సమయంలో మా స్నికో ఆపరేటర్ పొరపాటున బ్యాట్స్‌మన్ వైపు ఉన్న స్టంప్ మైక్‌ను కాకుండా బౌలర్ వైపు ఉన్న మైక్‌ను ఎంచుకున్నాడు. దాంతో ఆడియోలో లోపడం ఏర్పడింది. ఈ తప్పిదానికి మేం బాధ్యత వహిస్తాం.'అని స్పష్టం చేసింది.

# గాలి కాలుష్యం వల్లే మ్యాచ్ రద్దయ్యింది

## పొగ మంచు కారణం కాదు

## సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్

భారత్, సౌతాఫ్రికా మధ్య నాలుగో టీ20 రద్దుకు పొగ మంచు కారణం కాదని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ అన్నారు. గాలి కాలుష్యం వల్లే మ్యాచ్ రద్దయ్యిందని చెప్పారు. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా లక్నో వేదికగా బుధవారం జరగాల్సిన మ్యాచ్ పొగమంచు కారణంగా రద్దయిన సంగతి తెలిసిందే. టాస్ సమయానికే మైదానాన్ని పొగమంచు కమ్మేయడంతో పలు మార్లు మైదానాన్ని పరిశీలించి, విజిబిలిటిని పరీక్షించిన అంపైర్లు చివరకు మ్యాచ్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ వ్యవహారంపై స్పందించిన అఖిలేష్ యాదవ్.. బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఢిల్లీ కాలుష్యం లక్నోకు చేరడంతోనే మ్యాచ్ రద్దయ్యిందని సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. 'ఢిల్లీ కాలుష్యం ఇప్పుడు లక్నోకు చేరుకుంది. అందుకే లక్నోలో జరగాల్సిన అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ రద్దయ్యింది. ఈ మ్యాచ్ రద్దుకు మంచు కారణం కాదు. విషపూరితమైన గాలి కాలుష్యం.లక్నోలో స్వచ్ఛమైన గాలి కోసం మేం ఏర్పాటు చేసిన పార్కులను కూడా బీజేపీ నాశనం చేసింది. పార్కుల్లో అనవసరమైన కార్యక్రమాలు నిర్వహించి వాటిని దెబ్బతీసింది. మానవులతో పర్యవరణానికి బిజేపీ శ్రేయస్కారం కాదు. లక్నోలో ఉంటే మాస్క్ ధరించండి'అని అఖిలేష్ యాదవ్ ట్వీట్ చేశారు.పొగమంచుతో పాటు మైదానం గాలి నాణ్యత దారుణంగా పడిపోవడంతో టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా మాస్క్ ధరించి కనిపించాడు. కాసేపు మైదానంలో ప్రాక్టీస్ చేసిన భారత ఆటగాళ్లు ఆ తర్వాత డ్రెస్సింగ్ రూమ్‌కు పరిమితమయ్యారు. రాత్రి 9.30 గంటలకు చివరిసారిగా మైదాన్ని పరిశీలించిన అంపైర్లు.. మ్యాచ్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.ఈ మ్యాచ్ రద్దవ్వడంపై ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీసీసీఐపై మండిపడుతున్నారు. పొగమంచు కురిసే ప్రదేశాల్లో మ్యాచ్‌లు ఎందుకని, సౌత్ ఇండియాలో చాలా మైదానాలు అనుకూలంగా ఉన్నాయని అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమ టికెట్ డబ్బులు రిటర్న్ చేయాలని ప్రేక్షకులు కోరుతున్నారు. ఈ ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ 2-1తో ఆధిక్యంలో కొనసాగుతుంది. ఆఖరి మ్యాచ్ శుక్రవారం అహ్మదాబాద్ వేదికగా జరగనుంది. ఈ మ్యాచ్ గెలిచి సిరీస్ కైవసం చేసుకోవాలనే పట్టుదలతో భారత్ ఉంది.





# నార్త్‌లో మ్యాచ్‌లు నిర్వహించొద్దు

## కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఎంపీ శశి థరూర్

ఉత్తర భారతదేశంలో డిసెంబర్ మధ్య నుంచి జనవరి మధ్య వరకు తీవ్ర పొగమంచు సమస్య ఉండటంతో ఆ కాలంలో అక్కడ అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించొద్దని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఎంపీ శశి థరూర్ బీసీసీఐని కోరారు. ఆ సీజన్‌లో మ్యాచ్‌లు పెడితే అభిమానులు తీవ్ర నిరాశకు గురవుతారని, ఇది క్రికెట్ ప్రేమికులను మోసం చేసినట్టేనని ఆయన వ్యాఖ్యానించారు.ఉత్తర్?ప్రదేశ్?లోని లఖ్?నవూలో బుధవారం జరగాల్సిన భారత్ - దక్షిణాఫ్రికా మధ్య నాలుగో టీ20 మ్యాచ్ తీవ్ర పొగమంచు కారణంగా టాస్ కూడా వేయకుండానే రద్దుకావడంపై థరూర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎకానా స్టేడియాన్ని దట్టమైన పొగమంచు కమ్మేయడంతో ఆట కొనసాగించడం అసాధ్యమైంది. దీనితో ఉత్తర భారతంలో శీతాకాలంలో మ్యాచ్‌ల షెడ్యూలింగ్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.పార్లమెంట్ హౌస్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడిన శశి థరూర్ మాట్లాడుతూ, "డిసెంబర్ మధ్య నుంచి జనవరి మధ్య వరకు ఉత్తర భారతంలోని చాలా ప్రాంతాల్లో పొగమంచు సాధారణమే. ఆ సమయంలో బంతి కూడా కనిపించని పరిస్థితి ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో క్రికెట్ మ్యాచ్‌లు ఎలా నిర్వహిస్తారు?" అని ఆయన ప్రశ్నించారు. "నిన్న దేశం మొత్తం నిరాశకు గురైంది. భారత్ - దక్షిణాఫ్రికా మ్యాచ్ చూడాలని ఎదురు చూసిన అభిమానులు తీవ్రంగా బాధపడ్డారు. కాబట్టి నా వాదన ఒక్కటే. ఈ కాలంలో మ్యాచ్‌లను దక్షిణ భారతంలో నిర్వహించాలి" అని థరూర్ సూచించారు. "నా నియోజకవర్గమైన తిరువనంతపురంలో అద్భుతమైన స్టేడియం ఉంది. మేమంతా సిద్ధంగా ఉన్నాం. ఇక్కడ వాతావరణ పరిస్థితులు చాలా అనుకూలంగా ఉంటాయి. ఇక్కడికి వచ్చి మ్యాచ్‌లు ఆడండి" అని ఆయన అన్నారు. డిసెంబర్ చివర్లో మహిళల క్రికెట్ జట్టు తిరువనంతపురంలో ఆడబోతోందని గుర్తుచేసిన థరూర్, షెడ్యూలింగ్ చేస్తూ వాతావరణ పరిస్థితులను బీసీసీఐ తప్పకుండా పరిగణలోకి తీసుకోవాలని సూచించారు."కేరళతో పాటు దక్షిణ భారతంలోని ఇతర ప్రాంతాల్లో ఈ తరహా పొగమంచు సమస్య ఉండదు. కాబట్టి డిసెంబర్ మధ్య నుంచి జనవరి మధ్య వరకు ఉత్తర భారతంలో మ్యాచ్‌లు వద్దు క్రికెట్ అభిమానులను మోసం చేయొద్దు" అని ఆయన స్పష్టం చేశారు. ఈ అంశంపై బుధవారం రాత్రి సోషల్ మీడియా వేదిక ఎక్స్?లో కూడా థరూర్ పోస్టు చేశారు. లఖ్?నవూలో ఏక్యూఐ 411గా ఉండగా, తిరువనంతపురంలో కేవలం 68 మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. "పొగమంచు కారణంగా మ్యాచ్ ప్రారంభించలేకపోయారు. ముందే తిరువనంతపురంలో షెడ్యూల్ చేసి ఉంటే సమస్యే ఉండేది కాదు" అని ఆయన విమర్శించారు. ఇదిలా ఉండగా, పార్లమెంట్‌లో శశి థరూర్‌తో పాటు బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా మధ్య ఈ అంశంపై ఆసక్తికర చర్చ జరిగింది. డిసెంబర్ 15 నుంచి జనవరి 15 మధ్య మ్యాచ్‌ల షెడ్యూలింగ్‌పై మరింత జాగ్రత్త అవసరమని శుక్లా అంగీకరించారు. "ఈ కాలంలో తరచూ వాతావరణ సమస్యలు ఎదురవుతున్నాయి. కాబట్టి షెడ్యూలింగ్‌లో ఎక్కువ శ్రద్ధ పెట్టాలి" అని ఆయన తెలిపారు.దీనికి స్పందించిన థరూర్, జనవరిలో జరిగే మ్యాచ్‌లను కేరళకు మార్చాలని సూచించారు. అయితే ఇది కేవలం కేరళకే సంబంధించిన అంశం కాదని శుక్లా స్పష్టం చేశారు. "బీసీసీఐ రొటేషన్ పాలసీ ప్రకారం కేరళకు ఇప్పటికే మ్యాచ్‌లు వస్తున్నాయి" అని ఆయన చెప్పారు. థరూర్ మళ్లీ తన వాదనను కొనసాగించగా, అయితే అన్ని మ్యాచ్‌లను కేరళకే మార్చేస్తామంటూ శుక్లా సరదాగా వ్యాఖ్యానించారు.



నేటి సాక్షి
కరీంనగర్
శుక్రవారం 19 డిసెంబర్ 2025




# హద్దుమీరిన అభిమానం

## నిధి అగర్వాల్‌కు చేదు అనుభవం

కొన్నిసార్లు అభిమానం హద్దులు దాటితే అది అభిమానంగా కాకుండా వేధింపుగా మారుతుంది. ముఖ్యంగా హీరోయిన్ల విషయంలో కొంతమంది అభిమానుల ప్రవర్తనపై ఇప్పటికే తీవ్ర విమర్శలు వస్తున్నాయి. తాజాగా ప్రభాస్ నటిస్తున్న 'రాజాసాబ్' హీరోయిన్ నిధి అగర్వాల్‌కు ఇలాంటి షాకింగ్ అనుభవమే ఎదురైంది. ఆమెను చుట్టుముట్టిన అభిమానులు తోసేసుకుంటూ హీరోయిన్‌పైకి ఎగబడిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రభాస్ హీరోగా నటిస్తున్న హారర్ కామెడీ థ్రిల్లర్ 'రాజాసాబ్'లో ముగ్గురు హీరోయిన్లలో నిధి అగర్వాల్ ఒకరు. ఈ చిత్రంలోని 'సహన సహన' పాటను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని లూలూ మాల్‌లో సాంగ్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు నిధి అగర్వాల్‌తో పాటు మరో హీరోయిన్ రిధి కుమార్ కూడా హాజరయ్యారు. సాంగ్ లాంచ్ కార్యక్రమానికి భారీగా అభిమానులు తరలివచ్చారు. ఈవెంట్ జరుగుతున్నంతసేపూ స్టేజ్ ముందు గుమిగూడిన అభిమానులు తోసుకుంటూనే కనిపించారు. అయితే ఈవెంట్ ముగిసిన తర్వాత పరిస్థితి మరింత దారుణంగా మారింది. నిధి అగర్వాల్ బయటకు వెళ్లే సమయంలో ఒక్కసారిగా అభిమానులు ఆమెపైకి ఎగబడారు. తోసుకుంటూ ముందుకు రావడం, చేతులు వేయడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. సెక్యూరిటీ సిబ్బంది తీవ్రంగా శ్రమించడంతో చివరికి నిధి అగర్వాల్ కారులోకి ఎక్కగలిగింది. కారులో కూర్చోగానే ఆమె 'ఓ మై గాడ్' అంటూ షాక్‌కు గురైన దృశ్యాలు వీడియోల్లో కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా, ప్రభాస్ నటిస్తున్న 'రాజాసాబ్' సినిమా 2026 సంక్రాంతికి విడుదల కానుంది. జనవరి 9న థియేటర్లలో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.

# రవితేజ మూవీకి చిరు వాయిస్ ఓవర్



మాస్ మహారాజా రవితేజ హీరోగా ఇటీవల చాలా చిత్రాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. అందులో ఏ చిత్రం కూడా పెద్దగా ప్రేక్షకులని అలరించలేకపోయింది. ఇప్పుడు ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన దర్శకుడు కిశోర్ తిరుమల దర్శకత్వంలో చేస్తున్న తాజా చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఇప్పటికే ఈ సినిమా అనౌన్స్‌మెంట్ నుంచే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేపుతోంది. ఈ చిత్రంలో రవితేజ సరసన ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటిస్తుండగా, ఫుల్ లెంగ్త్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు బలమైన ఎమోషన్ కూడా ఉంటుందని టాక్ వినిపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాలో రవితేజ పాత్రను ప్రత్యేకంగా పరిచయం చేస్తూ మెగాస్టార్ చిరంజీవి తన స్వరంతో వాయిస్ ఓవర్ ఇవ్వబోతున్నారని తెలుస్తోంది. సినిమాలో కీలకమైన సందర్భాల్లో రవితేజ పాత్ర గురించి వచ్చే వాయిస్ ఓవర్‌ను చిరంజీవి చెప్పనున్నారని, ఇది కథకు మరింత వెయిట్ పెంచడమే కాకుండా సినిమాపై బలమైన ముద్ర వేయబోతుందని ఫిల్మ్ నగర్ వర్గాలు చెబుతున్నాయి. చిరంజీవి వాయిస్ ఓవర్ ఉండటం వల్లే సినిమాపై అంచనాలు మరో స్థాయికి చేరుకున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు ఈ చిత్రానికి సంబంధించిన డిజిటల్, శాటిలైట్ హక్కుల డీల్స్ కూడా భారీ ధరకు పూర్తయ్యాయి. ప్రముఖ జీ గ్రూప్ ఈ సినిమా హక్కులను భారీ మొత్తానికి సొంతం చేసుకున్నట్లు సమాచారం. థియేట్రికల్ రిలీజ్ తర్వాత జీ5 ఓటీటీ ఎ÷-లాట్‌ఫామ్‌లో ఈ సినిమా స్ట్రీమింగ్‌కు రానుండగా, శాటిలైట్ ప్రసారాన్ని జీ తెలుగు మరియు జీ సినిమా ఛానల్స్ నిర్వహించనున్నాయి. జీ స్టూడియోస్ సమర్పణలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే భీమ్స్ మ్యూజిక్‌పై ఉన్న క్రేజ్‌కు తోడు రవితేజ ఎనర్జీ, కిశోర్ తిరుమల కథనం కలిసి ఈ సినిమాను హిట్ ట్రాక్‌లో నిలబెడతాయనే నమ్మకం వ్యక్తమవుతోంది. ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు మాస్ ప్రేక్షకులను కూడా ఆకట్టుకునే అంశాలతో 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సిద్ధమవుతోందని, రిలీజ్ దగ్గరపడే కొద్దీ ఈ సినిమాపై అంచనాలు మరింత పెరుగుతున్నాయని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.





# దారుణంగా ట్రీట్ చేశారు.. డబ్బులివ్వలేదు..

సినీరంగంలో నటీనటులుగా గుర్తింపు తెచ్చుకున్న తారలు.. కెరీర్ మొదట్లో ఎన్నో అవమానాలు భరించినవారే. ఇప్పుడు ఓ హీరోయిన్ సైతం తన మొదటి సినిమా రోజులను గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో తమతో ఎంతో దారుణంగా ప్రవర్తించారని.. అందుకే ఆ సినిమాను తాను మర్చిపోవాలనుకుంటున్నట్లు తెలిపారు. సినీరంగంలో తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్న బాలీవుడ్ హీరోయిన్ రాధిక ఆప్టే. దాదాపు రెండు దశాబ్దాలుగా సినీరంగంలో రాణిస్తుంది. 2005లో వాహ్ లైఫ్ ఓతో ఐసీ సినిమాతో నటిగా తెరంగేట్రం చేసింది. ఆ తర్వాత తెలుగు, హిందీ భాషలలో ఎన్నో సినిమాల్లో నటించింది. తాజాగా తన తొలి చిత్రం రోజులను గుర్తుచేసుకుంది. తన మొదటి సినిమా నిర్మాతలు తనకు డబ్బులు ఇవ్వలేదని అన్నారు. తన తల్లితో కలిసి ఒప్పందంపై సంతకం చేయమని అడిగినప్పుడు.. ఊర్మిళ మటోండ్కర్ వంటి స్టార్ హీరోయిన్ కూడా ఒప్పందంపై సైన్ చేయలేదని అన్నారని.., ఆమె సంతకం చేసిందో లేదో నాకు తెలియదు, కానీ వారు మాతో భయంకరంగా ప్రవర్తించారని అన్నారు. మహేష్ మంజ్రేకర్ గొప్ప వ్యక్తి. అందుకే నా సినిమాను మర్చిపోవడానికి ఇష్టపడతాను. ఆ టీంలో ఉన్న ఆయన నన్ను పిలిచి ఛాన్స్ ఇస్తానని అన్నారు అని గుర్తుచేసుకుంది. మొదటి సినిమాలో నేను బ్రెయిన్ సర్జన్ అనే నాటకం వేస్తున్నాను. అది మంచి నాటకం. మేము రాష్ట్ర పోటీలో అవార్డు గెలుచుకున్నాము. మహేష్ మంజ్రేకర్ న్యాయనిర్ణేతలలో ఒకరు. నాటకం ముగిసిన తర్వాత ఆయన నాకు ఫోన్ చేసి ఛాన్స్ ఇస్తానని అన్నారు అంటూ చెప్పుకొచ్చింది.



# అల్లు అర్జున్ సిస్టర్‌గా మృణాల్ ఠాకూర్?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కబోయే భారీ చిత్రంపై బన్నీ ఫ్యాన్స్‌తో పాటు సినీ ఇండస్ట్రీలోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్ వచ్చినప్పటి నుంచే అధికారిక అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మరో క్రేజీ టాక్ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఈ మూవీలో బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ కీలక పాత్రలో కనిపించనున్నట్టు ఇప్పటికే వార్తలు వచ్చాయి. అయితే తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, మృణాల్ ఠాకూర్ ఈ సినిమాలో అల్లు అర్జున్‌కు సిస్టర్ రోల్‌లో నటించబోతున్నారట. ఈ పాత్ర కథలో చాలా కీలకమైనదిగా, బలమైన ఎమోషనల్ టోన్‌తో సాగుతుందని టాక్. అన్న-చె÷-లలెల మధ్య బంధం, భావోద్వేగాలను అట్లీ తన మార్క్ స్టైల్‌లో చూపించబోతున్నాడని, ఈ పాత్ర ప్రేక్షకులను బాగా కనెక్ట్ చేస్తుందని అంటున్నారు. అయితే ఇది అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. నిజంగా మృణాల్ సిస్టర్ రోల్‌లో కనిపిస్తారా? లేక మరో షేడ్స్ ఉన్న క్యారెక్టర్‌లో వస్తారా? అన్నది వేచి చూడాల్సిందే.ఇక ఈ సినిమాకు సంబంధించిన మరో హైలైట్ ఏమిటంటే.. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పడుకోణె ఇందులో మెయిన్ హీరోయిన్‌గా నటించనుండగా, జాన్వీ కపూర్ మరో కీలక హీరోయిన్ పాత్రలో కనిపించనుంది. ఒకే సినిమాలో ఇంతమంది స్టార్ హీరోయిన్లు ఉండటం వల్ల ఈ ప్రాజెక్ట్‌పై మరింత క్రేజ్ పెరుగుతోంది.కథ విషయానికి వస్తే.. మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో ఓ డాన్ చుట్టూ తిరిగే పవర్‌ఫుల్ కథను అట్లీ సిద్ధం చేశాడట. యాక్షన్, ఎమోషన్, డ్రామా అన్నీ సమపాళ్లలో ఉండేలా స్క్రిప్ట్‌ను రూపొందించినట్టు సమాచారం. అల్లు అర్జున్‌ను ఇప్పటివరకు ఎప్పుడూ చూడని విధంగా, ఒక కొత్త షేడ్స్ ఉన్న పాత్రలో చూపించేందుకు అట్లీ ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్టు తెలుస్తోంది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను సన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ప్రొడక్షన్ వ్యాల్యూస్ విషయంలో ఏ మాత్రం రాజీ పడకుండా, హాలీవుడ్ రేంజ్‌లో సినిమాను తెరకెక్కించేందుకు ఎ÷-లాన్ చేస్తున్నారట. అంతేకాదు, ఈ సినిమాలో కొన్ని ప్రత్యేక గెస్ట్ రోల్స్ కూడా ఉండబోతున్నాయని టాక్. వాటి కోసం అట్లీ పలువురు స్టార్ నటులను సంప్రదించనున్నారని సమాచారం. ఆ గెస్ట్ రోల్స్‌లో ఎవరు కనిపిస్తారన్నది మరో ఆసక్తికర అంశంగా మారింది.



Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 966605221**

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
శుక్రవారం
19 డిసెంబర్ 2025


# బి.కొత్తకోట నూతన ఎంపీపీగా రాధమ్మ ఏకగ్రీవ ఎన్నిక

- **ఎంపీ మిథున్ రెడ్డి, శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి లకు ప్రత్యేక కృతజ్ఞతలు..**
- **మండలంలోని ప్రధాన రంగాలైన వ్యవసాయం, ఇరిగేషన్, మహిళా సాధికారత కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి..**



**నేటి సాక్షి, అన్నమయ్య జిల్లా, శర్మ, డిసెంబర్ 18 :** అన్నమయ్య జిల్లా -:- స్థానిక నియోజకవర్గ పరిధిలోని బి.కొత్తకోట మండల కేంద్రమైన స్థానిక ఎంపీపీగా గురువారం రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, నియోజకవర్గ శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి ఆదేశాల మేరకు 11 మంది ఎంపీటీసీల సమన్వయంతో ఏకగ్రీవంగా ఎన్నికై రాధప్రదీప్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈమె పేరును ప్రతిపాదించిన బి. కొత్తకోట మాజీ ఎంపీపీ పాగొండ ఖలీల్ అహ్మద్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, తంబళ్లపల్లి శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి లకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని వాళ్ల ఆదరణతోనే ఎంపీపీ పదవి వరించిందని వీరి సహకారంతో ఎంపీటీసీల సమన్వయంలో బి. కొత్తకోట మండలాన్ని మరింత అభివృద్ధి బాటలో నడుపుతానని నూతన ఎంపీపీ రాధప్రదీప్ రెడ్డి తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలిగా రాధప్రదీప్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ఆమె మాట్లాడుతూ ఎంపీ, ఎమ్మెల్యే సహకారంతో మండలంలోని ప్రధాన రంగాలైన వ్యవసాయం, ఇరిగేషన్, మహిళా సాధికారత కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెడతానని నా దృష్టికి ఏ సమస్య వచ్చినా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది వచ్చిన ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకానాథ్ రెడ్డి ల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కారం చేస్తానని మాజీ ఎంపీపీ ఖలీల్ అహ్మద్ సమన్వయంలో అధికారులతో మాట్లాడి ప్రజల సమస్యలను తీరుస్తానని రాధప్రదీప్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై పలువురు బి.కొత్తకోట వైసీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఎంపీపీ కార్యాలయానికి విచ్చేసిన పలువురు వైసీపీ శ్రేణులు జడ్పీటీసీ రామచంద్ర యాదవ్, బీసీ సెల్ అధ్యక్షుడు సాంబశివ, కో ఆప్షన్ సభ్యులు నాసీర్, పార్టీ ప్రచార విభాగం అధ్యక్షుడు షేక్ అయూబ్ భాష, సర్పంచులు రవి కుమార్ రెడ్డి, లక్ష్మీనారాయణ, జయ రెడ్డి, బూత్ కమిటీ అధ్యక్షుడు రెడ్డి హరి, యువ నాయకులు చిన్ని కృష్ణ, నక్క మహేష్, సబ్జి హరికృష్ణ, చాంద్ భాషా లు ఎంపీపీ రాధప్రదీప్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తూ దుశ్శాలువలు కప్పి పుష్పగుచ్ఛమందించి సన్మానించారు..

# కోటి సంతకాల ప్రతుల వాహనాల ప్రారంభం






- **కోటి సంతకాల ప్రతుల వాహనాలను వైయస్ జగన్ చేతుల మీదగా జెండా ఊపి ప్రారంభం..**
- **వందలాది వాహనాలు ముందుకు కదిలి..**

**నేటి సాక్షి, అన్నమయ్య జిల్లా, శర్మ, డిసెంబర్ 18 :** అన్నమయ్య జిల్లా -:- ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్ఆర్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ ఉద్యమానికి పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి అండగా నిలిచారు. తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద గురువారం కోటి సంతకాల ప్రతులతో కూడిన వాహనాలను వైయస్ జగన్ మోహన్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించి లోక్ భవన్‌కు పంపించారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి, అంబటి రాంబాబు, విడుదల రజిని హైలెట్ గా నిలిచారు. అన్ని జిల్లాల నుంచి తాడేపల్లికి చేరుకున్న కోటి సంతకాల సేకరణ ప్రతుల వాహనాలు ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులకు కలిగే నష్టాన్ని ప్రజలకు వివరించేందుకు ఈ ఉద్యమాన్ని చేపట్టినట్లు పార్టీ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు, కీలక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ వాహనాలు ర్యాలీగా విజయవాడలోని లోక్ భవన్‌కు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు వైసీపీ నేతలు మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా భారీ ఉద్యమం హోరుగా కొనసాగింది. ఈ ఉద్యమంలో భాగంగా వైయస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపుతో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఘన విజయం సాధించింది. కేవలం రెండు నెలల వ్యవధిలోనే కోటి 4 లక్షల 11 వేల 136 మంది ప్రజలు తమ సంతకాలు చేసి, ప్రభుత్వ నిర్ణయంపై తమ వ్యతిరేకతను స్పష్టంగా వ్యక్తం చేశారని వెల్లడించారు. రాష్ట్ర మాజీ మంత్రి, పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ ఉద్యమానికి రాష్ట్రవ్యాప్తంగా విశేష స్పందన లభించిందన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంత గ్రామమైన నారావారిపల్లెలో వున్న ప్రజలు పెద్ద సంఖ్యలో సంతకాలు చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. ఇది ప్రభుత్వ నిర్ణయంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని స్పష్టంగా చూపిస్తోందని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యాఖ్యానించారు. గురువారం సాయంత్రం వైయస్ జగన్ కీలక నేతలతో కలిసి లోక్ భవన్‌కు వెళ్లి, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా గళాన్ని గవర్నర్ నజీర్ అహ్మద్ కు విన్నవించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఆపాలని దీనిపై మీరు ప్రత్యేక శ్రద్ధ వహించాలని గవర్నర్ ను వైయస్ జగన్ కోరారు..

# అంతర్జాతీయ ప్లేస్‌మెంట్ సాధించిన అపోలో యూనివర్సిటీ విద్యార్థులు

- **ఇరాక్ బాగ్దాద్‌లో తెలుగు విద్యార్థులకు ప్రతిష్టాత్మక ఉద్యోగాలు**



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** చిత్తూరు, డిసెంబర్ 18: అంతర్జాతీయ ఉపాధి రంగంలో ది అపోలో యూనివర్సిటీ మరో ఘనత నమోదు చేసింది. యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌కు చెందిన డివిజన్ ఆఫ్ అలైడ్ హెల్త్ సైన్సెస్‌లోని బీఎస్సీ ఇమేజింగ్ టెక్నాలజీ విద్యార్థులు ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లో అపోలో హాస్పిటల్స్ నిర్వహణలోని ఇంటర్నల్ సెక్యూరిటీ ఫోర్సెస్ హాస్పిటల్‌లో రేడియాలజీ టెక్నీషియన్లుగా అంతర్జాతీయ ఉద్యోగాలు సాధించారు. ఈ ప్లేస్‌మెంట్‌లో గుంటూరుకు చెందిన అరుణ్‌కుమార్ సురవరపు, శ్రీకాకుళం జిల్లాకు చెందిన సయ్యద్ ఇమామ్ ఖాజా ఎంపిక కయ్యారు. అత్యున్నత వేతన ప్యాకేజీతో పాటు వసతి, భోజనం, విమాన టికెట్లు, వీసా ప్రక్రియ వంటి అదనపు సదు-పాయాలను కూడా వారు ఉచితంగా పొందనున్నట్లు యూనివర్సిటీ ప్లేస్‌మెంట్ అధికారులు తెలిపారు. అపోలో యూనివర్సిటీ నుంచి విద్యార్థులు విదేశీ ఆసుపత్రుల్లో ఉద్యోగాలు పొందడం యూనివర్సిటీ అకడమిక్ నాణ్యతకు నిదర్శనంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విదేశాల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా. హెచ్. వినోద్ భట్ అభినందించారు. ఈ విజయం ద్వారా యూనివర్సిటీలో అమలవుతున్న బలమైన అకడమిక్ పునాది, ఆధునిక క్లినికల్ శిక్షణ, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణమైన విద్యా విధానం స్పష్టమవుతోందని ఆయన పేర్కొన్నారు. గ్లోబల్ హెల్త్‌కేర్ అవసరాలకు తగిన నైపుణ్యాలను విద్యార్థుల్లో పెంపొందించడంలో అపోలో యూనివర్సిటీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ డీన్ ప్రొ. కె. భాస్కర్‌రెడ్డి, ఇతర ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొని ఎంపికైన విద్యార్థులను అభినందించారు. అంతర్జాతీయ కెరీర్ అవకాశాలను అందించిన అపోలో హాస్పిటల్స్‌కు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

## రేపు అపోలోలో జాతీయ సదస్సు

చిత్తూరులోని ది అపోలో యూనివర్సిటీ, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం "హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్"పై ఒకరోజు జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు దక్షిణాది నాలుగు రాష్ట్రాల నుంచి 150 మందికిపైగా ప్రతినిధులు హాజరుకానున్నారు. సదస్సుకు ముఖ్య అతిథిగా కడప యోగి వేమన యూనివర్సిటీ వైస్-ఛాన్సలర్ ప్రొ. రాజశేఖర్ బెల్లమకొండ పాల్గొననున్నారు అపోలో యూనివర్సిటీ వైస్-ఛాన్సలర్ డా. హెచ్. వినోద్ భట్, రిజిస్ట్రార్ ప్రొ. ఎం. పోతరాజు ఈ కార్యక్రమానికి ప్రధాన మార్గదర్శకులుగా వ్యవహరించనున్నారు. అతిథులుగా అపోలో నాలెడ్జ్ సిటీ సీఈఓ శివరామకృష్ణన్ వెంకటేశ్వరన్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డీన్ ప్రొ. జి.వి.ఆర్.కె. ఆచార్యులు పాల్గొంటారు. ఈ సదస్సుకు స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డీన్ డా. రామయ్య ఇటుమల్ల కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్‌లో వస్తున్న ఆధునిక మార్పులు, సవాళ్లు, అవకాశాలపై ఈ సదస్సులో విస్తృతంగా చర్చించనున్నారు. పలువురు నిపుణులు హెల్త్‌కేర్ రంగంపై ప్రెజెంటేషన్లు ఇవ్వనున్నారు.

# ఆర్థిక సహాయం

**బోనపల్లె ఫ్రాన్సిస్ కుటుంబానికి సింగపూర్ టేకూరి.నాగేశ్వరరావు తరపున 5 వేలు ఆర్థిక సహాయం అందించిన మాజీ సర్పంచ్ టీ.రామసుబ్బమ్మ, సతీమణి టీ . రేణుక**



**నేటి సాక్షి 18 పాములపాడు :** పాములపాడు మండలంలోని, వేంపెంట గ్రామంలో ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకున్న తెలుగుదేశం పార్టీ కార్యకర్త బోనపల్లె ఫ్రాన్సిస్ ని మాజీ సర్పంచ్ టేకూరి. రామసుబ్బమ్మ, సింగపూర్ టేకూరి.నాగేశ్వరావు సతీమణి టేకూరి.రేణుక లు పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని మీకు అన్ని విధాలుగా తోడుగా ఉంటామని హామీ అన్నారు. అనంతరం ఆయన కుటుంబానికి సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు డాక్టర్. నాగేశ్వరావు తరపున మాజీ సర్పంచ్ టేకూరి.రామసుబ్బమ్మ, ఆయన సతీమణి టేకూరి.రేణుక, కుమారులు కుందన్, యువ లు పండ్లు ఇచ్చి, 5000/- రూపాయల ఆర్థిక సహాయం అందించి, భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వేంపెంట గ్రామ మాజీ ఉప సర్పంచ్ బోనపల్లె సత్యరాజు, మాజీ ఎంపీటీసీ శివకుమార్, బూత్ కన్వీనర్ బోనపల్లె వినయ్ కుమార్,సుబ్బారావు,సురేష్,దార జీవన్న,చిట్టి బాబు తదితరులు పాల్గొన్నారు.

# మరికల్ మండల తాసిల్దార్ కు వినతి

**సిపిఐ నారాయణపేట జిల్లా కార్యవర్గ సభ్యులు పి వెంకటేష్.....**



**నేటి సాక్షి,నారాయణపేట, డిసెంబర్ 18 :** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలో ఉన్న బంగారు దుకాణాలను పరిశీ లించాలని నారాయణపేట జిల్లా సిపిఐ పార్టీ కార్యవర్గ సభ్యులు పి. వెంకటేష్ ఆధ్వర్యంలో మరికల్ మండల తాసిల్దార్ కు వినతి పత్రాన్ని గురువారం నాడు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ మరికల్ లో ఇతర రాష్ట్రాల నుండి వచ్చి దుకాణాలను కొనసాగిస్తున్నారని ఆయన వివరించారు. ఇట్టి దుకాణాలకు ప్రభుత్వ లైసెన్సులను ఉన్నాయా లేవా అనే పరిశీలించాలని ఆయన కోరారు. బంగారు దుకాణాల వద్ద మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలన్నారు. రోజు వారి ధరల పట్టికను ఏర్పాటు చేయాలన్నారు. మరికల్ లో బంగారు దుకాణాలకు లైసెన్స్ లేని వారి పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆయన తాసిల్దార్ని కోరారు.

# రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం




**నేటి సాక్షి - జగిత్యాల టౌన్(పూరెళ్ల బాపు) :** ఈరోజు ఉదయం 10:30 గంటలకు పెన్షనర్స్ భవన్ నందు జిల్లా అధ్యక్షులు A..నరేందర్ రావు అధ్యక్షతన ఏర్పాటు చేయడమైనది. A.నరేందర్ రావు,కార్యదర్శి ఎన్నం రాంరెడ్డి మాట్లాడుతూ 2024 ఏప్రిల్ నుండి రిటైర్డ్ అయిన ఉద్యోగుల యొక్క రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వనందున చాలామంది మానసిక ఒత్తిడికి లోనై అసులువాసినారు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించిన స్పందించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో తేదీ: 24 -12- 2025 రోజున నిరాహార దీక్షలు చేపట్టాలని రాష్ట్ర కమిటీ తీసుకున్న నిర్ణయానికి ఈరోజు సన్నాహక సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఇట్టి సమావేశానికి రిటైర్డ్ బకాయిలు రానటువంటి ఉద్యోగులతో పాటు సర్వీస్ ఉద్యోగులు,పెన్షనర్స్ ఎక్కువ సంఖ్యలో హాజరై ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని నిర్ణయించడం జరిగింది. కావున ఇట్టి నిరాహార దీక్షకు ఎక్కువ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని కోరనైనది. ఇట్టి కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నం రాంరెడ్డి, కోశాధికారి .లక్ష్మినారాయణ, కమిటీ సభ్యులు .దుబ్బయ్య, .రాజేశం,. చంద్రమౌళి,. శంకరయ్య,. సదానందచారి, .గంగరాజ .నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..


## నా పార్టీ వాళ్లే నాకు మోసగించారు....

**మంది పల్లి వార్డు సభ్యులు చింతలి వెంకటయ్య....**



**నేటి సాక్షి, నారాయణపేట, డిసెంబర్18 :** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల పరిధిలోని మంది పల్లి గ్రామంలో ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో మూడవ వార్డు సభ్యులుగా చింతలి వెంకటయ్య గెలుపొందడం జరిగింది. గురువారం విలేకరితో బిఆర్ఎస్ పార్టీ నాయకులు వెంకటయ్య మాట్లాడుతూ మంది పల్లి గ్రామ ఉప సర్పంచ్ పదవి నాకు ఇస్తామని మా పార్టీ నాయకులు మాకు చెప్పి చివరకు ఇతరులకు ఉప సర్పంచ్ పదవిని కట్టబెట్టడం జరిగిందని ఆయన వివరించారు. పార్టీలో 20 సంవత్సరాలుగా పని చేసిన తనకు గుర్తింపు ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం స్థానిక ఎన్నికల్లో నాకు అవకాశం వచ్చిన మా పార్టీ నాయకులు నాకు ఇవ్వలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## హనుమన్ పల్లి గ్రామ ప్రజలకు రెడ్డి సేవ సమితి తరపున ధన్యవాదాలు

**రెడ్డి సేవా సమితి ఉపాధ్యక్షులు దామరగిద్ద అనంతరెడ్డి....**



**నేటి సాక్షి, నారాయణపేట, డిసెంబర్ 18 :** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల పరిధిలోని హనుమాన్ పల్లి గ్రామ సర్పంచ్ గా తిరుపతిరెడ్డిని గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఎన్నిక పట్ల హనుమాన్ పల్లి గ్రామ ప్రజలకు రెడ్డి సేవా సమితి సంఘం తరపున రెడ్డి సేవా సంఘం ఉపాధ్యక్షులు , కాంగ్రెస్ పార్టీ నాయకులు దామరగిద్ద అనంతరెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎంపిటిసి సాయిలు, రాశోద్దిన్, కొండారెడ్డి సుధాకర్ రెడ్డి కాలప్ప తదితరులు పాల్గొన్నారు.

## రెండవ రోజు పెరుమాళ్ళపల్లి గ్రామంలో ఎన్ఎస్ఎస్ క్యాంప్

**డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో**



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** వెదురుకుప్పం డాక్టర్ వైయస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ తరపున స్పెషల్ క్యాంప్ రెండవ రోజు క్యాంపును వెదురుకుప్పం మండలంలోని పెరుమాళ్ళపల్లి గ్రామంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సి.మంగళ గౌరీ,గ్రామ సర్పంచ్ బి.శశి ఆనంద రెడ్డి గారు ప్రారంభించారు. కార్యక్రమంలో రెండవ రోజు 47 మంది ఎన్ఎస్-ఎస్ వాలంటీర్స్ మరియు నలుగురు కమిటీ మెంబర్స్ ఆధ్వర్యంలో చెట్ల పెంపకం,వన సమృద్ధి కార్యక్రమాన్ని విడతల వారిగా గ్రామం పలు మూలల నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో పళ్ళ మొక్కలు పూల మొక్కలను గ్రామంలోని పూర్తి పరిరక్షణ కావించే నివాసితుల ఇళ్లలో, పాఠశాలలో, గ్రామ సచివాలయం ప్రాంగణంలో, మరియు అంగన్వాడి పరిసర ప్రాంతంలో నాటడం జరిగింది. అదేవిధంగా ఇదివరకే ఉన్నటువంటి మొక్కలకు పాదులు తీయడం మరియు మొక్కలు చుట్టూ కలుపు తీయడం చేపట్టడం జరిగింది. కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ కమిటీ మెంబర్లు డాక్టర్ డి.లావణ్య కుమారి, డాక్టర్ వి.నాగేశ్వరరావు, మరియు వై.శ్రీనివాసులు ఆధ్వర్యంలో దిగ్విజయంగా పూర్తి చేయడం జరిగింది. ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవ నిరతికి పెరుమాళ్ళపల్లి ప్రజలు హర్షం వ్యక్తపరిచారు.

## జగనన్న కు నారాయణస్వామి నమ్మిన బంటు

**ు జీడి నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మినే..**

**ు వైస్ ఎంపిపి జెగిని విజయమునిక్రిష్ణ రెడ్డి స్పష్టం**



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) వెదురుకుప్పం :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కుటుంబానికి మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి నమ్మిన బంటు అని ఇప్పటికీ ఎప్పటికీ జీడి నెల్లూరు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెసు పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నారాయణస్వామి కుటుంబానికి తప్ప వేరే వాళ్ళకు ఛాన్స్ లేదని వెదురు కుప్పం మండలం వైస్ ఎంపిపి జెగిని విజయ మునిక్రిష్ణ రెడ్డి స్పష్టం చేశారు.గురువారం మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి పై తప్పుడు ప్రచారం పై జెగిని విజయమునిక్రిష్ణ స్పందించి విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో ఎవ్వరూ ఎన్ని కుల్లు కుతంత్రాలు చేసినా..దేవుడు దయతో వైయస్సార్ కాంగ్రెసు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్రెడ్డి ఆశీస్సులతో ఎప్పటికీ నారాయణస్వామి కుటుంబమే ఎన్నికల బరిలో ఉండడం ఖాయమని చెప్పారు.2029 సంవత్సరం లో జీడి నెల్లూరు నియోజకవర్గం నుండి వైఎస్ఆర్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కృపా లక్ష్మి పోటీ చేసి భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని జోస్యం చెప్పారు.

# ప్రైవేటు వాళ్లకు ఇవ్వడమే పెద్ద స్కామ్..

- జీతాలను ప్రభుత్వమే ఇస్తామని చెప్పడం అంతకంటే పెద్ద మోసం..
- 60 రోజులు గా చేసిన ఈ ఉద్యమం చరిత్రలో నిలిచిపోయే అతి గొప్ప ఘట్టం.. వైయస్ జగన్



**నేటి సాక్షి, అన్నమయ్య జిల్లా, శర్మ, డిసెంబర్ 18 :**అన్నమయ్య జిల్లా -:- వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయడంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే కాలేజీలను తీసుకున్న వారిని జైలుకు పంపుతామని సంచలన కామెంట్లు చేశారు. ప్రైవేటుకు ఇవ్వడమే పెద్ద స్కామ్ అయితే జీతాలు కూడా ప్రభుత్వమే ఇస్తామని చెప్పడం అంతకంటే పెద్ద మోసమని ఆయన ఆరోపించారు. పార్టీ ముఖ్య నేతల సమావేశంలో వైఎస్ జగన్ మాట్లాడుతూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం, గవర్నర్‌ను కలిసే అంశాలపై చర్చించిన వైఎస్ జగన్ మనం 60 రోజులు గా చేసిన ఈ ఉద్యమం చరిత్రలో నిలిచిపోయే గొప్ప ఘట్టమని అన్నారు. కోటి నాలుగు లక్షల 11 వేల 336 మంది ప్రజలు సంతకాలు చేసి తమ తీర్పు ఇచ్చారని వెల్లడించారు. చంద్రబాబు నాయుడు గ్రాఫ్ ప్రజల్లో పడిపోయిందని, అది ఆయనే ఒప్పుకుంటున్నారని జగన్ వ్యాఖ్యానించారు. కలెక్టర్ల పని సరిగ్గా లేక ప్రభుత్వం గ్రాఫ్ పడిపోలేదని, చంద్రబాబు పనితీరు సరిగ్గా లేకనే ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిందని విమర్శించారు. ప్రభుత్వ నిర్ణయాల్లో అపార్థాలు, మోసాలు ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వాలు హాస్పిటల్స్, స్కూల్స్, బస్సులు నడపకపోతే ప్రజలు ప్రైవేటు దోపిడీకి గురవుతారని జగన్ హెచ్చరించారు. ప్రైవేటు దోపిడీకి అడ్డుకట్ట వేయాలంటే ప్రభుత్వాలే ఈ వ్యవస్థలను నడపాలని స్పష్టం చేశారు. చంద్రబాబు ఒక్కరే అన్నింటినీ ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలని చూస్తున్నారని విమర్శించారు. గత ఎన్నికల్లో తాము గెలిచి ఉండకపోతే ఆర్టీసీని కూడా అమ్మేసేవారని అన్నారు. ఆశ్చర్యకరంగా పోలీసు వ్యవస్థను కూడా ప్రైవేట్ చేయాలనే ఆలోచన చేస్తున్నారని, స్కూల్స్‌ను సైతం ప్రైవేట్ భాగస్వామ్యం పేరిట అప్పగించాలనుకుంటున్నారని జగన్ మండిపడ్డారు. అక్టోబర్ 7న ప్రారంభమైన ఈ ఉద్యమం దశలవారీగా ముందుకు సాగిందని, అక్టోబర్ 9న నర్సీపట్నంలోని మెడికల్ కాలేజీని తాను సందర్శించానని గుర్తు చేశారు. అక్టోబర్ 10 నుంచి డిసెంబర్ 10 వరకు కోటి సంతకాల కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా సంతకాలు పెట్టడమే కాకుండా ధైర్యంగా తమ ఫోన్ నంబర్లు కూడా ఇచ్చారని చెప్పారు. ఈ సంతకాల పత్రాలను గవర్నర్‌కు సమర్పిస్తామని, అనంతరం కోర్టుకు కూడా పంపుతామని జగన్ వెల్లడించారు. అవసరమైతే న్యాయస్థానంలో పిటిషన్ వేసి, ప్రజల సంతకాలనే ఆధారంగా చూపిస్తామని తెలిపారు. ప్రైవేటుకు ఇవ్వడమే పెద్ద స్కామ్ అని మరోసారి స్పష్టం చేసిన జగన్, చంద్రబాబు బుద్ధి మారకపోతే తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని నిర్ణయాలను వెనక్కి తీసుకుంటామని హెచ్చరించారు. అధికారం చేపట్టిన రెండు నెలల్లోనే కాలేజీలు తీసుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని జైలుకు పంపుతామని వైఎస్ జగన్ పేర్కొన్నారు..

# రాజీ మార్గమే... రాజ మార్గం - జిల్లా ఎస్పీ

- ఈ నెల 21వ తేదీ వరకు జరుగనున్న "జాతీయ లోక్ అదాలత్"ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోగలరు-జిల్లా ఎస్పీ నితిక పంత్ ఐ.పి.ఎస్



**నేటి సాక్షి.కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా :** వివాదాలు అనేవి పెంచుకోవాలనుకుంటే జీవితకాలం కొనసాగుతాయి, ఒకవేళ ఇంతటితో కలిసుంటామని ఒక నిర్ణయానికి వస్తే ఇప్పుడే అవి సమసిపోతాయని, రాజీమార్గమే రాజమార్గమని జిల్లా ఎస్పీ నితిక పంత్ ఐ.పి.ఎస్ గారు జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా జిల్లాలో వివిధ రకాల రాజీపడదగు కేసులలోని కక్షిదారులకు విజ్ఞప్తి చేస్తూ ఒక ప్రకటనను విడుదల చేసారు. ఉచిత న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 21 వ తేదీ వరకు ఆసిఫాబాద్, సిర్పూర్ (టీ) కోర్టులలో "జాతీయ లోక్ అదాలత్" సందర్భంగా కక్షిదారులకు అందుబాటులో ఉంటారని తెలిపారు. మీపై కేసులు ఉంటే వాటిని రాజీ చేసుకొని కోర్టుకు హాజరైనట్లయితే ఆ కేసులను పూర్తిగా క్లోజ్ చేయడం జరుగుతుందని అన్నారు. యాక్సిడెంట్ కేసులు, వ్యక్తుల పై దాడి చేసే కేసులు, చీటింగ్ కేసులు, వివాహ బంధానికి సంబంధించిన కేసులు, చిన్న చిన్న దొంగతనం కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు మరియు ఇతర రాజీ పడదగు కేసులలో ఈ నేషనల్ లోక్ అదాలత్ లో రాజీ చేసుకుని క్లోజ్ చేసుకోవచ్చని ఎస్పీ గారు అన్నారు. కాబట్టి ఈ అవకాశాన్ని కేసులలో ఉన్నటువంటి ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోగలరని కోరారు. దీనికోసం ఫిర్యాదు దారుడు మరియు నేరస్తులు అందరూ తమ యొక్క ఆధార్ కార్డు తీసుకుని సంబంధిత కోర్ట్/ప్రదేశంలో హాజరు కావాలని తెలిపారు. ఈ లోక్ అదాలత్ ను, వినియోగించుకోవాలనుకునేవారు సంబంధిత పోలీస్ స్టేషన్లలో లేదా కోర్ట్ కానిస్టేబుల్స్ ని సంప్రదించాలని అన్నారు. జాతీయ లోక్ అదాలత్ లో జిల్లా వ్యాప్తంగా బాధితులకు మంచి అవకాశం అని, ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ గారు తెలిపారు.

# కూటమి ప్రభుత్వ వైఖరి పై సొంత పార్టీ సభ్యులు తిరుగుబావుట!

- మా నియోజకవర్గానికి అరకొర పారిశుద్ధ పరికరాలు కేటాయిస్తున్నారని సమావేశం బాయ్ కాట్..
- ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే 130 మంది దాక ఓటమి చవిచూస్తారని ఓ సర్వేలో ప్రజా తీర్పు..
- జగన్ మోహన్ రెడ్డి ని మరోసారి కుర్చీలో కూర్చోబెట్టేందుకు ఏపీ ప్రజలు సిద్ధంగా ఉన్నారని వెల్లడి..



**నేటి సాక్షి, అన్నమయ్య జిల్లా, శర్మ, డిసెంబర్ 18 :** అన్నమయ్య జిల్లా -:- ఏపీలోకి చంద్రబాబు సర్కార్‌కు ఊహించని షాక్ తగిలింది. మరో తెలుగు దేశం పార్టీ ఎమ్మెల్యే తిరుగుబాటు ఎగురవేశాడు. చంద్రబాబు సర్కార్‌పై టీడీపీ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు అసహనం వ్యక్తం చేశారు. అధికారిక కార్యక్రమాన్ని బాయ్ కాట్ చేసిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు, చంద్రబాబు సర్కార్‌పై అసహనం వ్యక్తం చేశారు. కళ్యాణదుర్గానికి అరకొరగా పారిశుద్ధ్య పరికరాలు వచ్చాయని టీడీపీ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మనస్తాపం చెందారు. తన నియోజకవర్గంపై అధికారులు చిన్నచూపు చూస్తున్నారని కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగానే పంచాయతీలకు పారిశుద్ధ్య పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని టీడీపీ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు బహిష్కరించారు. దీంతో టీడీపీ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు తీరుపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఇది ఇలా ఉండగా ఇటీవల కాలంలో ఏపీలోని కూటమి ప్రభుత్వంపై ఓ సంస్థ సర్వే నిర్వహించింది. ఈ సర్వే ప్రకారం ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే కూటమి నుంచి కేవలం 31 మంది మాత్రమే విజయం సాధిస్తారని తేలింది. 130 మంది వరకు ఓడిపోవడం గ్యారంటీ అంటూ మంత్రులు బడా లీడర్లు అందరు ఓడిపోతారని ఈ సర్వే సంస్థ వెల్లడించింది. జగన్ మోహన్ రెడ్డి ని మరోసారి కుర్చీలో కూర్చోబెట్టేందుకు ఏపీ ప్రజలు సిద్ధంగా ఉన్నారని తేల్చింది.

# మున్సిపల్ కార్మికుల వేతనాలుచెల్లించాలి



**నేటి సాక్షి కొమరం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి డిసెంబర్ 18 :** కాగజ్ నగర్ పట్టణంలో మున్సిపల్ కార్మికుల జనరల్ బాడీ సమావేశము జరిగింది ఈ యొక్క సమావేశానికి సిఐటియు జిల్లా కార్యదర్శి రాజేందర్.హాజరై మాట్లాడుతూ కాగజ్నగర్ మున్సిపల్ లో పనిచేస్తున్న కార్మికుల గత నాలుగు నెలల నుండి పెండింగ్లో ఉన్న వేతనాలు చెల్లించాలని బకాయిలో ఉన్న pf esi కోటి 50 లక్షలు చెల్లించాలని జిల్లా కలెక్టర్ మరియు మున్సిపల్ కమిషనర్. వినతి పత్రాలు ఇచ్చిన పట్టించుకోని పరిస్థితి ఉంది కార్మికులకు గత నాలుగు నెలల నుండి వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందితో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు కాగజ్నగర్ మున్సిపల్ లో పనిచేసే కార్మికులు పనిచేసిన కాలానికి వేతనాలు చెల్లించాలని ఆందోళనలు చేసే తప్ప గాని వేతనాలు ఇవ్వలేని పరిస్థితి ఉన్నది ఇప్పటికే మున్సిపల్ కార్మికులకు ప్రతినెల క్రమ తప్పకుండా వేతనాలు చెల్లించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన అధికారుల తీరు మారిన పరిస్థితి లేదు కావున ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ మరియు కాగజ్నగర్ మున్సిపల్ కమిషనర్ .జోక్యం చేసుకొని కార్మికుల పెండింగ్లో ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించేలా కృషి చేయగలరని కోరుతున్నాను లేనియెడలో సమ్మెలోకి వెళ్తామని తెలియజేస్తున్నాము ఈ సమావేశంలో .సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఆర్ త్రివేణి జిల్లా. కోశాధికారి శంకర్. మున్సిపల్ యూనియన్ వర్కింగ్ .ప్రెసిడెంట్ సంజీవ్.శంకరమ్మ మలేష్ రమేష్ లక్ష్మి .లక్ష్మీ.ఈశ్వరమ్మ అశోక్ శ్రీనివాస్. ఎం.శ్రీనివాస్ లింగమూర్తి ఎండి రఫిక్ ప్రవీణ్.మున్సిపల్ కార్మికులందరూ పాల్గొన్నారు

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
శుక్రవారం
19 డిసెంబర్ 2025


# పెండింగ్ బిల్లులివ్వాలి-లేదంటే లెప్రసీ సర్వే చేయలేం



## డీఎంహెచ్ఓకు ఆశావర్కర్ల వినతి

**నేటిసాక్షి, కరీంనగర్ :** పెండిరగులో ఉన్న బిల్లులను చెల్లిస్తేనే డిసెంబర్ 18 నుంచి లెప్రసీ సర్వేను చేస్తామని ఆశా వర్కర్లు గురువారం డీఎంహెచ్ఓ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశావర్కర్ల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఎడ్ల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మారెళ్ళ శ్రీలత మాట్లాడుతూ లెప్రసీ సర్వే చేయాలని అధికారులు ఆదేశిస్తున్నారని, కానీ, సర్వే చేస్తే అదనంగా డబ్బులు చెల్లిస్తారో లేదో స్పష్టం చేయాలన్నారు. ప్రజలకు సేవలందించడానికి ఆశా వర్కర్లు నిరంతరం సిద్ధంగా ఉన్నారని, ఏటా లెప్రసీ సర్వే విషయంలో ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అదనపు డబ్బులు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం మోసం చేయాలని చూస్తోందని గతేడాది లెప్రసీ సర్వేకు అదనపు డబ్బులు చెల్లింపు కోసం పెద్ద పోరాటమే చేయాల్సి వచ్చిందని గుర్తుచేశారు. పోరాట ఫలితంగా సర్వేకు అదనంగా డబ్బులు చెల్లిస్తామని, అంతకుముందు పెండిరగులో ఉన్న బిల్లులనూ వెంటనే చెల్లిస్తామని రాష్ట్ర అధికారులు గతంలో హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఇప్పుడు ఈ అంశాలకు భిన్నంగా మళ్ళీ సమస్యలను సృష్టించడం, ఆశాలను గందరగోళం చేయడం సమంజసం కాదని తెలిపారు. నేటికీ ఆశాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనం చెల్లించటం లేదని, రాష్ట్ర ప్రభుత్వం ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించలేదని, నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగి చాలీచాలని పారితోషికాలతో అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ఆశాలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాల్సిన ప్రభుత్వం, అదనపు సర్వే బిల్లులను ఎగ్గొట్టాలని చూడడం దారుణమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో డ్యూటీలు చేసిన ఆశాలకు అత్యధిక జిల్లాల్లో డబ్బులు ఇంకా చెల్లించలేదని, డిసెంబర్ 18 నుండి ప్రారంభమయ్యే లెప్రసి సర్వేకు అదనంగా డబ్బులు చెల్లించాలని కోరారు. గతంలో జిల్లాల్లో పెండిరగులో ఉన్న 2022, 2023 సంవత్సరాల లెప్రసీ సర్వే డబ్బులు, పల్స్‌పోలియో బిల్లులు వెంటనే చెల్లించాలని, పెండిరగ్ బిల్లులు వచ్చేవరకు సర్వే చేయటం కుదరదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కాల్వ సారిక, ఉపాధ్యక్షురాలు నాగెల్లి పద్మ, సత్యలక్ష్మీ సహాయ కార్యదర్శి సరిత, సుమలత, నాయకులు ప్రియంక, సదాలక్ష్మి. లక్ష్మీ., రమాదేవి, శ్రీలత, ప్రమీల, సుమలత పాల్గొన్నారు.

# జనరల్ కేటగిరీ లో దళిత బిడ్డ హవా

## నిన్న జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో గెలుపొందిన పరుశ రమేష్



**నెట్ సాక్షి రిపోర్టర్ డిసెంబర్ 18 :**జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం లోని శెఖల్ల గ్రామానికి చెందిన పరుష రమేష్ అనే అభ్యర్థి సర్పంచిగా గెలిచారు వివరాల్లోకెళ్తే సర్పంచ్ రిజర్వేషన్లకు గాను షకల్ల గ్రామానికి జనరల్ రిజర్వుడ్ కేటగిరి రాగ పలువురు అభ్యర్థులు పోటీ చేశారు ఇందులో అన్ని సామాజిక వర్గాలకు చెందిన అభ్యర్థులు పోటీ చేయగా ఎస్సీ కేటగిరికి చెందిన పరుశ రమేష్ పోటీ చేశారు. వివిధ కేటగిరీల అభ్యర్థులు ఎన్నో రకాల ప్రలోభాలకు గురి చేసినప్పటికీ ఓటర్లు ఏ ప్రలోభాలకు గురికాకుండా దళిత సామాజిక వర్గానికి చెందిన పరుశ రమేష్ కి ఓటు వేసి గెలిపించారు దీంతో గ్రామంలో సంబరాలు అంబరాన్ని అంటాయి జనరల్ కేటగిరీలో గెలవడంతో అన్ని రకాల సామాజిక వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు . ప్రజాస్వామ్యం గెలుపని పలువురు చర్చించుకుంటున్నారు. గతంలో పరుశ రమేష్ ఉపసర్పంచిగా సేవలందించారని ఎంతో బాధ్యతగా పనిచేస్తారని యువత విద్యావంతులు మహిళలు మరోసారి అతనికోటు వేసి విజయం అందేలా చేశారని గ్రామస్తులనుకుంటున్నారు. ఈ సందర్భంగా పరిష రమేష్ మాట్లాడుతూ గ్రామానికి ఉత్తమమైన సేవలు అందించడం సంక్షేమం అభివృద్ధి దిశగా తాను ప్రయాణిస్తానని అన్నారు.

# నేషనల్ హెరాల్డ్ కేసులో న్యాయమే గెలిచింది


- నేషనల్ హెరాల్డ్ కేసులో బీజేపీ చేసిన అరాచకాలపై కాంగ్రెస్ పార్టీ శ్రేణుల నిరసన
- డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క



**నేటి సాక్షి కొమరం భీం ఆసిఫాబాద్ :** నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఈడీ కేసులను కోర్టు తప్పు పట్టిన నేపథ్యంలో, బీజేపీ చేసిన అరాచకాలపై కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిరసన తెలిపారు. డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చౌరస్తాలో రహదారిపై బైటయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ.. నేషనల్ హెరాల్డ్ కేసులో నిజం గెలిచిందని, కుట్ర ఓడిపోయిందని, రాజకీయ కక్షతో ఈడీని వాడుకున్న బీజేపీకి ఇది గుణపాఠమని, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ నిర్దోషులని, ప్రజాస్వామ్యం గెలిచిందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ చేస్తున్న అరాచకాలు ఓడిపోయాయని, ప్రజాస్వామ్య సంస్థల దుర్వినియోగాన్ని ఖండిస్తున్నామని అన్నారు. పదేళ్లుగా గాంధీ కుటుంబాన్ని అవమానించిన బీజేపీ ఈ రోజు దేశ ప్రజలకు సమాధానం చెప్పాలి. మా నాయకుడు రాహుల్ గాంధీ నిరుద్యోగంపై మాట్లాడితే కేసులు, రైతుల కోసం నిలబడితే ఈడీ, ధరల పెరుగుదలపై ప్రశ్నిస్తే కేసులు. ఇదేనా ప్రజాస్వామ్యం? ఇదేనా బీజేపీ దేశానికి ఇచ్చే పాలన? ఈ రోజు మేము అంబేద్కర్ విగ్రహం ముందు ధర్నా చేయడం ఒక్క మా నాయకుల కోసమే కాదు. రాజ్యాంగాన్ని కాపాడుకోవడం కోసం .ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడం కోసం. కాంగ్రెస్ పార్టీ భయపడే పార్టీ కాదు..పోరాడే పార్టీ.. జవహర్‌లాల్ నెహ్రూ గారి ఆశయాలతో, ఇందిరాగాంధీ గారి ధైర్యంతో, రాజీవ్ గాంధీ గారి త్యాగంతో, రాహుల్ గాంధీ గారి పోరాటంతో మేము ముందుకు సాగుతున్నాం. బీజేపీ ఎంత అణచివేయాలని చూసినా నిజాన్ని ఆపలేరు, న్యాయాన్ని ఆపలేరు, కాంగ్రెస్ పార్టీని ఆపలేరని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో అన్ని మండ లాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# జాతీయ మెగా లోక్-అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి.

## జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,



**నేటి సాక్షి వికారాబాద్ :** జాతీయ స్థాయి లో జరగనున్న లోక్ ఆధాలాత్ డిసెంబర్ 21, 2025 (ఆదివారం) వరకు జరగనున్న జాతీయ మెగా లోక్-అదాలత్ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, క్షణికావేశంలో జరిగిన చిన్న తప్పులు, అనవసర వివాదాలను పరిష్కరించుకోవడానికి లోక్-అదాలత్ ఒక ఉత్తమ అవకాశం అని పేర్కొన్నారు. రాజీ కుదుర్చుకునే అవకాశం ఉన్న అన్ని రకాల కేసుల్లో కక్షిదారులు పరస్పర అంగీకారంతో రాజీ పడవచ్చని తెలిపారు. న్యాయ ప్రక్రియల వల్ల కలిగే ఆర్థిక, మానసిక ఒత్తిడులను తగ్గించుకోవడానికి లోక్-అదాలత్ ఎంతో ఉపయోగకరమని, రాజీ ద్వారా ఇరు వర్గాలు గెలిచినట్లే అవుతుందని అన్నారు. అనవసర గొడవలకు దూరంగా ఉండి, శాంతియుతంగా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కాబట్టి, ఈ నెల డిసెంబర్ 21వరకు జరగనున్న జాతీయ మెగా లోక్-అదాలత్‌ను జిల్లా ప్రజలు, కక్షిదారులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ తెలిపారు.

# రానుంది మళ్ళీ బీఆర్ఎస్ సర్కారే : కొప్పుల



- గ్రామాభివృద్ధిలో సర్పంచ్ పాత్ర కీలకం
- గెలుపొందిన ప్రజా ప్రతినిధులకు సన్మానం

**నేటి సాక్షి, ఎండపల్లి:** రానుంది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని గెలిచిన సర్పంచులు ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా కీలక పాత్ర పోషించాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సూచించారు. గురువారం మండల కేంద్రంలో కార్యక్రమం నిర్వహించి బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల్లో గెలుపొందిన వారిని ఆయన అభినందించారు. మండల కేంద్రంలో సర్పంచ్ మారం సునీత-జలేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ దాసరి కళ్యాణి, శానబండ సర్పంచ్ గాదం భాస్కర్, ఉప సర్పంచ్ కదారి రజిత, పడకల్ సర్పంచ్ బెద్దల ప్రవీణ్ మరియు వార్డు సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నమ్మి ఓట్లు వేసిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడంతో పాటు, మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కార్ తీరును ప్రజలకు వివరించి, వాటి అమలుకు ప్రజల పక్షాన నిలబడి పోరాటం సాగించాలన్నారు. గత బీఆర్ఎస్ సర్కార్ కేసీఆర్ పాలనలో పల్లెలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని, నాడు ఢిల్లీలో అవార్డులు ప్రకటిస్తే తెలంగాణ పల్లెల పేర్లు లేకుండా జాబితా ఉండేది కాదన్నారు. నేడు కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో తెలంగాణకు ఒక్క అవార్డు కూడా రాలేదని ఎద్దేవా చేశారు. మళ్లీ రెండేళ్లలో కచ్చితంగా బీఆర్ఎస్ సర్కారే తప్పక వస్తుందని గెలిచిన సర్పంచులంతా ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సింహాచలం జగన్, ఏఎంసి మాజీ చైర్మన్ ఏలేటి కృష్ణారెడ్డి, ఉద్యమకారుడు పడిదం వెంకటేష్, వెంకటేష్, నాయకులు మారం జగన్మోహన్ రెడ్డి, మైలారం సతీష్, వనం రమణయ్య, మేకల రాజేశం, ఉప్పు రాజయ్య, తనుగుల జగతి, గౌరీ చిరంజీవి, అరికిల్ల మహేందర్, దేవి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# గన్నేరువరం గ్రామంలో నూతన సర్పంచ్ విజయోత్సవ ర్యాలీ



**నేటి సాక్షి గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్ ) :** గన్నేరువరం మండల కేంద్రంలో నూతన గ్రామపంచాయతీ పాలకవర్గం సర్పంచ్ రంగన వేణి లచ్చి నర్సు మరియు 12 వార్డు సభ్యులు విజయోత్సవ ర్యాలీలో బ్యాండ్ మేళాలతో డిజె సౌండ్ లతో భారీ ఊరేగింపు నిర్వహించారు ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మచ్చ సాయి కృష్ణ రామంచ స్వామి రంగన్న వేణి సదయ్య బొడ్డు శ్రీనివాస్ బోయిని కుమార్ తదితరులు పాల్గొన్నారు

# ప్రజల సహకారంతోనే ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి

## పేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్




**నేటి సాక్షి,నారాయణపేట డిసెంబర్ 18 :** నారాయణపేట జిల్లాలో నిర్వహించిన గ్రామపంచాయితీ ఎన్నికలు మూడు విడతలుగా పూర్తిగా శాంతియుత వాతావరణంలో ప్రజల సహకారంతో విజయవంతంగా ముగిశాయి అని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. ప్రజల సహకారం, అధికారుల సమన్వయం, పోలీసు విభాగం కర్తవ్యనిష్ఠతో పనిచేయడం ఈ ఎన్నికల విజయానికి ప్రధాన కారణమని తెలిపారు. ఎన్నికల భద్రత కోసం అదనపు ఎస్పీ, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు, నారాయణపేట జిల్లా సిబ్బందితోపాటు ఇతర జిల్లాల నుండి వచ్చిన సిబ్బందితో సహా అందరి సమన్వయంతో విడతల వారీగా విధులు నిర్వర్తించినట్లు తెలిపారు. అందరినీ ఎస్పీ గారు ప్రత్యేకంగా అభినందించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన రోజునుంచే జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతల పరిరక్షణకు కఠిన చర్యలు చేపట్టినట్లు వివరించారు. జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన 06 చెక్‌పోస్టుల్లో వాహనాలను క్షుణ్ణమైన తనిఖీలు నిర్వహించడంతో పాటు గ్రామాలలో మరియు రహదారులపై ప్రత్యేక పోలీసు టీములతో విస్తృతంగా తనిఖీలు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ తనిఖీల్లో రూ.4.62,500/- నగదు, 730 లీటర్ల విలువైన మద్యం దాని విలువ 4,11,685 రూపాయలు ఉంటుందని, ఇతర విలువైన వస్తువులు చీరలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, PDS రైస్ మొత్తం 10,54,000/- రూపాయల విలువ గల వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు, గుట్కాలు 86,039/- వివిధ చట్టవిరుద్ధ చర్యలకు సంబంధించి ఎలక్షన్, మద్యంకి సంబంధించి 88 కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అదనంగా గత ఎన్నికల్లో ఘర్షణలకు కారణమైన వ్యక్తులు, రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తులపై ముందస్తు చర్యలుగా 1162 మందిని బైండోవర్ చేసినట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో చలి, పగలు, రాత్రి అన్న తేడా లేకుండా కర్తవ్యదీక్షతో పనిచేసిన పోలీసు సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలు, వివిధ శాఖల అధికారులు, పోలీసు విభాగం అందరూ సమన్వయంతో పనిచేయడంతోనే ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు.

# క్యాష్ కౌంటింగ్ మిషన్ విరాళం

## తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి ఆలయానికి..



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి ఆలయానికి తిరుచానూరు కెనరా బ్యాంక్ ప్రతినిధులు గురువారం క్యాష్ కౌంటింగ్ మిషన్ ను విరాళంగా ఆలయంలో అందించారు. ఈ మేరకు క్యాష్ కౌంటింగ్ మిషన్ ను ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్ కు కెనరా బ్యాంక్ ప్రతినిధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ మునిచెంగల్ రాయలు, ఇతర అధికారులు కెనరా బ్యాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..


# దోచుకో, దాచుకో, పంచుకో, తినుకో కూటమి విధానాలు

- సూపర్-6 గాలికొదిలేసి
- 'సూపర్4' దోపిడీ పాలనతో..
- వైసీపీ మదనపల్లి సమన్వయకర్త నిస్సార్ అహ్మద్



**నేటి సాక్షి, మదనపల్లి:** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి, ఎన్నికల్లో చెప్పిన సూపర్-6 పథకాలను పూర్తిగా విస్మరించి, తన పార్టీ శ్రేణుల కోసం 'సూపర్-4' పథకాలను అమలు చేస్తున్నారని మదనపల్లి వైసీపీ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ తీవ్ర విమర్శలు చేశారు. ఆ సూపర్-4 అంటే దోచుకో, దాచుకో, పంచుకో, తినుకో అనే విధానాలేనని ఆయన ఆరోపించారు. గురువారం తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన 'కోటి సంతకాల' సమావేశంలో పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్ రెడ్డి, తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డితో పాటు నిస్సార్ అహ్మద్ పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. 18 నెలల కూటమి పాలనలో అభివృద్ధి శూన్యమని, భూ కబ్జాలు, ఇసుక మాఫియా, మద్యం మాఫియాలే పాలనగా మారాయని ఆరోపించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపడం తప్ప ప్రజలకు చేసిన మేలు ఏదీ లేదని విమర్శించారు. ప్రజా పాలనను పక్కనపెట్టి దోపిడీ పాలన కొనసాగిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, నాలుగేళ్లు ఏదోలా గడిపేసి, ఎన్నికల సమయంలో మళ్లీ మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెట్టేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. కూటమి పాలనలో జరుగుతున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమాలు చేపడతామని, వైసీపీ ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ద్వారా కార్పొరేట్ విధానంలో భారీగా నగదు చేతులు మారి ఇది క్విడ్ ప్రో క్వోగా మారిందని నిస్సార్ అహ్మద్ ఆరోపించారు. పీపీపీ విధానంపై అనేక అనుమానాలు ఉన్నాయని, ఇవి ప్రజలు కూడా గుర్తిస్తున్నారని అన్నారు. పేదలకు విద్య, వైద్యం అందించాలనే లక్ష్యంతో వైయస్ జగన్ మోహన్ రెడ్డి స్థాపించిన మెడికల్ కాలేజీల వల్ల ఆయనకు మంచి పేరు వస్తుందన్న భయంతోనే చంద్రబాబు ప్రైవేటీకరణకు పూనుకుంటున్నారని విమర్శించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని నిస్సార్ అహ్మద్ పిలుపునిచ్చారు..

## జగిత్యాల జిల్లా వైద్యాధికారిగా శ్రీనివాస్



**నేటి సాక్షి - జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు) :** జగిత్యాల జిల్లా నూతన వైద్యాధికారిగా డాక్టర్ ఏ శ్రీనివాస్ గురువారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ జిల్లా వైద్యాధికారిగా పనిచేసిన ప్రమోద్ కుమార్ బదిలీపై వెళ్లగా ప్రోగ్రాం అధికారిగా పనిచేస్తున్న శ్రీనివాస్ ను జిల్లా వైద్యాధికారిగా నియమిస్తు జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు అధికారి తాజాగా విధుల్లో చేరారు.

## రాయిపేటలో కాంగ్రెస్ నేతల దాడులు

**అవమానం తో పురుగుల మందు సేవించిన రాదండి సమ్మయ్య**



**నేటి సాక్షి మంచిర్యాల జిల్లా డిసెంబర్ 18 :**చెన్నూర్ రాయిపేట లో ఓటమిని జీర్ణించుకోలేక కాంగ్రెస్ అభ్యర్థి అతని అనుచర వర్గంతో రాదండి సమ్మయ్య అనే వ్యక్తి ఇంటిపైకి వెళ్లి సమ్మయ్యపై అతని కుటుంబ సభ్యులపై దాడి చేశారు బీఆర్ఎస్ అభ్యర్థి వెంకటేష్ పట్ల భూతులతో రెచ్చిపోయిన కాంగ్రెస్ నేతలు, మనస్థాపనికి లోనై పురుగుల మందు సేవించిన ఆత్మ హత్యయత్నం చేసిన రాదండి సమ్మయ్య. వెంటనే చెన్నూర్ ప్రభుత్వ హాస్పిటల్ వెంటనే తీసుకెళ్లగా సమ్మయ్య ఆరోగ్య పరిస్థితి. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల తరలించి, చెన్నూరు పోలీస్ స్టేషన్లో సమ్మయ్య కుటుంబ సభ్యుల పిర్యాదు చేశారు

## గొల్లగూడ సర్పంచిగా నిర్మల నర్సింలు విజయం సాధించారు



**నేటి సాక్షి ప్రతినిధి చేవెళ్ల న్యూస్ :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలోని గొల్లగూడ గ్రామంలో ఇటీవల జరిగిన సర్పంచ్ ఎలక్షన్లో నిర్మల నర్సింలు గ్రామంలో త్రిముఖ పోటీ ఉండగా అట్టి పోటీల్లో నర్సింలు గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉండడంతో గ్రామ ప్రజలు నిర్మలా నరసింహులు పై నమ్మకం పెట్టుకున్నారు గ్రామం కోసం నర్సింలు గ్రామపంచాయతీ గొల్లగూడ ఏర్పాటుకు రెవెన్యూ సపరేటు కావడానికి కృషి చేసినారు అందులో గ్రామ యువకులతోనూ గ్రామ ప్రజలతోనూ మహిళలతోనూ వాళ్ళ ఇంటి మనిషిగా ఎలాంటి పని ఉన్న నరసింహులు ప్రజలకు ముందుండి సేవ చేసేవాడు గ్రామంలో ఏ కార్యక్రమం జరిగిన తను ముందుండి సేవ చేసేవాడు ప్రజలు నాపై నమ్మకం పెట్టుకొని గెలిపించినందుకు ప్రజలకు రుణపడి ఉంటానని ప్రజల యొక్క అభిప్రాయాల మేరకు గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు నేను ఎప్పుడు మీ సేవకుడిలా పని చేస్తానని మీ నమ్మకాన్ని వొమ్ము చేయనని మన గ్రామం రెండవ సర్పంచిగా ఎన్నుకున్నందుకు నిర్మల నరసింహులు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు

# న్యాయం గెలిచింది.. కుట్ర ఓడింది-ఆత్రం సుగుణక్క




**డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క**

**నేటి సాక్షి, కొమురంభీమ్ ఆసిఫాబాద్ :** నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఈడీ నమోదు చేసిన కేసులను కోర్టు తప్పుబట్టిన నేపథ్యంలో, బీజేపీ రాజకీయ కక్షపూరిత చర్యలను ఖండిస్తూ కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ పట్టణంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చౌరస్తాలో రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ నేషనల్ హెరాల్డ్ కేసులో న్యాయం గెలిచిందని, బీజేపీ చేసిన కుట్రలు పూర్తిగా ఓడిపోయాయని స్పష్టం చేశారు. రాజకీయ కక్షతో ఈడీని దుర్వినియోగం చేసిన బీజేపీకి కోర్టు తీర్పు గుణపాఠమని అన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీలు నిర్దోషులని తేలడం ప్రజాస్వామ్యానికి లభించిన విజయమని పేర్కొన్నారు. పదేళ్లుగా గాంధీ కుటుంబాన్ని అవమానించిన బీజేపీ ఈ రోజు దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ నిరుద్యోగం గురించి మాట్లాడితే కేసులు, రైతుల పక్షాన నిలబడితే ఈడీ, ధరల పెరుగుదలపై ప్రశ్నిస్తే మరో కేసు నమోదు చేయడం ఇదేనా ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేయడం కేవలం కాంగ్రెస్ నాయకుల కోసం కాదని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడం కోసం, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడం కోసమేనని సుగుణక్క తెలిపారు. కాంగ్రెస్ పార్టీ భయపడే పార్టీ కాదని, పోరాడే పార్టీ అని స్పష్టం చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ ఆశయాలతో, ఇందిరాగాంధీ ధైర్యంతో, రాజీవ్ గాంధీ త్యాగంతో, రాహుల్ గాంధీ పోరాటంతో కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందని అన్నారు. బీజేపీ ఎంత అణచివేయాలని చూసినా నిజాన్ని, న్యాయాన్ని ఆపలేరని, కాంగ్రెస్ పార్టీని అడ్డుకోలేరని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# టీ-హబ్, టీ-వర్క్‌కు కోరుట్ల డిగ్రీ విద్యార్థుల అధ్యయన పర్యటన

- విద్య-నవోత్తేజానికి వారధిగా ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ ముందడుగు
- స్టార్టప్ సంస్కృతి, పరిశ్రమల అవగాహనకు హైదరాబాద్ ప్రయాణం




**నేటి సాక్షి - కోరుట్ల ( రాధారపు నర్సయ్య ) :** యువతను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, స్టార్టప్ సంస్కృతితో పరిచయం చేయాలన్న లక్ష్యంతో, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో మెట్‌పల్లి-కోరుట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థినీ-విద్యార్థులు హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక టీ-హబ్ మరియు టీ-వర్క్స్ సందర్శనకు బయల్దేరారు. విద్యార్థుల్లో ఆవిష్కరణ ఆలోచనలు పెంపొందించడంతో పాటు, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ అధ్యయన పర్యటనను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్రంలో స్టార్టప్‌లకు కేంద్రంగా నిలిచిన టీ-హబ్, పరిశ్రమల నైపుణ్యాభివృద్ధికి కీలకమైన టీ-వర్క్స్‌ను ప్రత్యక్షంగా సందర్శించే అవకాశం విద్యార్థులకు దక్కింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా ప్రపంచ స్థాయి ఆలోచనలతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చదువు మాత్రమే కాదు, నైపుణ్యం, ఆవిష్కరణే భవిష్యత్తుకు పునాదని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని సాంకేతిక, పరిశ్రమల వాతావరణాన్ని ప్రత్యక్షంగా చూడటం విద్యార్థుల ఆలోచనా పరిధిని విస్తరిస్తుందని ఆయన తెలిపారు.

**టీ-హబ్‌లో స్టార్టప్ అవగాహన**

టీ-హబ్‌లో స్టార్టప్‌లు ఎలా ప్రారంభమవుతాయి, ఆవిష్కరణలకు ప్రభుత్వం, ప్రైవేట్ రంగం ఎలా సహకరిస్తున్నాయనే అంశాలపై విద్యార్థులకు వివరణ ఇచ్చారు. టీ-వర్క్స్‌లో నైపుణ్యాభివృద్ధి అనంతరం టీ-వర్క్స్‌ను సందర్శించిన విద్యార్థులు, ఆధునిక యంత్రాలు, తయారీ విధానాలు, పరిశ్రమలకు అవసరమైన స్కిల్స్ గురించి తెలుసుకున్నారు. థియరీకి మించి ప్రాక్టికల్ పరిజ్ఞానం ఎంత ముఖ్యమో ఈ సందర్శన ద్వారా అవగతమైందని విద్యార్థులు అభిప్రాయపడ్డారు. ఇలాంటి పర్యటనలు తమకు కొత్త దిశ చూపుతున్నాయని, భవిష్యత్తులో స్టార్టప్‌లు, పరిశ్రమల వైపు అడుగులు వేయడానికి ప్రేరణగా నిలుస్తున్నాయని విద్యార్థులు తెలిపారు. ఈ అవకాశాన్ని కల్పించిన ఎమ్మెల్యే సంజయ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. కోరుట్ల నియోజకవర్గ విద్యార్థులను ఆధునిక ప్రపంచంతో అనుసంధానం చేసే దిశగా ఈ అధ్యయన పర్యటన ఒక కీలక అడుగుగా నిలిచింది. విద్య%-%నైపుణ్యాల సమ్మేళనంతో యువత భవిష్యత్తును తీర్చిదిద్దాలన్న లక్ష్యానికి ఇది మరింత బలం చేకూర్చనుంది.

# అనాధ శరణాలయ నిర్వాహకుడి దాష్టీకం

**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి డిసెంబర్ 18 :** ఆనాథ పిల్లలే కదా అడిగేవారెవరులే అనుకొన్నాడా నిర్వాహకుడు... అన్యం పుణ్యం తెలియని అరచెయ్యిని పగులగొట్టేశాడు... ఇంకేమి చేస్తాడో అన్న భయంతో వేసుకొన్న నిక్కరుతోనే సొంత గ్రామానికి చేరుకున్నాడా బాలుడు...బాలుడి కథనం మేరకు...చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలం పంచాయతీ కేంద్రం పుదిపట్లలో సంజోత్ అనే ఆశ్రమాన్ని నిరంజన్రెడ్డి అనే అతను నడుపుతున్నాడు. కుటుంబంలోని తల్లిదండ్రులు, ఎవరో ఒకరిని కోల్పోయిన వ్యక్తుల పిల్లలు, చదువుకొనే స్థోమత లేని పిల్లలు ఈ ఆశ్రమంలోకి చేరదీస్తున్నారు. ఈక్రమంలో చిత్తూరు సంతపేటకు చెందిన ప్రకాష్ కుమారుడు ఆదిత్య(13) ఇదే ఆశ్రమంలో వున్నాడు. ఇక్కడే వుంటూ వుదిపట్ల ఉన్నతపాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. గత రెండు రోజులుగా బాలుడు పాఠశాలకు రాకపోవడంతో ప్రధానోపాధ్యాయురాలు పద్మజ ఆరా తీసింది. నిర్వాహకుడు నిరంజన్రెడ్డిని మా ప్రతినిధి చరవాణిలో విచారించే ప్రయత్నం చేయగా అతని నుంచి దురుసుగా సమాధానం రావడంతో జరిగిన ఉదంతం బయటకు వచ్చింది. ఆశ్రమంలో ఆనాధ పిల్లలచేత పశువులు, కోళ్ళను మేపించడం,వాటి వ్యర్థ పదార్థాలను ఊడిపించడం వంటి కార్యక్రమాలను చేయిస్తున్నాడనీ, పిల్లలు ఒప్పుకోకుంటే దారుణంగా బాదుతున్నాడని ఆదిత్య సామాజిక మాద్యమం ద్వారా వివరించాడు. తనను కోళ్ళవ్యర్థ పదార్థాలు తీయలేదని చితకొట్టాడనీ, చెయ్యి అడ్డు పెడితే పగిలేలా ఇనుప ఊచతో కొట్టగా భరించలేక పారిపోయి వచ్చేశానని మాద్యమంలో తెలిపాడు. తాను వేసుకొన్ని నిక్కరుతోనే సొంత గ్రామానికి చేరుకొన్నానని తెలిపాడు. తనతోపాటు అక్కడున్న పిల్లలకు ఇదే పరిస్థితి వుందనీ, వారందరినీ ఆదుకోవాలని వాట్సాఫ్ ద్వారా సమాచారాన్ని వ్యక్త పరచాడు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయం తెలిసిన ఐసిడియస్,సిడబ్యూసి అధికారులు విచారణ చేపట్టారు. ఈ విషయం పైన బాధితుడి తల్లి



సుదా ఇచ్చిన పిర్యాదు పైన చౌడేపల్లి పోలీసులు కేసు నమోదుచేసినట్లు ఎస్సై నాగేశ్వరావు తెలిపారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
శుక్రవారం
19 డిసెంబర్ 2025


# డీసీసీ అధ్యక్షుడు 'మేడిపల్లి' గృహనిర్బంధం

- కాంగ్రెస్ ఆందోళన ఉద్రిక్తం
- పలువురు నాయకుల అరెస్టు
- జేబు సంస్థల్లా 'ఈడీ', 'సీబీఐ'- 'మేడిపల్లి'



**నేటిసాక్షి, కరీంనగర్ :** ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై పెట్టిన తప్పుడు కేసులను, ఉపాధి హామీ పేరు మార్పును నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ గురువారం చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతలకు దారితీసింది. టీపీసీసీ పిలుపు మేరకు బీజేపీ కార్యాలయాల ముట్టడికి బయల్దేరనున్న డీసీసీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, పలువురు నాయకులను పోలీసులు గృహనిర్బంధం చేశారు. అలాగే కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్ ఆధ్వర్యంలో కోర్టు చౌరస్తా నుంచి ర్యాలీగా వెళ్తున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఇతర నాయకులను పోలీసులు అరెస్టు పీటీసీకి తరలించారు. ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మాట్లాడుతూ నేషనల్ హెరాల్డ్ కేసులో కోర్టులు కాంగ్రెస్ అగ్రనేతల ప్రమేయం లేదని తీర్పు ఇచ్చిందని, అయినా కేంద్రంలోని మోదీ సర్కారు ఈడీ, సీబీఐలను జేబు సంస్థల్లా వాడుకుంటోందని విమర్శించారు. రాజకీయంగా అణగదొక్కాలని ప్రతీకార చర్యలకు పాల్పడుతూ, మానసిక క్షోభకు గురిచేస్తున్నా రన్నారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడితే కాంగ్రెస్ శ్రేణులు బీజేపీ నాయకులను ప్రజాక్షేత్రంలో తిరగనివ్వ బోమని, ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు.

### బీజేపీది నిరంకుశ పాలన

కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు 'వైద్యుల' ప్రతిపక్ష నాయకులను టార్గెట్ చేస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిరంకుశ పాలన కొనసాగిస్తోందని ఆరోపించారు. ప్రతిపక్షాలను భయాందోళనకు గురిచేసి నోరు నొక్కాలని చేస్తున్న కుట్రలను ఇక సహించమని పేర్కొన్నారు. అక్రమ కేసులను కోర్టులు కొట్టివేసిన వైనాన్ని ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో బీజేపీ తగిన గుణ-పాఠం చెప్పక తప్పదన్నారు. నేషనల్ హెరాల్డ్ స్వాతంత్ర్య సమరయోధులు ఏర్పాటుచేసిన పత్రిక అని, ఈ పత్రిక నడవలేని పరిస్థితుల్లో సిబ్బందికి జీతాలివ్వడానికి కాంగ్రెస్ కార్యకర్తలు రూపాయి, రూపాయి జమచేసినట్లు గుర్తుచేశారు. కానీ, మోదీ సర్కారు మనీలాండరింగ్ ఆరోపణల పేరిట ఈడీతో దాడులు చేయించిందని, కోర్టు వీరికి క్లీన్‌చిట్ ఇవ్వడంతో తెల్లమొహాలు వేసుకున్నారని విమర్శించారు.

### కక్ష సాధింపుతోనే వేధింపులు-సుడా చైర్మన్ 'కోమటిరెడ్డి'

కక్షసాధింపు చర్యల్లో భాగంగానే కాంగ్రెస్ అగ్రనేతలపై నేషనల్ హెరాల్డ్ పత్రిక పేరిట వేధింపుల పర్వం కొనసాగించారని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. ఎలాంటి ఆధారాల్లేకున్నా విచారణల పేరిట గంటలకు గంటలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారన్నారు. శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేపట్టిన తమను అక్రమంగా అరెస్టు చేయడం శోచనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకారపు భాస్కర్‌రెడ్డి, మల్లికార్జున రాజేందర్, కర్ర రాజశేఖర్, పడిశెట్టి భూమయ్య, గంట కళ్యాణి, కోడూరి రవీందర్‌గౌడ్, సిరాజ్‌హుస్సేన్, బానోతు శ్రవణ్‌నాయక్, అరుణ్‌కుమార్, బోనాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ఎంపీటీసీ-జడ్పీటీసీ ఎన్నికలకు ఇక బ్రేకే.!?

- 'ఇప్పట్లో లేవు, అసెంబ్లీలో నిర్ణయం' - సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం
- బీసీ రిజర్వేషన్లు, కోర్టు ఆంక్షలే కారణమా?
- గ్రామ పంచాయతీ ఫలితాల నడుమ మరింత ఆలస్యానికి సంకేతాలు




**నేటి సాక్షి - కోరుట్ల ( రాధారపు నర్సయ్య ) :** తెలంగాణలో ఇటీవల ముగిసిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనూహ్యంగా బలమైన ప్రదర్శన చేసినప్పటికీ, మండల్ పరిషత్ (ఎంపీటీసీ), జిల్లా పరిషత్ (జడ్పీటీసీ) ఎన్నికలు మాత్రం ఇప్పట్లో జరగబోవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ఎన్నికల షెడ్యూల్‌పై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ప్రకటించడంతో, రాష్ట్ర రాజకీయ వర్గాల్లో కొత్త చర్చ మొదలైంది.

### ఉత్కంఠపై స్పష్టతనిచ్చిన సిఎం వ్యాఖ్యలు

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై నెలకొన్న ఉత్కంఠకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజా వ్యాఖ్యలు కొంత స్పష్టతనిచ్చాయి. అసెంబ్లీలో మాట్లాడుతూ ఆయన.. 'ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఇప్పట్లో లేనట్లే.!ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ఎప్పుడు పెట్టాలన్నది అసెంబ్లీ పెట్టి నిర్ణయి-స్తామ'ని స్పష్టంగా పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

### గ్రామ పంచాయతీ ఎన్నికల తర్వాత

ఇటీవల డిసెంబర్ నెలలో మూడు దశల్లో నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు గల అభ్యర్థులు గణనీయమైన విజయాలు సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా సర్పంచ్ స్థానాల్లో సగానికి మించిన స్థానాల్లో కాంగ్రెస్ ప్రభావం కనిపించింది. ఈ ఫలితాలతో అధికార పార్టీ ధీమాగా ఉన్నప్పటికీ, తదుపరి స్థాయి ఎన్నికలైన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు మాత్రం ముందుకు సాగడం లేదు.

### బీసీ రిజర్వేషన్లే ప్రధాన అడ్డంకి

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఆలస్యానికి ప్రధాన కారణంగా బీసీ రిజర్వేషన్ల అంశం నిలుస్తోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ ప్రయత్నాలకు, మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదన్న సుప్రీంకోర్టు, హైకోర్టుల ఆదేశాలు అడ్డంకిగా మారాయి. గ్రామ పంచాయతీ ఎన్నికలు పార్టీ రహితంగా నిర్వహించినందున, ఈ కోటాను అమలు చేయకుండా ముందుకు వెళ్లాల్సి వచ్చింది. కేంద్ర ఆర్థిక సంఘం నిధులు ల్యాప్స్ కాకుండా ఉండాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

### పార్టీ బేసిస్ ఎన్నికలే వివాదానికి మూలం

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పార్టీ ప్రాతిపదికన జరగనున్న నేపథ్యంలో, బీసీ సంఘాలు తమ డిమాండ్లను మరింత బలంగా వినిపిస్తున్నాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. డిసెంబర్ 14న హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో 14 బీసీ సంఘాలు ఒకే గొంతుతో ప్రభుత్వాన్ని హెచ్చరించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

### ప్రభుత్వ ఆలోచనలు - నివేదికలు ఏమంటున్నాయి.?

కొన్ని రాజకీయ వర్గాల సమాచారం ప్రకారం, డిసెంబర్ చివరి నాటికి నోటిఫికేషన్లు జారీ చేసి, జనవరి 2026లో ఎన్నికలు నిర్వహించే ఆలోచన ప్రభుత్వం చేస్తోందన్న ప్రచారం జరిగింది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం లోపే ఉంచి, బీసీ కోటాను సర్దుబాటు చేయాలన్న యోచన కూడా ఉందని సమాచారం. అయితే, సీఎం తాజా వ్యాఖ్యలు ఈ ప్రచారానికి బ్రేక్ వేసినట్లయ్యాయి. అసెంబ్లీ సమావేశాల్లో, ముఖ్యంగా బడ్జెట్ సెషన్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పడం ఎన్నికల ఆలస్యానికి స్పష్టమైన సంకేతంగా భావిస్తున్నారు.

### రాజకీయ లెక్కలు: కాంగ్రెస్‌కు లాభమా? నష్టమా?

గ్రామ పంచాయతీ ఫలితాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి గ్రామ స్థాయిలో పట్టు పెరిగింది. అదే సమయంలో రాష్ట్రంలో కీలకమైన బీసీ ఓటు బ్యాంక్‌ను కోల్పోకుండా ఉండాలన్న ఆలోచన కూడా ప్రభుత్వాన్ని జాగ్రత్తగా అడుగులు వేయిస్తోంది. కోర్టు ఆంక్షలు, బీసీ సంఘాల డిమాండ్లను సమతుల్యం చేస్తూ చట్టబద్ధంగా ముందుకు వెళ్లాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

### ప్రతిపక్షాల ఆరోపణలు

ఇదిలా ఉండగా, బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తగిలిందని, అందుకే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు భయపడుతోందని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా కేటీఆర్ వంటి నేతలు ఈ అంశాన్ని రాజకీయంగా ఎత్తిపట్టుతున్నారు. బీసీ రిజర్వేషన్లపై చట్టపరమైన సమస్యలు పరిష్కారమైతే, 2026 జనవరి-ఫిబ్రవరిలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. లేకపోతే మరింత ఆలస్యం తప్పదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మొత్తంగా, రేవంత్ రెడ్డి సర్కార్ స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో తొందరపడకుండా, రాజకీయంగా మరియు చట్టపరంగా భద్రమైన నిర్ణయాలు తీసుకోవాలని భావిస్తోంది. ఎంపీటీసీ-జడ్పీటీసీ ఎన్నికలు తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక మలుపుగా మారనున్న నేపథ్యంలో, ప్రభుత్వ తదుపరి అడుగులపై అందరి దృష్టి నెలకొంది.

# గోధూరు వాసికి గౌరవ డాక్టరేట్

## సీనియర్ జర్నలిస్టు బూరం సంజీవ్‌కు అంతర్జాతీయ గుర్తింపు

**నేటి సాక్షి - మెట్ పల్లి ( రాధారపు నర్సయ్య ) :** జర్నలిజం రంగంలో ప్రజా సమస్యలపై నిరంతర సేవలందిస్తున్న ఇబ్రహీంపట్నం మండలం గోధూర్ గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు బూరం సంజీవ్‌కు గౌరవ డాక్టరేట్ లభించడం గర్వకారణంగా నిలిచింది. ఆయనకు టోలాస మెక్సికో (అమెరికా) యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అవార్డును ప్రదానం చేసింది.

### జర్నలిజంతో సమాజసేవ

ఇబ్రహీంపట్నం మండలం గోధూర్ గ్రామానికి చెందిన బూరం సంజీవ్‌కు ఈ నెల 14న ఔరంగాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో టోలాస మెక్సికో (అమెరికా) యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అవార్డును అందజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా జర్నలిజం వృత్తిలో కొనసాగుతూ ప్రజా సమస్యలపై అనేక కీలక కథనాలు రాసి సమాజానికి సేవలందించినందుకుగాను ఈ గౌరవాన్ని అందించినట్లు యూనివర్సిటీ ప్రతినిధులు తెలిపారు.


### జర్నలిజంలో సేవలకు గుర్తింపు

ప్రస్తుతం బూరం సంజీవ్ టీయూడబ్ల్యుజే (ఐజేయు) మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. జర్నలిస్టుగా తన రచనల ద్వారా ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చి, బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేసినందుకు ఈ డాక్టరేట్ ప్రదానం చేయడం విశేషమని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా బూరం



సంజీవ్ మాట్లాడుతూ, గౌరవ డాక్టరేట్ అందుకునే స్థాయికి తీసుకువచ్చిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా యూనివర్సిటీ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ కాయితి శంకర్ చేసిన సహకారాన్ని ప్రత్యేకంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు మాసుల ప్రవీణ్, మెట్టు దాస్ తదితరులు పాల్గొని బూరం సంజీవ్‌ను అభినందించారు. ఆయన మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. గ్రామ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి-ంలో గుర్తింపు పొందడం జర్నలిజం రంగానికి గర్వకారణమని, యువ జర్నలిస్టులకు బూరం సంజీవ్ ఆదర్శంగా నిలుస్తారని పలువురు పేర్కొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ లో చేరిక



**నేటి సాక్షి కొమురం భీం ఆసిఫాబాద్ :** ఈ రోజు ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం లో ఆసిఫాబాద్ మండలం లోని రౌటసంకెపల్లి గ్రామ పంచాయతీ లోని 6వ వార్డు నుండి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన ఎడ్ల బాపూరావు DCC అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క గారి అద్వర్యంలో కాంగ్రెస్ పార్టీ లో చేరడం జరిగింది. ఈ కార్యక్రమం లో నాయకులు ఇరుకుల్ల మంగ, గుండా శ్యాం,ఆరీఫ్ అలీ గారు,తదితరులు పాల్గొన్నారు.

# బోగస్ ఓటర్లను తొలగించాలని యువకుల ఆవేదన

**నేటి సాక్షి ప్రతినిధి చేవెళ్ల న్యూస్ :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలోని కమ్మెట గ్రామంలో బోగస్ ఓటర్లు చాలామంది ఉన్నారని గ్రామములో కాకుండా కమ్మెట చౌరస్తాలో వేరే రాష్ట్రాల నుండి వచ్చిన వారికి కమ్మెట గ్రామంలో ఓటు హక్కు కల్పించడం ద్వారా గ్రామ నాయకులకు పరాజయాలకు విజయాలకు వారు ముఖ్యంగా కావడంతో వేరే రాష్ట్రాల నుండి వచ్చిన వారికి వారి రాష్ట్రాలలోనూ ఓటు హక్కు ఉన్న మరి ఇక్కడ గ్రామంలో వచ్చి ఓటు హక్కు కల్పించుకోవడం విడ్డూరంగా ఉందని అట్టి బోగస్ ఓటర్లను కమ్మెట గ్రామ ఓటర్ లిస్టులో నుంచి 100 నుండి 150 మంది వరకు ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన ఓటర్లు ఉన్నారని గ్రామ యువకులు అంచనా వేసినారు అట్టి వారిని కమ్మెట గ్రామ ఓటర్ లిస్ట్ లో నుండి తొలగించాలని ఎంపిటిసి ఎలక్షన్లు వచ్చే లోపల మన కమ్మెట గ్రామ ప్రజలు యువకులు పెద్దలు ఆలోచన చేసి బోగస్ ఓటర్లను తొలగించాలని అధికారులకు విన్నవించాలని గ్రామ యువకులు ఆవేదన వ్యక్తం చేశారు మన గ్రామాన్ని వేరే ఓటర్లు విజయాలకు పరాజయాలకు ముఖ్య కారణం కావద్దని ఆవేదన వ్యక్తం చేశారు ఇట్టి కార్యక్రమంలో అందరూ ఆలోచన చేసి తగు నిర్ణయం తీసుకుంటారని యువకులు అన్నారు

# ప్రమాదవశాత్తు కాలు జారిపడి మేస్త్రి మృతి



**నేటి సాక్షి ప్రతినిధి డిసెంబర్ 18 శంకరపల్లి న్యూస్ :** భవన నిర్మాణంలో పనిచేస్తున్న ఓ మేస్త్రి ప్రమాదవశాత్తు కాలు జారీ కిందపడి మృతి చెందిన సంఘటన గురువారం శంకర్ పల్లి పట్టణంలో చోటుచేసుకుంది. శంకర్పల్లి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన అనరులోహక్ (31) ఏడు నెలల క్రితం బతుకుదెరువు నిమిత్తం తన అన్న తో కలిసి శంకర్ పల్లి కి వచ్చాడు. అప్పటినుంచి మేస్త్రి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం పట్టణంలోని శాంటమ్ హోమ్స్ (sanctum homes) లో సీలింగ్ పనులు చేస్తుండగా.. ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డాడు. చికిత్స కోసం మొదట శంకర్పల్లిలోని లలిత హాస్పిటల్ కి తర్వాత మెరుగైన వైద్యం కోసం పటాన్చెరు తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. భవన నిర్మాణంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా తన సోదరుడి మృతి కారణమైన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని మృతుడి అన్న ఫిర్యాదు చేసాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# కాగజ్‌నగర్‌లో కొండచిలువ కలకలం

### ఎస్‌పీఎం క్వార్టర్స్ వద్ద కొండచిలువ పట్టివేత



**నేటి సాక్షి కొమరం భీమ్ ఆసిఫాబాద్ ప్రతినిధి డిసెంబర్ 18 :** కాగజ్‌నగర్. పట్టణం లో ఈఎస్.ఐ సమీపంలోని ఎస్‌పీఎం క్వార్టర్స్ వద్ద. పెద్ద పెద్ద.కొండచిలువ కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. నివాస ప్రాంతంలో కొండచిలువ తిరుగుతుండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై సమాచారం అందించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డులు ధైర్యంగా స్పందించి, ఎలాంటి ప్రమాదం జరగకుండా చాకచక్యంగా కొండచిలువను పట్టుకున్నారు. అనంతరం అటవీ అధికారులకు సమాచారం ఇచ్చి, వారి సూచనల మేరకు ఆ కొండచిలువను పట్టణానికి దూరంగా ఉన్న అటవీ ప్రాంతంలో సురక్షితంగా వదిలివేశారు. ఈ ఘటనతో స్థానికులు ఊపిరి పీల్చుకోగా, సకాలంలో స్పందించిన సెక్యూరిటీ గార్డులను ప్రశంసించారు. నివాస ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..


# నిరుద్యోగ యువత కు ప్రవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు

**నేటి సాక్షి - జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు ) :** జగిత్యాల జిల్లా లోని నిరుద్యోగ యువత కు ప్రవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు ఉపాధి కల్పన అధికారి తెలిపారు. విజన్ ఇండియా సర్వీస్ లో 300,అపోలో ఫార్మసి లో 30 ఉద్యోగాల ఖాళీలా భర్తీ కోసం ఈ నెల 20 న ఉపాధి కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, బి ఫార్మసీ, డి ఫార్మసీ కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించలన్నారు.

# ముస్తాబ్ అవుతున్న గ్రామపంచాయతీలు...


- 22న గ్రామాలకు కొత్త సర్పంచులు....



**నేటి సాక్షి, నారాయణపేట, జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 18:** నారాయణపేట జిల్లాలోని వివిధ మండలాల్లోని గ్రామాలలో ఉన్న గ్రామపంచాయతీ కార్యాలయాలకు ఎన్నికైన కొత్త సర్పంచులు ,ఉప సర్పంచ్ల ఆధ్వర్యంలో ముస్తాబులు చేసే పనిలో నిమగ్నమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 22న కొత్త సర్పంచుల బాధ్యతల స్వీకరణ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచులు పంచాయతీ కార్యాలయాలకు కలర్లతో ముస్తాబులు చేపడుతున్నారు. నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల పరిధిలోని పస్పుల గ్రామంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ నర్మదా రవి కుమార్ గౌడు, గ్రామ ఉపసర్పంచ్ మహేష్ ల ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయానికి మ-ుస్తాబు పనులు చేపట్టారు. పస్పుల గ్రామపంచాయతీ కార్యాలయం ముస్తాబు అవుతున్న సందర్భంగా గ్రామస్తులు సర్పంచ్ ఉప సర్పంచ్ల పనితీరుపై హర్షం వ్యక్తం చేశారు.

# పేట జిల్లా అదనపు కలెక్టర్కు ఫిర్యాదు.

చీకర్ల గడ్డ తండా, ధన్వాడ మండలం.



**నేటి సాక్షి,నారాయణపేట, డిసెంబర్ 18 :** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల కేంద్రంలో గల చర్లపల్లి క్లస్టర్ కు సంబంధించిన శిఖర్ల గడ్డ తండా గ్రామపంచాయతీ ఎన్నికలలో ఉప సర్పంచ్, ఎన్నికకై నోటీసు గానీ, ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, ఎన్నికల అధికారులు ఉప సర్పంచ్ అభ్యర్థిని నిర్ణయించడం పై చీకర్లగడ్డ తాండ వాసులు గురువారం నారాయణపేట అదనపు కలెక్టర్కు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఎన్నికల నియమ నిబంధనలకు విరుద్ధంగా రిటర్నింగ్ అధికారి ఉపసర్పంచ్లు ఎన్నుకోవడం పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో రెండవ వార్డ్ సభ్యులు మూడవ సంతోష్, ఎనిమిదవ వార్డ్ సభ్యులు దేగవత్ లక్ష్మీబాయి, మూడోవార్డు సభ్యులు నీలమ్మ, ఏడో వాట్సప్ లు నీలమ్మ, నాలుగో వార్డ్ సభ్యులు తుకారాం, మరియు గ్రామస్తులు జిల్లా కలెక్టర్ గారికి ఫిర్యాదు చేశారు. మెజార్టీ పరంగా ఉప సర్పంచ్ ను ఎన్నుకోవాలని మాకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరారు.

# కుష్టు నివారణ పై వైద్యాధికారుల సమీక్ష



**నేటి సాక్షి - జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు ) :** నేటి నుంచి ప్రారంభమైన కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వేను రాష్ట్ర పరిశీలకులు పరిశీలించారు. తెలంగాణ స్టేట్ లెప్రసీ ఆఫీస్ కు చెందిన సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఇంటింటి సర్వే విధానాన్ని పరిశీలించారు. అనంతరం జగిత్యాల మోతే వాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమావేశం నిర్వహించి సర్వే ఉద్దేశాలపై వివరించారు.ప్రతి ఏడాది రెండు విడుదల సర్వే జరుగుతుందని తెలిపారు.

# ఏడాదికి రూ. 1000 కోట్లు ఖర్చు పెట్టలేరా..!

- యోగా డేకి రూ.330 కోట్లు వృథా..
- హెరిటేజ్ కి గవర్నమెంట్ పేరు పెడితే ప్రభుత్వ పరమవుతుందా..!
- వైసీపీకి ఎక్కడ క్రెడిట్ వస్తుందోనని పేదలకు శిక్షా..
- చంద్రబాబు ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకో.. వైయస్ జగన్



**నేటి సాక్షి, అన్నమయ్య జిల్లా, శర్మ, డిసెంబర్ 18 :** అన్నమయ్య జిల్లా -:- ఆంధ్రప్రదేశ్ లో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గురువారం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అహ్మద్ ను మర్యాదపూర్వకంగా లోక్ భవన్ లో కలిశారు. ఆయన దృష్టికి తీసుకెళ్తూ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం పెద్ద స్కామ్ అని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ఆరోపించారు. ప్రభుత్వ స్థలాలు, ప్రభుత్వమే జీతం చెల్లిస్తుందని కానీ నిర్వహణ ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉంటుందన్నారు. ఏడాదికి రూ.వెయ్యి కోట్లు ఖర్చు పెట్టలేరానని కూటమి ప్రభుత్వాన్ని జగన్ ప్రశ్నించారు. ఖర్చు చేయకపోతే మెడికల్ కాలేజీలను అలానే వదిలేయండని తాము అధికారంలోకి వచ్చాక పూర్తిచేస్తా మన్నారు. వైసీపీకి ఎక్కడ క్రెడిట్ వస్తుందేమోనని పేదలకు నష్టం చేయడం సరికాదన్నారు. సీఎం చంద్రబాబు కొత్త స్కామ్లు సృష్టిస్తున్నారని, ఒక్కరోజు యోగా కార్యక్రమానికి రూ.300 కోట్లు ఖర్చు చేశారని వైఎస్ జగన్ చెప్పుకొచ్చారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీ కరణకు వ్యతిరేకంగా సేకరించిన కోటి సంతకాల ప్రతులను లోక్భవన్లో గవర్నర్ నజీర్ అహ్మద్ కు అందజేశారు. అనంతరం ఆయనతో కొద్దిసేపు భేటీ అయి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేస్తున్నామని ప్రజల వద్ద నుంచి సేకరించిన ప్రతులను వైఎస్ జగన్ గవర్నర్ కు అందజేశారు. అనంతరం జగన్ మీడియాతో మాట్లాడుతూ 'పీపీపీకి వ్యతిరేకంగా కోటి నాలుగు లక్షల మంది సంతకాలు చేశారు. గవర్నర్ను కలిసి సీఎం చంద్రబాబు చేస్తున్న అన్యాయాన్ని వివరించామన్నారు. ప్రజల ఆకాంక్షను గవర్నర్కి తెలియజేశామని గవర్నర్ మంచి మనసుతో అన్ని విన్నారని జగన్ పేర్కొన్నారు. దేశ చరిత్రలో ఎక్కడా ఇలాంటి ఉద్యమం జరగలేదన్నారు. గ్రామ స్థాయి నుంచి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి నిరసన తెలపటం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తించి ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలని జగన్ పేర్కొన్నారు. కూటమి నేతలు అమలు చేయాలనుకున్న పీపీపీ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని సామాన్యులు ప్రైవేటు ఆస్పత్రికి వెళ్తే ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తుందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ కాలేజీలు మొత్తం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతే ఆసుపత్రులు నియంత్రణ ఉండదన్నారు. ప్రజలు దోపిడీకి గురవుతారన్నారు. ప్రభుత్వ హాస్పిటల్స్ ఉంటే ప్రైవేటు హాస్పిటల్స్ కంట్రోల్లో ఉంటాయని ప్రభుత్వం నడపడం వల్ల వైద్యం, విద్య తక్కువ రేట్లకి అందుబాటులోకి వస్తుందని అంతా ప్రైవేటు అయితే ఇంకా సామాన్య పిల్లలు వైద్య విద్య చదవగలరానని వైయస్ జగన్ ప్రశ్నించారు. కాలేజీలు ప్రయివేటుకు ఇవ్వడం పెద్ద స్కామ్. జీతాలు ఇవ్వడం కూడా అతిపెద్ద స్కామ్. సీఎం చంద్రబాబు స్కామ్లలో కొత్త స్కామ్లు సృష్టిస్తున్నాడు. దేశ చరిత్రలో ఇలాంటి స్కామ్ ఎక్కడా చూసి ఉండరు. వెయ్యి కోట్లు ఏడాదికి పెట్టలేరా. పెట్టకపోతే అలా వదిలేయండి. మేము అధికారంలోకి వచ్చాక పూర్తి చేస్తాం. మాకు క్రెడిట్ వస్తుందేమో అని పేదలకు నష్టం చెయ్యడం సరికాదు. 17 మెడికల్ కాలేజీలు లక్ష కోట్ల ఆస్తి. కోట్ల మంది జీవితాల్లో వెలుగులు నింపుతాయి. రేపు కోర్టులో అఫిడవిట్ ఫైల్ చేస్తాం. చంద్రబాబు చర్మం మందం. ఇంత చేసినా ఆయనలో మార్పు రాకపోవచ్చు. హెరిటేజ్ కి గవర్నమెంట్ పేరు పెడితే ప్రభుత్వానిది అయిపోతుందా. రుషికొండ విశాఖకు ఆణిముత్యంలా ఉంది. రూ.240 కోట్లు ఖర్చు చేసి బ్రహ్మాండమైన భవనాలు కట్టాం. ఎవరైనా వీఐపీలు వస్తే అందులో ఉండవచ్చు. విశాఖ మొత్తానికి తలమానికంగా ఉంది. టూరిస్ట్ ప్లేస్ లా ఉంది. యోగా డేకి రూ.330 కోట్లు వృధా చేశారని మాజీ సీఎం జగన్ మండిపడ్డారు..

# నూతన ఎంపీపీని కలిసి శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎంపీపీ




- నూతన ఎంపీపీని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన - మాజీ ఎంపీపీ, అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షుడు పాగొండ ఖలీల్ అహ్మద్

**నేటి సాక్షి, అన్నమయ్య జిల్లా, శర్మ, డిసెంబర్ 18 :** అన్నమయ్య జిల్లా -:- స్థానిక నియోజకవర్గ పరిధిలోని బి.కొత్తకోట మండల కేంద్రమైన స్థానిక ఎంపీపీ గా మునుపు కొనసాగిన లక్ష్మీ నరసమ్మ పై ఎంపీటీసీలు తిరుగుబావుట ఎగరవేశారు. గత ప్రభుత్వం వైసీపీ హయాంలో నియోజకవర్గ శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి ఈమెను ఎంపిక చేశారు. అనంతరం పార్టీ ఓటమి చెందాక వైసీపీని వీడి అధికార పార్టీ నేతలతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారని అప్పట్లో పెద్ద రూమరే చెల్లరేగింది. రాను రాను ఎంపీటీసీ లకు ఎంపీపీకి సమన్వయం లోపించి పాలన గాడి తప్పింది. ఎంపీపీ నియంతృత్వ వైఖరి ఎంపీటీసీలు బహిరంగ విమర్శించే స్థాయికి వెళ్లారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎంపీపీ పై అవిశ్వాస తీర్మానాన్ని పెట్టడానికి పదిమంది సభ్యులు ఎంపీడీవో కు లేఖ రాశారు. అప్పటినుంచి సస్పెన్స్ లో కొనసాగింది. మరో మారు గత నెల 16న మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణిని కలిసి అవిశ్వాస తీర్మానానికి అనుమతి ఇవ్వాలని కోరారు. ఈనెల 12వ తారీకున ఎంపీటీసీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి అవిశ్వాస తీర్మానంపై చర్చించారు. ఆమెకు వ్యతిరేకంగా పది మంది ఎంపీటీసీలు అనుకూలించారు. ఎట్టకేలకు ఆమెను ఎంపీపీ పదవి నుంచి తొలగిస్తూ సబ్ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటి నుంచి ఎంపీపీ స్థానం ఖాళీగా ఉంది. స్థానిక వైసీపీ శ్రేణులతో చర్చించిన తంబళ్లపల్లి శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి ఎట్టకేలకు ఓ నిర్ణయానికి వచ్చారు. గురువారం ద్వారకానాథ్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎంపీపీ ఖలీల్ అహ్మద్ సూచనల మేరకు నూతన ఎంపీపీగా రాధప్రదీప్ రెడ్డిని ఎంపీటీసీలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో సస్పెన్స్ వీడింది. నూతన ఎంపీపీగా రాధప్రదీప్ రెడ్డి ఎన్నిక కావడంతో ఎంపీపీ కార్యాలయంలో పెద్ద ఎత్తున ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలియజేసి అభినందనలతో ముంచేత్తారు. మాజీ ఎంపీపీ ఖలీల్ అహ్మద్ మరియు వైసీపీ శ్రేణులు నరసింహా నాయుడు (గట్లమీద) రాజశేఖర్ రెడ్డి, జయరాం రెడ్డి తదితరులు ఆమెను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మా కుటుంబం పార్టీకి చేసిన సేవలను గుర్తించి ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాకు పదవి రావడం కొరకు ఎంతో సహకరించిన రాష్ట్ర మాజీ మంత్రి, పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, తంబళ్లపల్లి శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి లకు ఎప్పటికీ రుణపడి ఉంటానని వీళ్ళ సహకారంతోనే నాకు పదవి వరించిందని ఆమె తెలియజేస్తూ బి. కొత్తకోట మండల మాజీ ఎంపీపీ పాగొండ ఖలీల్ అహ్మద్ సూచనలతోనే నా పేరును ప్రతిపాదించారు. పెద్దిరెడ్డి కుటుంబానికి శిరస్సు వచ్చి పాదాభివందనం చేస్తున్నానని అలాగే మాజీ ఎంపీపీ ఖలీల్ అహ్మద్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని నాకు మద్దతిచ్చిన తోటి ఎంపీటీసీ సభ్యులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నానని నూతన ఎంపీపీ రాధప్రదీప్ రెడ్డి తెలిపారు..

# నైపుణ్యాలతో ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి





- విద్యే నిజమైన సంపద.!
- కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ ఆధ్వర్యంలో టీ-హబ్ & టీ-వర్క్స్ సందర్శించిన మెట్పల్లి-కోరుట్ల డిగ్రీ కళాశాల విద్యార్థులు

**నేటి సాక్షి - కోరుట్ల ( రాధారపు నర్సయ్య ) :** కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ గారి ఆధ్వర్యంలో మెట్పల్లి-కోరుట్ల డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థులు హైదరాబాద్లోని ప్రతిష్టాత్మక 'టీ-హబ్'..'టీ-వర్క్ 'ను సందర్శించారు. డిసెంబర్ 18న నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు స్టార్టప్ ప్రపంచం, నైపుణ్యాభివృద్ధి అవకాశాలపై ప్రత్యక్ష అవగాహన పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ విద్యే నిజమైన సంపద, డిగ్రీతో పాటు నైపుణ్యాలు పెంచుకుని అవకాశాలను సృష్టించుకోవాలి అంటూ విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

## స్టార్టప్ ప్రపంచానికి ప్రత్యక్ష పరిచయం

ఎమ్మెల్యే సంజయ్ ప్రత్యేక చొరవతో నిర్వహించిన ఈ విద్యా ప్రయోజనకర పర్యటనలో విద్యార్థులు ప్రపంచవిఖ్యాత 'టీ-హబ్'..'టీ-వర్క్స్' కార్యకలాపాలను దగ్గరగా చూశారు. స్టార్టప్లు ఎలా ప్రారంభమవుతున్నాయి, కొత్త ఆలోచనలు పరిశ్రమలుగా ఎలా రూపాంతరం చెందుతున్నాయి, యువతకు అందుబాటులో ఉన్న శిక్షణ, సాంకేతిక మద్దతు ఏ విధంగా ఉంటుందో ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ అనుభవం విద్యార్థుల్లో ఆలోచనలకు కొత్త దిశనిచ్చి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించింది. డిగ్రీతోనే ఆగొద్దు నైపుణ్యాలతో ముందుకు సాగండి సందర్శన సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ గారు మాట్లాడుతూ, విద్యే నిజమైన సంపద. డిగ్రీ పూర్తి చేయడమే లక్ష్యంగా కాకుండా, నైపుణ్యాలను పెంపొందించుకుని అవకాశాలను సృష్టించుకునే స్థాయికి విద్యార్థులు ఎదగాలి.. అని సూచించారు. 'టీ-హబ్'..'టీ-వర్క్స్' ద్వారా లభిస్తున్న స్టార్టప్, స్కిల్ డెవలప్మెంట్ అవకాశాలను పూర్తిగా వినియోగించుకోవాలని, భవిష్యత్తులో ఉద్యోగం కోరుకునే స్థితి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా ప్రపంచ స్థాయి అవకాశాలను అందుకోవాలన్నదే తన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## మారిన దృక్పథం- పెరిగిన ఆశయాలు

ఈ పర్యటన విద్యార్థుల్లో స్పష్టమైన మార్పు తీసుకొచ్చింది. 'ఇది మాకు కొత్త దృక్పథాన్ని ఇచ్చింది. ఆత్మవిశ్వాసం పెరిగింది. భవిష్యత్తులో సొంత స్టార్టప్లు ప్రారంభించి ఇతరులకు ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలనే ఆశయం కలిగింద'ని విద్యార్థులు తెలిపారు. తమ భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ గారికి వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రామీణ యువతకు కొత్త దారులు

కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ ఇలాంటి కార్యక్రమాలు గ్రామీణ విద్యార్థులకు ప్రపంచ స్థాయి వేదికలకు దారి చూపుతున్నాయని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్శనతో విద్యార్థులు కేవలం డిగ్రీతో పరిమితమవకుండా, నైపుణ్యాలతో సాధికారులుగా మారే దిశగా ముందడుగు వేశారు. ఇది వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.